మహాజాతర.. పనులు పాతర

- అభివృద్ధి పనులకు పదిరోజులే డెడ్‌లైన్
- నత్తనడకన సాగుతున్న మరుగుదొడ్ల నిర్మాణం
- జాడలేని తాగునీటి పైపులైన్ వర్క్స్
- వైద్య సేవలు అంతంతమాత్రమే..

\- ఎస్‌ఎస్ తాద్వాయి



కొనసాగుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులు

మేడారం సాక్షి ఫోకస్

- వివరాలు 8,9లో



సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ

సాక్షి 24|7
వరంగల్ అర్బన్
శుక్రవారం 5-1-2018

తరలివచ్చి.. మొక్కులు తీర్చి..

సమ్మక్క-సారలమ్మ మహాజాతర సమయం దగ్గర పడుతున్న కొద్దీ మేడారంలో భక్తుల సందడి పెరుగుతోంది. వనదేవతలను దర్శించుకునేందుకు గురువారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగులో స్నానాలు ఆచరించి అమ్మలకు పసుపు, కుంకుమ, బంగారం, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మేడారంలోని చెట్ల కింద వంటలు చేసుకుని ఆనందంగా గడిపారు.


ఉపాధిలో మహిళా శక్తి

మహిళా సంఘాలకు సామాజిక తనిఖీల బాధ్యత

- సంఘాల్లో సభ్యత్వంతో పాటు ఉపాధి పనులకు వెళ్లిన వారికే చోటు
- మూడు లేదా నలుగురితో బృందం ఏర్పాటు
- ఆ తర్వాత శిక్షణ

భీమదేవరపల్లి(హుస్నాబాద్): ఒకప్పుడు గడపదాటి బయటకు రాని మహిళలు.. నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పొదుపుతో ప్రారంభమైన మహిళా శక్తి క్రమక్రమంగా పుంజుకుంటోంది. ప్రభుత్వం ద్వారా రుణాలు పొందడం, తద్వారా చిరు వ్యాపారం చేస్తూ కుటుంబ పోషణకు అండగా నిలుస్తున్నారు. గ్రామాల్లో మినీ బ్యాంకులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతోపాటుగా బ్యాంకర్లు సైతం డ్వాక్రా సంఘాల రుణాలకే ప్రాధాన్యం ఇస్తుండడంతో మహిళలపై నమ్మకం మరింత ఏర్పడింది. దీంతో ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో సామాజిక తనిఖీ బాధ్యతను

- మిగతా 2లో



ఒకే లక్ష్యం.. ఆలోచన.. సర్వీస్

రాష్ట్రం అంతటా ఒకే పోలీసింగ్

- పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి
- పోలీస్ శాఖలో నెలవారీ పదోన్నతులు
- డీజీపీ మహేందర్‌రెడ్డి వెల్లడి
- జిల్లాలో తొలిసారిగా పర్యటించిన పోలీస్ బాస్
- కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం
- అధికారులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం : ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే లక్ష్యం.. ఒకే ఆలోచన.. ఒకే సర్వీస్ విధానంలో పోలీసులు సేవలందించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలు మన దగ్గరకు వచ్చినా.. మనం వాళ్ల దగ్గరకు పోయినా.. వారి అవసరాలను గుర్తుంచుకుని ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఒకే లక్ష్యం అంటే రాష్ట్రం అంతటా ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ.. ఒకే ఆలోచన అంటే ధనిక, పేద, ఆడ, మగ తేడా లేకుండా.. ఒకే సర్వీస్ అంటే ఏ పోలీస్ అధికారి ఉన్నా బాధితులకు సత్వర న్యాయం అందించడమని వివరించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి గురువారం

- మిగతా 2లో



మృతుడు కుమారస్వామి (ఫైల్)

ప్రాణం తీసిన పీడీఎస్ దందా

వాటాల పంపిణీలో వివాదం • కళ్లలో కారంపొడి చల్లి దాడి • అక్కడికక్కడే ఒకరి మృతి

రేషన్ బియ్యం వ్యాపార లావాదేవీలు ఓ వ్యక్తి హత్యకు దారితీశాయి. హసన్‌పర్తిలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వాటాల పంపిణీలో తేడాలే ఇందుకు కారణమని తెలిసింది.

\- హసన్‌పర్తి

- వివరాలు 3లో

దక్షిణ కొరియా బృందం పర్యటన

టెక్స్‌టైల్ పార్క్ స్థలాన్ని సందర్శించిన సభ్యులు



స్థలంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న దక్షిణ కొరియా బృందం

ఆత్మకూరు(పరకాల): గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని శాయంపేటహవేలి–స్టేషన్‌చింతలపెల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న కాకతీయ మెగా టక్స్‌టైల్ పార్కు స్థలాన్ని దక్షిణ కొరియా టెన్నికల్ బృందం గురువారం సందర్శించింది. టీఎస్‌ఐఐసీ అధికారులతో కలిసి బృందంలోని సభ్యులు రాయనికుంట ప్రాంతంలో పార్కు కోసం సేకరించిన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా టెక్స్‌టైల్ పార్కులో కంపెనీలకు ఎలాంటి సదుపాయాలు కల్పిస్తారనే విషయాన్ని టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ రథన్‌రాథోడ్‌తోపాటు ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. విద్యుత్, నీరు, రోడ్డు, రవాణా సదుపాయాల కల్పన విషయమై అధికారుల నుంచి సమాచారం సేకరించారు. బృందం సభ్యులకు టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ రథన్‌రాథోడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.రాజ గోపాల్, మేనేజర్ రాందాస్, ఎలక్ట్రికల్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పార్కు వద్ద కల్పించే మౌలిక వసతులను గురించి వివరించారు.

రెండో సారి రాక..

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో వస్త్ర పరిశ్రమను నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించిన అనంతరం స్థల పరిశీలన కోసం దక్షిణ కొరియా బృందం గత ఏడాది ఆగస్టు 17న ఇక్కడికి వచ్చింది. ఆ దేశ జౌళి పరిశ్రమల సమాఖ్య(కొఫోటీ) చైర్మన్, యంగ్‌వన్ కార్పొరేషన్ యజమాని కిహాక్ సంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం పార్కు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించింది. ఆ తర్వాత మళ్లీ 'కఫోటీ' టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌లు గురువారం పార్కు స్థలాన్ని పరిశీలించారు. గత ఏడాది అక్టోబర్ 22న సీఎం కేసీఆర్ టెక్స్‌టైల్ పార్కు శంకుస్థాపన చేయగా అదే రోజు 14 కంపెనీలు రూ.3,900 కొట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన విషయం తెలిసిందే.

డాక్టర్ 'ఒడితెల' కుటుంబానికి పరామర్శ



కెప్టెన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పొన్నాల లక్ష్మయ్య

వరంగల్/కాజీపేట: డాక్టర్ ఒడితెల విశ్వనాథ రావు ఇటీవల మృతి చెందగా, ఆయన కుమారుడు డాక్టర్ పవన్, సోదరుడు రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యే సతీష్‌బాబలను గురువారం పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య కెప్టెన్ ఇంట్లో పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే కాజీపేటలోని విశ్వనాథరావు ఇంట్లో కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పొన్నాల వెంట డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, గ్రేటర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ల శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి, పీసీసీ కార్యదర్శి ఈవీ.శ్రీనివాస రావు, జక్కుల రవీందర్ పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి న్యూ ఇయర్ విషెస్ తెలుపుతున్న నేతలు

హన్మకొండ: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వరంగల్ నగర పాలక సంస్థలోని 44వ డివిజన్‌కు జరుగుతున్న ఉప ఎన్నికపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఎన్నికల గెలుపునకు పలు సూచనలు చేసినట్లు వాసుదేవరెడ్డి తెలిపారు.

ఒకే లక్ష్యం.. ఒకే ఆలోచన.. ఒకే సర్వీస్



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆపరేటింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న డీజీపీ



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

▶మొదటిపేజీ తరువాయి

తొలిసారిగా వరంగల్ అర్బన్ జిల్లాకు వచ్చారు. హెలికాప్టర్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దిగారు. ఆయనకు వరంగల్ కలెక్టర్ అమ్రపాలి, పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు, డీసీపీలు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి డీజీపీ కమిషనరేట్‌కు వెళ్లి కమాండ్ కంట్రోల్ రూం శిలాఫలకాన్ని ఆవిష్కరించగా, కలెక్టర్ అమ్రపాలి రిబ్బన్ కట్ చేసి కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభించారు. ఆ తర్వాత డీజీపీ నగరంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీసీ కెమెరాల పనితీరును, కమిషనరేట్‌లో నిర్మాణంలో ఉన్న నూతన కమిషనరేట్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, వివిధ విభాగాల అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆ తర్వాత డీజీపీ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కమిషనరేట్లు, పోలీసు కార్యాలయాల్లో ఒకే రకమైన పోలీసు విధానం కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా ఇకపై ఎలాంటి విధానం కొనసాగాలి, ప్రజలు ఏం కోరుకుంటున్నారు, వారికి దగ్గర కావడానికి ఏం చేయాలి, ఏం చేస్తే వారి మనసులు గెలుచుకుంటాం, ప్రజల జీవన ప్రమాణాలు పెంచటానికి ఏం చేయాలి అనే అంశాలపై పోలీసు అధికారులతో కూలంకుషంగా చర్చించినట్లు వెల్లడించారు. ప్రజలకు పోలీసులు జవాబుదారితనంగా ఉండాలని, ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం కలిగించాలన్నారు.







హెలికాప్టర్ దిగి వస్తూ.., కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీపీ

థర్డ్ పార్టీతో రేటింగ్...

పోలీస్ స్టేషన్ల పనితీరు, పోలీస్ అధికారులు, సిబ్బంది పని తీరు గురించి థర్డ్‌పార్టీ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించనున్నట్లు డీజీపీ తెలిపారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్లకు, వ్యక్తిగతంగా పోలీస్ అధికారులకు రేటింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. దీంతో పోలీసుల పని విధానంలో నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖలోని అన్ని విభాగాల్లో ఖాళీలను నెలవారీ పదోన్నతులతో భర్తీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అధికారులు కోర్టులకు ఎక్కవద్దని, సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించాలని, కోర్టులకు ఎక్కడం వల్ల చాలా మందికి నష్టం కలుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో ఐజీ నాగిరెడ్డి, వరంగల్ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు పాల్గొన్నారు. కాగా, వరంగల్ అర్బన్ జిల్లా పర్యటనకు ముందు డీజీపీ మహబూబాబాద్ జిల్లాలో పర్యటించారు. గుమ్ముడూరులోని సర్వేనంబరు 287లో జిల్లా పోలీసు కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని, జిల్లా పోలీసు కార్యాలయాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా.. డీజీపీని పోలీస్ అమరుల కుటుంబ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. డీజీపీ మహేందర్‌రెడ్డి వెంట నార్త్ జోన్ ఐజీ నాగిరెడ్డి ఉన్నారు.

'ఉపాధి'లో మహిళా శక్తి

▶మొదటిపేజీ తరువాయి

సైతం వారికే అప్పగించాలని నిర్ణయించింది. ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో చేపట్టిన పనులపై ఏడాదికోమారు కొంత మంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి వారితో సోషల్ ఆడిట్‌ను నిర్వహించేవారు. ఆ నిరుద్యోగులు వివిధ ప్రభుత్వ సెక్టార్లలో పనిచేస్తుండడంతో సోషల్ ఆడిట్ సమయానికి వారు ఎగనామం పెట్టేవారు. ఈ క్రమంలో తిరిగి కొత్తవారికి శిక్షణ ఇవ్వాల్సి వచ్చేది. ఇలా కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈజీఎస్ పనులకు వెళ్లిన వారికి పనుల మీద పట్టు ఉండడంతోపాటు మహిళలను భాగస్వాములను చేయాలనే సంకల్పంతో సోషల్ ఆడిట్ ప్రక్రియను వారికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతగా జనగామ, జయశంకర్ భూపాలపల్లి, యాద్రాది, ఆదిలాబాద్, భద్రాచలం జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. త్వరలోనే అన్ని జిల్లాలో ప్రవేశపెట్టనుంది.

పారదర్శకత కోసమే...

వలసలు నివారించి ఉన్న ఊళ్లోనే పని కల్పించేందుకు చేపట్టిన ఈజీఎస్ పథకం కూలీలకు వరంగా మారినప్పటికీ.. పనుల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఒకే పనిని పలు మార్లు చేసినట్లు లెక్కల్లో చూపడం వంటి తదితర అవినీతి బాగోతాలు పలు మండలాల్లో జరిగిన సామాజిక తనిఖీల్లో బయటపడుతున్నాయి. సామాజిక తనిఖీ చేపట్టే వారిని ఔట్ సోర్సింగ్ ద్వారా తీసుకుని వారికి శిక్షణ ఇస్తున్నారు. కానీ.. వారు పూర్తి స్థాయిలో విధుల్లో లేకపోవడం.. బాధ్యతా రహితంగా వ్యవహరించడంతోపాటు ఆర్థికంగా నష్టం వాటిల్లడంతో మహిళా సంఘాలకే సోషల్ ఆడిట్ బాధ్యతలు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మార్గదర్శకాలు ఇవే..

విలేజ్ రిసోర్స్ పర్సన్ పేరిట ఈ నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. విలేజ్ రిసోర్స్ పర్సన్‌గా పనిచేయాలంటే ఆ గ్రామంలో మహిళ సంఘాల్లో సభ్యురాలిగా ఉంటూ ఈజీఎస్ పనులకు వెళ్లిన మహిళ అయి ఉండాలి. పదో తరగతి.. లేని పక్షంలో కనీసం 7వ తరగతిలోనైనా ఉత్తీర్ణత సాధించాలి. తప్పనిసరిగా వివాహితురాలై ఉండాలి. ప్రస్తుతం మేటీగా విధులు నిర్వర్తిస్తున్న మహిళలకు అవకాశం లేదు. ఇందులో వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం కల్పించనున్నారు. ఆయా గ్రామంలో గ్రామ సభ ద్వారా ముగ్గురు లేదా నలుగురిని ఎంపిక చేయనున్నారు. అనంతరం వీరికి శిక్షణ ఇచ్చి సోషల్ ఆడిట్ ప్రక్రియలో వినియోగించుకోనున్నారు.

12న ముగ్గురు మంత్రుల రాక



సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, టీఆర్‌ఎస్ నాయకులు

కురవి(డోర్నకల్): ఈనెల 12న కురవి మండలకేంద్రానికి రాష్ట్ర మంత్రులు ముగ్గురు రానున్నట్లు ఎంపీపీ బజ్జూరి ఉమా పిచ్చిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కొణతం కవిత తెలిపారు. గురువారం మండలంలోని అయ్యగారిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మంత్రుల పర్యటన వివరాలు వెల్లడించారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కురవిలో జరగనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. రూ.60కోట్లతో చేపట్టనున్న ఎస్సారెస్పీ పునరుజ్జీవ పనులు, రూ.5కోట్లతో చేపట్టే వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. అదే రోజు నాగేంద్రస్వామి ఆలయ ఆవరణలో భారీ బహిరంగసభ ఉంటుందని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య, ఆలయ చైర్మన్ బాదావత్ రాజునాయక్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ ముండ్ల రమేష్, నాయకులు బాదావత్ శ్రీను, బండి యతిరాజ్, నల్ల ఉపేందర్, వెంకన్న పాల్గొన్నారు.

ప్రాణం తీసిన బియ్యం దందా

- హసన్‌పర్తిలో వ్యాపారి హత్య
- కళ్లలో కారంపొడి చల్లి దాడి
- పథకం ప్రకారమే ఘాతుకం




కుమారస్వామి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ కిషన్, (ఇన్‌సెట్‌లో) చిత్తారి కుమారస్వామి మృతదేహం

హసన్‌పర్తి: పీడీఎస్ బియ్యం దందా ఓ వ్యాపారి ప్రాణం తీసింది. లాభాల విషయంలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ప్రత్యర్థి వర్గాలు చేసిన దాడిలో హసన్‌పర్తికి చెందిన చిత్తారి కుమారస్వామి (35) ప్రాణాలు వదిలాడు. హసన్‌పర్తి మండల కేంద్రంలో విద్యానగర్ (నారాయణ కళా మందిర్) వద్ద బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన చిత్తారి కుమారస్వామి, చిత్తారి వెంకటేష్ అలియాస్ అబ్రహం సమీప బంధువులు. వీరితోపాటు మరికొంతమంది పీడీఎస్ బియ్యం వ్యాపారానికి తెరలేపారు. కొంతకాలంగా వివిధ వర్గాలు, డీలర్ల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఆ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు ఎక్కువ ధరకు విక్రయించడం ప్రారంభించారు. వీరి వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా సాగుతోంది. పీడీఎస్ బియ్యం దందాలో లాభాలు రావడంతో కుమారస్వామి, వెంకటేష్ అలియాస్ అబ్రహం పాత ఇనుప సామాను వ్యాపారానికి స్వస్తి పలికారు.

టాస్క్‌ఫోర్స్ దాడులతో వేర్వేరు వ్యాపారాలు

ఇటీవల పీడీఎస్ బియ్యం నిల్వలపై టాస్క్‌ఫోర్స్ దాడులు అధికమయ్యాయి. దీంతో బియ్యం వ్యాపారం తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో వెంకటేష్, కుమారస్వామి వేర్వేరుగా వ్యాపారాన్ని కొనసాగించడం ప్రారంభించారని సమాచారం. ఇద్దరు కలిసి వ్యాపారం చేసినప్పుడు వచ్చిన లాభాల విషయంలో వీరికి కొంతకాలంగా విభేదాలు వచ్చాయి. ఓ మహిళతో కొనసాగిస్తున్న వివాహేతర సంబంధానికి కుమారస్వామి అడ్డు తగిలి పంచాయితీ నిర్వహించి, వెంకటేష్‌కు జరిమానా విధించాడు. దీంతో కుమారస్వామిపై వెంకటేష్ పగ పెంచుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు. అయితే పైకి కుమారస్వామితో స్నేహంగానే ఉంటూ లోపల మాత్రం వెంకటేష్ పగతో రగిలిపోయేవాడని స్థానికులు ద్వారా తెలిసింది.

పథకం ప్రకారం హత్య..

కుమారస్వామిని ఎలాగైనా హత్య చేయాలని వెంకటేష్ నిర్ణయించుకుని కారం పొడిని సిద్ధంగా ఉంచుకున్నాడు. తర్వాత పక్కనే ఉన్న వైన్స్‌షాపు నుంచి మద్యం కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి విద్యానగర్ (నారాయణ కళామందిర్) పక్కనే కుమారస్వామి, వెంకటేష్, పోతరాజు మధుకర్, బందెల అవినాష్ చిత్తుగా మద్యం సేవించారు. ఈ క్రమంలో వెంకటేష్, కుమారస్వామి మధ్య వాగ్వాదం చేసుకుంది. దీంతో వెంకటేష్ తన వెంట తీసుకొచ్చిన కారం పొడిని కుమారస్వామి కళ్లలో చల్లి దాడికి పాల్పడ్డాడు. వెంకటేష్ కిక్ బాక్సర్ కావడంతో గుప్త అవయవాలపై వేసిన బలమైన వేటుకు కుమారస్వామి ప్రాణాలు వదిలాడు. అనంతరం హతుడి సమీప బంధువు చందుకు చెప్పినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ సత్యనారాయణ, హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా హతుడి కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల వారిని విచారించారు. సంఘటన స్థలంలో జాగిలాలతో గాలింపు చర్యలు చేపట్టారు. పోతరాజు మధుకర్, అవినాష్‌తోపాటు వెంకటేష్ ఇళ్లలోకి జాగిలాలు వెళ్లాయి. క్లూస్ టీం సంఘటన స్థలాన్ని చేరుకుని వేలిముద్రలను సేకరించింది.

ముల్కనూర్‌లో విషాదం

భీమదేవరపల్లి: హసన్‌పర్తిలో హత్యకు గురైన చిత్తారి కుమారస్వామి స్వగ్రామమైన భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ బుడిగజంగాల కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. గతంలో కుమారస్వామి ముల్కనూర్ పరిసర గ్రామాల్లో ఇనుప సామానుకు ఉల్లిగడ్డలు విక్రయిస్తూ జీవనం కొనసాగించేవాడు. కొన్నేళ్లుగా హసన్‌పర్తిలో జీవిస్తున్నాడు. కాగా మృతుడికి భార్య స్వప్న, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

- రెండు కార్లు, ప్రింటర్, స్కానర్, రూ.1.12 లక్షలు స్వాధీనం : డీసీపీ మల్లారెడ్డి



నకిలీ నోట్లను చూపిస్తున్న డీసీపీ మల్లారెడ్డి

జనగామ: నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ బాపురెడ్డి, సీఐ ముష్క శ్రీనివాస్‌తో కలిసి డీసీపీ మల్లారెడ్డి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని శ్రీ భవాని బ్యాంగిల్ స్టోర్‌లో గత నెల 28 రాత్రి ఓ మహిళ కారులో వచ్చి రూ.270 విలువ గల వస్తువులను కొనుగోలు చేసిందని తెలిపారు. రూ.2 వేల నకిలీ నోటు ఇవ్వగా..గమనించని వ్యాపారి రూ.1730 ఇవ్వగా తీసుకుని మాయమై పోయిందని స్పష్టం చేశారు. కొద్ది సేపటి తర్వాత అనుమానం వచ్చిన వ్యాపారి నోటును పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పెషల్ టీంను ఏర్పాటు చేసి రంగంలోకి దింపామని తెలిపారు. సీసీ పుటేజీల ద్వారా ఏపీ 36 ఏ 0405 నంబరు గల కారులో మహిళ వచ్చినట్లుగా గుర్తించామన్నారు. కారును హన్మకొండలోని ఓ గ్యారేజీలో కొనుగోలు చేసినట్లుగా నిర్ధారించుకున్నామని చెప్పారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన బెజవాడ రాజీవ్ తొర్రూరుకు వచ్చి హోం నీడ్స్ వ్యాపారం చేశాడు. అక్కడే చాందిని అనే మహిళ రాజీవ్‌తో పరిచయం ఏర్పడిందని తెలిపారు. చాందినికి ఇద్దరు పిల్లలు షఫి, రఫి జన్మించిన తర్వాత భర్త వదిలేయడంతో రాజీవ్‌తో సహజీవనం సాగిస్తోందన్నారు. మూడు సంవత్సరాల క్రితం తొర్రూరు నుంచి వారు హన్మకొండలోని వినాయక్‌నగర్ కొత్తూరు జెండాకు మకాం మార్చినట్లు వివరించారు. షఫి, రాజీవ్, చాందినీ నకిలీ నోట్లు చెలామణి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 5 నెలల క్రితం హెచ్‌పీ కలర్ ప్రింటర్‌ను కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రూ.7లక్షలకు పైగా నకిలీ నోట్లను చెలామణి చేశారు. నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న రాజీవ్, ఎండీ.చాందిని, ఆమె కుమారుడు షఫిని ఈనెల 3న హన్మకొండలోని వినాయక్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి నుంచి రూ.1.12 లక్షల విలువగల రూ.2 వేల నకిలీ నోట్లు, బ్యాంకు ఖాతాలో రూ.1.30 లక్షలు, రూ.పది వేల అసలునోట్లతో పాటు రెండు కార్లు, స్కానర్, ప్రింటర్, పేపర్, డ్యాక్యుమెంట్లు, ఐదు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు డీసీపీ వివరించారు.

ఖమ్మంలో నిందితుల అరెస్ట్

ఖమ్మం క్రైం: కుమారస్వామి హత్య కేసులో నిందితుల ను ఖమ్మం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. హసన్‌పర్తిలో కుమారస్వామిని బుధవారం అర్ధరాత్రి స్వయాన తమ్ముడు, మరో ఇద్దరు కలిసి హత్య చేసి కారులో ఖమ్మం పారిపోయారు. నిందితులు ఖమ్మంలో ఉన్నట్లు హసన్‌పర్తి పోలీసులు తెలుసుకుని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులను సంప్రదించారు. హసన్ పర్తి పోలీసులు, ఖమ్మం వన్‌టౌన్ సీఐ రమేష్, ఏఎస్సై రాము స్టేషన్ రోడ్డులోని సిటీ లాడ్జిలో ఉన్న గదిపై దాడిచేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వర్ధన్నపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పసునూరి భిక్షపతి (55) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం..మండలంలోని ఇల్లందకు చెందిన పసునూరి భిక్షపతి వారం రోజుల క్రితం జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భిక్షపతి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో కూలీ..

మడికొండ: విద్యుదాఘాతంతో ప్రైవేట్ కూలీ మృతి చెందిన సంఘటన టేకులగూడెంలో జరిగింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమా ర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ గ్రామానికి చెందిన గుగులోతు పూల్‌సింగ్(30) టేకులగూడెం గ్రామ శివారులో దినసరి కూలీగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో విద్యుత్ పోల్‌ను అమరుస్తున్న క్రమంలో పైన ఉన్న 33 కేవీ తీగలు తగిలాయి. చేతులు కాలిపోయి షాక్‌కు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. భార్య గుగులోతు నీల ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్ వీరన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి దుర్మరణం

రఘునాథపల్లి: కూలి పనులకు వెళ్లి వస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి దుర్మరణం చెందిన సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలోని వెల్దిక్రాస్‌రోడ్డు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్మెట మండలం మచ్చుపహాడ్ గ్రామ శివారు లోక్యతండాకు చెందిన అజ్మీరా లింగా (29) తల్లిదండ్రులకు ఆసరాగా కూలి పనులకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం మండలంలోని జాఫర్‌గూడెం శివారు కుసుంబాయితండా వాసులతో కలిసి ట్రాక్టర్‌పై కంచనపల్లిలో సెంట్రింగ్ పనులకు వెళ్లాడు. పనులు పూర్తయ్యాక రాత్రి కూలీలతో కలిసి అదే ట్రాక్టర్‌లో లింగా ఇంజన్‌పై కూర్చొని తిరిగి బయలుదేరాడు. వెల్ది క్రాస్ రోడ్డు వద్ద గుంత కారణంగా ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్న లింగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. వెనుక ట్రాక్టర్‌కు ఉన్న మిల్లర్ టైరు ఎక్కింది. దీంతో లింగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి తండ్రి సక్రు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌రావు తెలిపారు.

తిరుమల సమాచారం



తిరుమలలో గురువారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు–	ఖాళీ లేవు
రూ.50 గదులు–	ఖాళీ లేవు
రూ.100 గదులు–	ఖాళీ లేవు
రూ.500 గదులు–	ఖాళీ లేవు

సేవలు

సహస్ర దీపాలంకరణ–	ఖాళీ లేవు
వసంతోత్సవం–	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం–	ఖాళీ లేవు

శుక్రవారం ప్రత్యేక సేవ : అభిషేకం

వరంగల్ మార్కెట్ ధరలు

వస్తువులు (క్వింటాల్)	గరిష్ఠం (రూ.)	కనిష్ఠం (రూ)
విజయమసూరి(పాతవి)	1950	1850
ఎంటీయూ 100	1600	1600
ఎంటీయూ1001 రకం	1450	1450
వ్యాపారస్థులు(పాతవి)	1219	1149
పల్లికాయ	4511	4000
కందులు	4059	3280
పెసర్లు	4659	4608
మినుములు	4910	4910
అలుచందలు(నల్లవి)	5004	4950
అలుచందలు(ఎర్రవి)	4455	4455
అలుచందలు(తెల్లవి)	4329	4312
పత్తి(క్వింటాల్)		
వ్యాపారస్తులు	5030	4725
మిర్చి(క్వింటాల్)		
తేజ	8400	4500
తాలు	3500	1300

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ

కాజీపేట అర్బన్: ఆరె కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ డిమాండ్ చేశారు. హన్మకొండ బాలసముద్రంలోని ఆరె సంక్షేమ సంఘ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరే మాట్లాడుతూ వ్యవసాయాన్నే కులవృత్తిగా కొనసాగిస్తున్న ఆరె కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిపోయారన్నారు. తక్షణమే ప్రభుత్వం ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధానిలో ఎకరం భూమితో పాటు 10కోట్ల నిధులను కేటాయించాలని తెలిపారు. ఆరె కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నాయకులు మోర్తాల చందర్‌రావు, పకిడె సాంబారావు, మనోహర్‌రావు ,రాజేష్‌ల ఆధ్వర్యంలో అర్బన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెట్టుపల్లి శివాజీ తదితరులు

అధ్యక్షుడిగా హింగె శివాజీ, గౌరవ అధ్యక్షుడిగా పకిడె సాంబారావు, ప్రధాన కార్యదర్శులుగా దుమాల సుధాకర్, దామెరగిద్దె ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా కొల్లూరి ఖండెవార్, నిరంజన్, కోశాధికారిగా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

కేయూలో సమస్యలు పరిష్కరించాలి



వీసీ సాయన్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వలీఉల్లాఖాద్రీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వలీఉల్లాఖాద్రీ కోరారు. ఈ మేరకు గురువారం కేయూలో వీసీ సాయన్నను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, అలాగే ఈనెల 6, 7తేదీల్లో కేయూలో ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు నిర్వహిస్తున్నందుకు సహకరించాలని కోరారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌అశోక్‌స్టాలిన్, బాధ్యులు కె.నరేష్‌ద్రావిడ్, గడ్డం నాగార్జున, పద్మనాగరాజు, శరత్ పాల్గొన్నారు.

బిట్స్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

నర్సంపేటరూరల్ : నర్సంపేట మండలం లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎఫ్ ట్రానిక్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించారు. ఈసీఈ, ఈఈఈ, సీఎస్‌ఈలో అర్హత కలిగిన 170 మంది విద్యార్థులు హాజరుకాగా ఆన్‌లైన్‌లో రాతపరీక్ష, ఐక్యూటెస్ట్, టెక్నికల్ టెస్టులు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్ కంపెనీ ఆఫీస్‌లో నిర్వహిస్తామని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఈనెల 06న సివిల్ విద్యార్థులకు..

కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు రెహెబోత్ సర్వేయింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 06న క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తామని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్‌మోహిద్ తెలిపారు. సర్వేయింగ్, ప్లానింగ్, డిజైనింగ్ తదితర అంశాలపై నియామకాలు ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, ఏఓ సురేష్, మేనేజర్ యాదగిరి పాల్గొన్నారు.

సీఎంకు లేఖ రాసిన ఉడుముల బాల

కాజీపేటరూరల్: వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన రాజారపు ప్రతాప్‌ను రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం కేసీఆర్‌కు వరంగల్ మేత్రాసనం పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుముల బాల గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాసినట్లు తెలిపారు. రాజారపు ప్రతాప్ అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని, కుష్టురోగులకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా పని చేసిన అనుభవంతో ఈ పదవీకి ప్రతాప్ వన్నె తేవాలని కోరారు.

జీఓ 58ని రద్దు చేయాలి

వరంగల్ సిటీ: నూతన, పాత లైసెన్సుల రెన్యూవల్ కోసం డిసెంబర్ 27న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 58ను రద్దు చేయాలని కోరారు. గురువారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య ఆధ్వర్యంలో మంత్రి హరీష్‌రావుతో పాటు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, రాష్ట్ర అధికారి సీ.పార్థసారథిని కలిసి వినతిపత్రం అందచేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వరంగల్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి గోరంటాల యాదగిరి, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు రాయిశెట్టి సత్యనారాయణ, నిజామాబాద్ చాంబర్ అధ్యక్షుడు గంప శ్రీనివాస్, ఖమ్మం అధ్యక్షులు వీరెల్లి యుగేందర్, సిద్దిపేట అధ్యక్షులు కే.రాజేందర్, ఇతర జిల్లాల అధ్యక్షులు ఉన్నారు.

‘ఎల్టా’లో తేజస్వీ విద్యార్థులకు ర్యాంకులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులు

కాజీపేట: విజయవాడలో ఇటీవల ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) బాధ్యులు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రశాంత్‌నగర్‌లోని తేజస్వీ పాఠశాల విద్యార్థులు ర్యాంకులు సాధించారు. విద్యార్థులు సీహెచ్.నర్సింహారెడ్డి, ఎం.దీక్షిత మొదటి ర్యాంకు దక్కించుకున్నారు. పి.శ్రీజారెడ్డి రెండు, కె.నీతు, వై.సుష్మ, పి.వైష్ణవి మూడో ర్యాంకు సాధించారు.

భవిష్యం



మేషం: పనుల్లో ఆటంకాలు. వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. కొన్ని సమస్యలు చికాకు పరుస్తాయి. బంధువిరోధాలు. వృత్తి, వ్యాపారాలలో నిరాశానిస్పృహలు.

వృషభం: మిత్రులు, బంధువులు ఒత్తిడులు పెంచుతారు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహమే.

మిథునం: సంఘంలో విశేష ఆదరణ. యత్నకార్యసిద్ధి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ప్రతిభ వెలుగులోకి వస్తుంది. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల మార్పులు.

కర్కాటకం: ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు. ఆదాయానికి మించిన ఖర్చులు. బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు నత్తనడకనే సాగుతాయి.

సింహం: ప్రత్యర్థులు మిత్రులుగా మారతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దైవ దర్శనాలు. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా ఉంటుంది.

కన్య: రుణాలు చేస్తారు. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ప్రయాణాలలో ఆటంకాలు. సోదరుల కలయిక. వృత్తి, వ్యాపారాలలో సమస్యలు ఎదుర్కొంటారు.

తుల: ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి. మీ సత్తా చాటుకుంటారు. వస్తులాభాలు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

వృశ్చికం: కొన్ని సమస్యలు పరిష్కారం. శుభవార్తలు. ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహం.

ధనుస్సు: పనులు కాస్త మందగిస్తాయి. అనారోగ్యం. కుటుంబసభ్యులతో విభేదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపార, ఉద్యోగాలలో చిక్కులు.

మకరం: దూరప్రయాణాలు. ఇంటాబయటా చికాకులు ఎదుర్కొంటారు. బంధువుల నుంచి ఒత్తిడులు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళంగా ఉంటుంది.

కుంభం: ప్రముఖుల నుంచి శుభవార్తలు. వాహనయోగం. అప్రయత్న కార్యసిద్ధి. ఇంటర్వ్యూలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో ముందడుగు వేస్తారు.

మీనం: యత్నకార్యసిద్ధి. చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. నూతన విద్యావకాశాలు. ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

– సింహంభట్ల సుబ్బారావు

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్ నికోబార్ దీవుల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. జమ్మూ–కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో చిరు జల్లులు/మంచు కురవచ్చు. కేరళ తీరం, అరుణాచల్‌ప్రదేశ్‌లలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో దట్టమైన పొగమంచు ఆవరించవచ్చు. ఉత్తరప్రదేశ్ ఉత్తరం, బిహార్‌లలో చల్లటి వాతావరణం నెలకొని ఉంటుంది.

వరంగల్ వాతావరణం

గరిష్టం కనిష్టం
30.2°/16.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	20.3	05.0
కోల్‌కతా	21.4	12.6
బెంగళూరు	28.3	17.0
ముంబై	30.5	16.4
చెన్నై	30.0	22.0

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
కడప	32.2/18.5	నిజామాబాద్	30.0/14.9
ఒంగోలు	31.9/22.2	కరీంనగర్	29.6/12.5
అనంతపురం	31.8/17.1	కాకినాడ	29.4/20.0
కర్నూలు	31.5/19.7	హైదరాబాద్	29.3/16.9
మహబూబ్‌నగర్	31.3/18.9	రంగారెడ్డి	29.3/16.9
నెల్లూరు	31.1/22.8	నల్లగొండ	29.3/15.0
చిత్తూరు	31.1/19.3	ఆదిలాబాద్	28.9/07.0
తిరుపతి	31.1/19.3	విశాఖపట్నం	28.8/21.5
మెదక్	31.1/12.0	ఏలూరు	28.8/19.4
విజయవాడ	31.0/19.0	రాజమండ్రి	28.8/19.4
ఖమ్మం	30.6/14.2	తాడేపల్లిగూడెం	28.8/19.4
వరంగల్	30.2/18.0	శ్రీకాకుళం	28.0/16.0
గుంటూరు	30.2/16.0	విజయనగరం	28.0/16.0

బుల్లితెర W

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 న్యూస్ ఫీచర్
మ.02.30 హెల్త్ ప్లస్
సా.04.30 హ్యాపీ జర్నీ
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్


టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 పూజ
ఉ.09.30 దేవుడు చేసిన మనుషులు
మ.12.00 గజిని
మ.03.00 రగడ
సా.06.00 ఇష్క్



మూవీస్ నౌ
ఉ.06.30 గాడ్జిల్లా
ఉ.08.45 స్నేక్స్ ఆన్ ఏ ప్లేన్
ఉ.10.35 ద జంగిల్ బుక్
మ.03.05 రష్ అవర్ 3
రా.07.15 మినియన్స్




హెచ్‌బీవో
ఉ.04.16 రాక్ ఆఫ్ ఏజెస్
ఉ.07.01 ఇన్‌సెప్షన్
ఉ.09.21 ద టక్సెడో
మ.03.58 ద అకౌంటెంట్
రా.10.55 ద హ్యాంగోవర్-2



స్టార్ మూవీస్
ఉ.06.01 జింగిల్ ఆల్ ద వే
ఉ.07.25 టాయ్ యమ్ గూంగ్ 2
మ.12.13 స్పీడ్
సా.06.51 టాయ్ స్టోరీ 3
రా.09.00 ద వోల్వరిన్



మా మూవీస్
ఉ.07.00 143- ఐ మిస్ యు
ఉ.09.00 బెండు అప్పారావ్
మ.12.00 ద్రోణాచార్యస
మ.03.00 రాజుగారి గది
సా.06.00 ఎవడు



జీ సినిమా
ఉ.04.45 తేరీ మేరీ కహానీ
ఉ.08.04 సిర్ఫ్ తుమ్
ఉ.10.57 ఖతర్నాక్ ఇష్క్
సా.05.11 రివాల్వర్ రాజా
రా.08.00 హాలిడే



న్యూస్ బాక్స్

టీఆర్ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా కిషన్



హసన్‌పర్తి: టీఆర్ఎస్ పార్టీ 56వ డివిజన్ ఉపాధ్యక్షుడిగా హసన్‌పర్తికి చెందిన జన్ను కిషన్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రకటించారు. పార్టీలో కిషన్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. కాగా కిషన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కార్పొరేటర్ నాగమల్ల ఝూన్సీసురేష, డివిజన్ అధ్యక్షుడు వల్లాల యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: లైన్లు మరమ్మతు చేస్తున్నందున శుక్రవారం హన్మకొండలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ అర్బన్ డీఈఈ సామ్యానాయక్ తెలిపారు. హనుమాన్‌నగర్, ఏకశిల కాలేజీ, కుడా కాలనీ ప్రాంతంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంతటా సమస్యలే..

ఇందిమ్మ కాలనీలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- శిథిలమైన రోడ్లతో ప్రమాదాలు
- విద్యుత్ దీపాలు లేక అంధకారం
- వసతులు కల్పించాలని ప్రజల వినతి

సాక్షి ఫోకస్

భీమారం: నగర పరిధిలోని గుండ్లసింగారం ఇందిమ్మ కాలనీ సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. ఈ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2008వ సంవత్సరంలో ఈ కాలనీలో సుమారు ఆరు వందల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఇందిరమ్మ పథకం కింద గృహాలను నిర్మించారు. ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ పాలకులు మాత్రం ఈ కాలనీలో కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారని స్థానికులు వాపోతున్నారు. మహానగరంలో విలీనమైనా ఈ ప్రాంతం పూర్తిగా ఏజెన్సీని తలపిస్తోంది. ఇక్కడి రోడ్లు శిథిలమై అధ్వానంగా మారాయి. అడుగడుగునా గుంతలతో ప్రమదాలు జరుగుతున్నాయి. డ్రెయినేజీలు పూర్తిగా ధ్వంసం కావడంతో మురుగునీరు రోడ్లపైకిచేరి బురదగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో కాల్వలు నిర్మించినప్పటికీ శుభ్రం సకాలంలో చేయడం లేదు. దీంతో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. మరో వైపు పందుల సమస్య తీవ్రంగా ఉంది. విద్యుత్‌దీపాలు సక్రమంగా పనిచేయడం లేదు. కాలనీల్లో మినీ వాటర్‌ట్యాంకులు ఏర్పాటు చేసినా అవి నిరుపయోగంగా మారాయి. పాలకులు స్పందించి తమ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.



డ్రెయినేజీలో నిలిచిన మురుగునీరు



నిరుపయోగంగా ఉన్న మిటీ వ్యాటర్‌ట్యాంకు

వర్షం వస్తే.. ముంపే..



వర్షాకాలంలో వరద వస్తే చాలు మా కాలనీ ముంపునకు గురవుతుంది. ఇళ్లలోకి నీరు చేరడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ సమస్యల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదు. – కిషన్‌నాయక్, గుండ్లసింగారం

దోమలతో అవస్థలు పడుతున్నాం



మా కాలనీలో దోమలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి నిద్ర పట్టడం లేదు. మురికి కాల్వల నుంచి దుర్వాసన వస్తోంది. కాల్వలు శుభ్రం చేసే వారు లేరు. కాలనీలో పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉన్నాయి.

– తార, గుండ్లసింగారం

లోకల్ వాయిస్

ఉద్యోగ షెడ్యూల్‌ను విడుదల చేయాలి



కాజీపేట: నిరుద్యోగ యువత ఆకాంక్షను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగాల కల్పనకు ఒక నిర్దిష్టమైన ప్రణాళికను విడుదల చేయాలి. ఎన్నో ఆశలతో ఉన్న యువతీ, యువకులపై నీళ్లు చల్లకుండా చూడాలి.

– ఉడుగు శ్రీనివాస్, కాజీపేట

ఖాళీలను భర్తీ చేయాలి



రాష్ట్రంలో ఖాళీగా ఉద్యోగ పోస్టులన్నింటినీ వెంటనే భర్తీ చేయడానికి పాలకులు చర్యలు చేపట్టాలి. లేని పక్షంలో యువత ఉద్యమించే పరిస్థితి వస్తుంది.

– భాషబోయిన వెంకటస్వామి, కాజీపేట

ఆంగ్ల మాధ్యమానికి అనుమతి

- హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: వంగపహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం (ఆరు నుంచి పదో తరగతులు)కు అనుమతినిస్తూ ఆర్జేడీ రాజీవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆ ఉత్తర్వులు గురువారం పాఠశాలకు అందాయి. పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇటీవల పాఠశాలలో జరిగిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో పాఠశాలలో ఆంగ్ల మాధ్యమానికి అనుమతి లభించడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చరణ్‌సింగ్, విద్యా కమిటీ చైర్మన్ దోమ కుమార్, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేర్గు రాజేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గండు అశోక్ పాల్గొన్నారు.



స్వీట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

అభివృద్ధికి పాటుపడే అభ్యర్థిని గెలిపించాలి

- ప్రజా సంఘాల జేఏసీ

హన్మకొండ: 44వ డివిజన్‌కు జరుగుతున్న ఉప ఎన్నికల్లో అభివృద్ధికి పాటుపడే అభ్యర్థిని గెలిపించాలని పౌర సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు కూరపాటి వెంకటనారాయణ అన్నారు. ఈమేరకు జేఏసీ ముద్రించిన కరపత్రాలను గురువారం బాలసముద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ ఓటు వేసేటప్పుడు పార్టీలను కాకుండా అభ్యర్థుల గుణగణాలు చూడాలన్నారు. అభ్యర్థులు నచ్చకుంటే నోటాకు ఓటు వేయాలని సూచించారు. జేఏసీ చైర్మన్ పుల్లూరు సుదాకర్ మాట్లాడుతూ 44వ డివిజన్ అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. కొన్ని కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. వీటన్నింటినీ పరిష్కరించే కలిగే అభ్యర్థిని గుర్తించి ఎన్నుకోవాలని కోరారు. జేఏసీ కన్వీనర్ తిరునహరి శేషు, నాయకులు దాడబోయిన సతీష్, కల్లూరి పవన్, టి.పవన్, బుట్టి శ్యాంయాదవ్, జనార్దన్ గౌడ్, దామెరుప్పుల సతీష్, రమాకాంత్, అజయ్, ప్రశాంత్, స్వామిరాజు, మనోజ్ పాల్గొన్నారు.

సజ్జన్‌నాయక్‌కు అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు

హన్మకొండ: తెలంగాణ బంజార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ సజ్జన్‌నాయక్ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు అందుకున్నారు. దళిత, గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్న సజ్జన్‌నాయక్‌ను జాతీయ దళిత సాహిత్య అకాడమీ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమానికి వెళ్లలేకపోయిన సజ్జన్‌నాయక్‌కు గురువారం జిల్లా ప్రజా సంఘాల నాయకుల చేతుల మీదుగా అవార్డును అందజేశారు. సజ్జన్‌నాయక్‌ను బొమ్మల కట్టయ్య, ప్రొఫెసర్ భద్రూనాయక్, కార్పొరేటర్ జోరిక రమేశ్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకుడు రాజారపు భాస్కర్ సన్మానించారు.



సజ్జన్‌నాయక్‌కు అవార్డును అందజేస్తున్న సంఘాల ప్రతినిధులు

సెల్ టవర్ ఎక్కిన టీఆర్ఎస్ నాయకుడు

పార్టీ నుంచి సస్పెండ్ చేశారని మనస్తాపం

నెక్కొండ(నర్సంపేట): తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో ఓ టీఆర్ఎస్ నాయకుడు సెల్ టవర్ ఎక్కిన సంఘటన నెక్కొండలో గురువారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. టీఆర్ఎస్ నాయకుడు బండి శివకుమార్ నెక్కొండలో న్యూఇయర్ వేడుకల్లో భాగంగా టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర సివిల్ సప్లయ్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. అయితే అందులో నెక్కొండ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ ఫొటో పెట్టకపోవడంతో కావాలనే టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుంటుక సోమయ్యపై ఒత్తిడి తీసుకువచ్చి తనను సస్పెండ్ చేయించారని శివకుమార్ చెప్పాడు. ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం నెక్కొండ మండలంలోని పెద్దకొర్పోలు గ్రామంలో పల్లెప్రగతి కార్యక్రమానికి వచ్చిన పెద్ది సుదర్శన్‌రెడ్డి విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి వెళ్లారు. జిల్లా కోఆప్షన్ సభ్యుడు షేక్ అబ్దుల్ నభిని టవర్‌పైకి పంపించి నచ్చచెప్పడంతో శివకుమార్‌ను టవర్ దిగాడు. పార్టీలో ప్రాధాన్యం కల్పిస్తామని సుదర్శన్‌రెడ్డి హామీ ఇవ్వడంతో గొడవ సర్దుమనిగింది.


సెల్ టవర్ ఎక్కిన బండి శివకుమార్

ఆగ్రోస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తా

చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు

హన్మకొండ: ఆగ్రోస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తానని ఆ సంస్థ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు అన్నారు. గురువారం హన్మకొండ సుబేదారిలోని కృషి భవన్‌లో ఆగ్రోస్ రైతు సేవా కేంద్ర మిత్రల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుంచి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముందుగా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల నిర్వాహకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం లింగంపల్లి కిషన్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో ఆగ్రోస్ సేవలు రైతులకు వినియోగపడేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి న నాటి నుంచి ఆగ్రోస్ ద్వారా రైతులకు సేవలు అందించడంపై దృష్టి సారించా మన్నారు. ఆగ్రోస్‌ను బలోపేతం చేయడంతో పాటు రైతులకు వ్యవసాయ యంత్రాలను, ఆధునిక పనిముట్లను రైతులకు అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపా రు. ఆగ్రోస్ ఆర్థిక పరిపుష్టికి ఆగ్రోస్ కర్షక్ పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6 పెట్రోల్ బంక్‌లు మంజూరయ్యాయన్నారు. ఒకటి వరంగల్‌లోని ములుగు రోడ్డులో ప్రా ంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సమీపంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పాత 9 జిల్లాల కేంద్రాల్లో ఆగ్రోస్ ఎగ్జిబిషన్‌లు ఏర్పా టు చేయనున్నట్లు తెలిపారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల రాష్ట్ర ఇన్‌చార్జి విద్యాకుమారి మాట్లాడుతూ ఆగ్రోస్ కేంద్రాలద్వారా గతంలో ఎరువులతోపాటు క్రిమిసంహారక మందులు,వ్యవసాయ పనిముట్లు రైతులకు సరఫరా చేసే వారమన్నారు. మధ్యలో వీటిని నిలిపివేశారని, తిరిగి పునరుద్ధరించేందుకు ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు కృషి చేస్తున్నారన్నా రు. జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్ మాట్లాడు తూ ఆగ్రోస్‌కు ప్రస్తుతం పథకాలు తగ్గాయన్నారు. వ్యవసాయ పట్టభద్రులు, వ్యవసాయ డిప్లొమా చేసిన వారికే ఎరువుల షాపు ఏర్పాటుకు లైసెన్స్ ఇవ్వాలనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి సునిత,ఆగ్రోస్ రైతు సేవా మిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీరాంశర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు

ఈసారైనా సజావుగా సాగేనా?

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

హన్మకొండ: జెడ్పీ పాలక మండలి, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రతీ సారి జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా పడుతూ వస్తోంది. దీంతో ప్రజా సమస్యలు చర్చకు రావడం లేదు. కోరం లేక, ఇతర కారణాలతో కొన్ని సమావేశాలు వాయిదా పడుతుండగా, జరిగిన సమావేశాలు మొక్కుబడిగా ముగుస్తున్నాయి. జెడ్పీలో నిర్వహించే ప్రతీ సర్వసభ్య సమావేశం వాయిదా పడుతుండటంతో ఈ నెల 6న జరగాల్సిన సర్వసభ్య సమావేశం సజావుగా సాగుతుందా.. లేదా? అనే సందేహం పలువురిలో వ్యక్తమవుతోంది. సమావేశానికి హాజరుకావాల్సిన డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పాల్గొనకుంటే సమావేశం వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏడాదికి 12 సర్వసభ్య సమావేశాలు జరుగాల్సి ఉండగా కేవలం మూడు సమావేశాలు మాత్రమే జరుగుతున్నాయి. కోరం లేకనే ఎక్కువ సమావేశాలు వాయిదా పడుతున్నాయి. అన్ని శాఖలపై చర్చించాల్సిన సర్వసభ్య సమావేశం మూడు, నాలుగు శాఖలకే పరిమితమవుతుంది. 34 అంశాలపై చర్చించాల్సి ఉండగా నాలుగైదు అంశాల పైనే చర్చ జరుగుతుంది. 2018 సంవత్సరంలో మొదటి సమావేశం ఈ నెల 6న నిర్వహించనున్నారు. ఈ సమావేశమైనా వాయిదా పడకుండా సజావుగా సాగుతుందో లేదో చూడాలి మరి.



జెడ్పీ కార్యాలయం

వందశాతం ఫలితాలే లక్ష్యం

- పది ప్రత్యేక తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి
- రోజు స్లిప్ టెస్టులు నిర్వహించాలి
- డీఈఓ నారాయణరెడ్డి

విద్యారణ్యపురి: పదో తరగతి విద్యార్థులు మార్చిలో జరగబోయే పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా హెచ్ఎంలు ,ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈఓ కె.రాయణరెడ్డి సూచించారు.జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, ఎయిడెడ్, మోడల్ స్కూళ్ల ,గురుకులాల హెచ్ఎంలతో గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఏడాది టెన్త్ పరీక్షల ఫలితాలతోపాటు అక్టోబర్‌లో జరిగిన సమ్మేటివ్ పరీక్షలపై సమీక్షించారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి 40 రోజుల ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. అదనంగా ఉదయం ఒక గంట సాయంత్రం మరో గంట క్లాస్‌లు తీసుకోవాలన్నారు. ఇక నుంచి ప్రతి రోజు నుంచి స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. చదవులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి 10/10జీపీఏ సాధించేలా శ్రద్ధతీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక క్లాస్‌లను పర్యవేక్షించేందుకు మానిటరింగ్ కమిటీలను కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. వారు ఆయా పాఠశాలలను సందర్శించి మానిటరింగ్ చేస్తారన్నారు సమీక్ష సమావేశంలో డీసీఈబీ సెక్రటరీ రమేష్‌బాబు, సెక్టోరియల్ ఆఫీసర్లు బిమనోజ్‌కుమార్, రమాదేవి ,ఎంఈఓ వీరభద్రనాయక్ , జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి..

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని డీఈఓ కె.నారాయణరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రూరల్ జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను హన్మకొండలోని డీఈఓ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు మధ్యాహ్న భోజనాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కడారి భోగేశ్వర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా టీచర్లకు నియామకాలు, బదిలీలు, పదోన్నతులు లేవన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రూరల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ భీమళ్ల సారయ్య ,ఉపాధ్యాక్షుడు మైదం రత్నం, బాధ్యులు వెంకటేశ్వర్లు, రాధాకృష్ణరావు, సతీష్‌ప్రకాశ్, సతీష్ ప్రకాష్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'టీపీజేఎంఏ' క్రికెట్ టోర్నీ ప్రారంభం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న భరత్

హసన్‌పర్తి:

తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్(టీపీజేఎంఏ)ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. క్రీడల ప్రారంభోత్సవానికి టీపీజేఎంఏ వ్యవస్థాపక అధ్యక్షుడు వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పోటీల వల్ల క్రీడాకారుల్లో స్నేహభావం పెంపొతుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రారంభోత్సవ మ్యాచ్‌లో బి, ఎఫ్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో బి జట్టు విజయం సాధించింది.బి జట్టు కెప్టెన్ తీగల భరత్‌కుమార్ 41 పరుగులు సాధించడమే కాకుండా 3 వికెట్లు పోగొట్టి మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ గౌరవ అధ్యక్షుడు గౌరు తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్ణాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కోశాధికారి మహేందర్‌రెడ్డి, వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన యాజమాన్య వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సమావేశం

కాజీపేట రూరల్: హన్మకొండ హౌజింగ్ బోర్డు కాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నేడు(శుక్రవారం)పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సంగాల ఈర్మియా, జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను విలన్ రాబర్ట్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, గ్రేటర్ నాయకులు హాజరుకావాలని వారు కోరారు.

'బ్రెయిలీ' ఆశయాలను కొనసాగించాలి

కాజీపేట అర్బన్: అంధులు అన్ని రంగాల్లో రాణించాలని, లూయి బ్రెయిలీ ఆశయాలను కొసాగించాలని ఐసీడీఎస్ ప్రాంత్రీయ సంయుక్త సంచాలకులు రాములు తెలిపారు. హన్మకొండలోని జిల్లా ప్రజాపరిషత్ మీటింగ్ హల్‌లో గురువారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వరంగల్ అర్బన్, రూరల్ జిల్లా అధికారకులు సంయుక్తంగా బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ద్వారా అంధులకు ల్యాప్‌టాప్‌లు, డీజేప్లేయర్లను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్, సబ్సిడీ రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రెడ్‌క్రాస్ ఆద్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అర్బన్,రూరల్ జిల్లా అధికారులు శైలజ, స్వర్ణలత, జిల్లా వైద్యారోగ్య అధికారి రమణ, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ అనితారెడ్డి, జిల్లా అంధ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్.నగేష్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్రెయిలీ లిపిలో ముద్రించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న రాములు

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

- 28న మొదటి విడత కార్యక్రమం
- డీఎంహెచ్‌ఓ హరీష్‌రాజ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ హరీష్‌రాజ్

ఎంజీఎం: ఈ నెల 28వ తేదీన నిర్వహించే మొదటి విడత పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ హరీష్‌రాజ్ పిలుపునిచ్చారు. గురువారం వైద్యాధికారులు, సూపర్‌వైజరులకు ప్రాంతీయ నేత్ర వైద్యశాల కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరికీ తప్పక పోలియో చుక్కలు అందించాలని తెలిపారు. పల్స్‌పోలియో విజయవంతానికి వైద్యారోగ్యశాఖ సిబ్బందితో పాటు ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకరించాలని కోరారు. జిల్లాలో దాదాపు 1,11,500 ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు అందించాలన్నారు. వైద్యసిబ్బందికి డబ్ల్యూహెచ్‌ఓ సర్వేలెన్స్ అధికారి ప్రగణ్‌కుమార్ శిక్షణ ఇచ్చి మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ ప్రగత్‌కుమార్, గీతాలక్ష్మి, ఇమ్యూనైజేషన్ అధికారి కృష్ణారావు, జిల్లా మాస్‌మీడియా అధికారి అశోక్ రెడ్డి, రమేశ్‌గాడ్గిల్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లకు మంత్రి ఈటల శంకుస్థాపన

కమలాపూర్(హుజూరాబాద్): కమలాపూర్ మండల కేంద్రంతో పాటు గూడూరు గ్రామంలో నిర్మించనున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ గురువారం రాత్రి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని 895 సర్వే నంబరులోని 8 ఎకరాలు, గూడూరులోని 143 సర్వే నంబరులోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ అమ్రపాలి, ఆర్డీఓ వెంకారెడ్డి, ఎంపీపీ లాండిగె లక్ష్మణ్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు మారపెల్లి నవీన్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, వైస్ ఎంపీపీ బైరి దశరథం, సర్పంచ్‌లు శనిగరపు సమ్మయ్య, అంకతి విజయ, ఎంపీటీసీ సభ్యులు అంకూస్, భిక్షపతి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాట్ల రమేష్, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఈటల భద్రయ్య, హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి కళాధర్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బీ జిల్లా అధికారులు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈటల రాజేందర్

కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూల వాయిదా

కేయూ క్యాంపస్: కేయూలో కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు గురువారం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేశారు.175మందికి పైగా అభ్యర్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకు న్నారు. తొలిరోజు 58మంది వరకు అభ్యర్థులు సైన్స్‌డీన్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయనే సమాచారంతో అక్కడికి వచ్చారు. మధ్యాహ్నం 2 గంటలవరకు కూడా ఇంటర్వ్యూలు నిర్వహించలేదు. ఆ తర్వాత ఇంటర్వ్యూలు కెమిస్ట్రీ విభాగంలో ఉంటాయని సమాచారం ఇవ్వగా అభ్యర్థులంతా అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం 5గంటల వరకు వేచి ఉన్నా కూడా ఇంటర్వ్యూలు నిర్వహించలేదు. అయితే సైన్స్ విభాగం అధ్యాపకుల మధ్య విబేధాల నేపథ్యంలోనే ఇంటర్వ్యూలు నిర్వహించకుండా కాలయాపన చేశారని తెలుస్తోంది. అభ్యర్థులు ఇంటర్వ్యూలు నిర్వహించకుండా జాప్యం చేయడంపై సైన్స్‌డీన్ ప్రమీలాదేవీ, కమిటీ సభ్యుల వద్దకు వెళ్లి నిలదీశారు. కొద్దిసేపటికి నిర్వహిస్తామని కాలయాపన చేశారు. సాయంత్ర 6గంటలు దాటినా ఇంటర్వ్యూలు నిర్వహించకపోవడంతో అధికారులను అభ్యర్థులు ప్రశ్నిస్తే కన్వీనర్ అందుబాటులో లేడని సాంకేతిక కారణాలతో వాయిదా వేస్తున్నామన్నారు. మధ్యలో ఓసారి సైన్స్‌డీన్ ప్రమీలాదేవి వీసీని కూడా కలిసి వచ్చారు. ఇంటర్వ్యూల నిర్వహణకు గల సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. చివరకు వాయిదా వేయడంతో అభ్యర్థులు నిరాశతో సంబంధిత అధికారుల తీరుపై ఆందోళన వ్యక్తం చేసి వెనుదిరిగారు.

జాతీయ రహదారికి మరమ్మతు

- ఆత్మకూరు నుంచి చల్వాయి వరకు పనులు
- రోలింగ్ చేయకుండా తూతూ మంత్రంగా బీటీ


జాతీయ రహదారిపై మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

ములుగు: మేడారం మహాజాతర ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభంకానున్నందున జాతీయ రహదారి 163పై సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. వరంగల్ రూరల్ జిల్లాలోని ఆత్మకూరు నుంచి గోవిందరావుపేట మండలం చల్వాయి వరకు సుమారు 40 కిలో మీటర్ల పరిధి మేర ఏర్పడిన గుంతల్లో బీటీ వేసి పూడ్చుతున్నారు. దీంతో పాటు నాణ్యత దెబ్బతిన్న ప్రాంతాల్లోనూ పై పూతగా బీటీ వేస్తున్నారు. ఇంతకు ముందే చల్వాయి నుంచి పస్రా వరకు మరమ్మతు చేశారు. గత ఐదు రోజులు పనులు జరుగుతున్నాయి.

తూతూ మంత్రంగా..

వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చే భక్తులకు అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెప్పుకుంటున్నారు. అయితే వేలాది వచ్చే వాహనాల రాకపోకలను తట్టుకోవడానికి వీలుగా గుంతలను తవ్వి బీటీ నింపాల్సిన కాంట్రాక్టర్ అవేమీ పాటించకుండా రోడ్డుపై పూతగా బీటీని పరుస్తూ తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నాడని ఆరోపణలు వినవస్తున్నాయి. పైగా వేస్తున్న బీటీపై రోలింగ్ చేయకుండా కేవలం దిమ్మెలతో అంటీముట్టనట్లు సరిచేస్తున్నారు.

10 లోగా పూర్తిచేయాలి


మేడారం మ్యూజియంపై డీడీ, అసిస్టెంట్ డైరెక్టర్లతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు

- ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు
- గిరిజన మ్యూజియంపై అధికారులతో సమావేశం

ఏటూరునాగారం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ఒకేచోట నిలిపే గిరిజన మ్యూజియం పనులు ఈనెల 10లోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం లోని ఐటీడీఏ పీఓ చాంబర్‌లో గురువారం గిరిజన మ్యూ జియం డిప్యూటీ డైరెక్టర్ డి. సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్లు రామకృష్ణ, శంకర్, మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ కాక లింగయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావుతో పీఓ సమావేశమయ్యారు. మేడారం జాతర లోపు మ్యూజియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. గిరిజన మ్యూజియం పైన కోయకులస్తులు నృత్యాల సమయంలో తలపై ఉపయోగించే కొమ్ములను సుమారు 12 ఫీట్ల ఎత్తులో అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మ్యూజియంకు రంగును గిరిజనులు ఎక్కువగా ఇళ్లకు ఉపయోగించే పుట్టమన్ను కలర్, పేడ కలర్‌ను వేయాలన్నారు. చినుకుల ముగ్గులను మహిళలతోనే వేయించాలని సూచించారు. శ్రీ సమ్మక్క-సారలమ్మ గిరిజన మ్యూజియం అనే పేరును స్టీల్‌తో తయారు చేయించి బోర్డును అమర్చాలన్నారు. గోడకు అమర్చే షోకేజ్‌లు 20, ఫ్లోరింగ్‌పై అమర్చే బీరువాలు 17 తయారు చేసేందుకు ప్రత్యేక కార్పెంటర్‌ను పిలిపించి కొలతను తీయించినట్లు డీడీ సత్యనారాయణ పీఓకు వెల్లడించారు. మ్యూజియంలో అమర్చే వస్తువులను సేకరించేందుకు పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉండాలని పీఓ అన్నారు. లఘు చిత్రాల నమూనాలను హైదరాబాద్ నుంచి తెప్పించి వాటిని పరిశీలించిన తర్వాత ఎంపిక చేయడం జరుగుతుందని పీఓ అన్నారు. సేకరించిన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. పెసా జిల్లా కన్వీనర్ కొమురం ప్రభాకర్, ఆర్ఓఎఫ్ఆర్ ప్రభాకర్, ఫొటోగ్రాఫర్ రాజేష్ పాల్గొన్నారు.

ఇసుక బస్తాల కట్టల పనులు షురూ

ఎస్ఎస్‌తాడ్వాయి: జంపన్నవాగులో ఇసుక కట్టల ఏర్పాట్ల పనులను ప్రారంభించారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగులో నీటి లభ్యత కో సం నాలుగు చోట్ల శాశ్వత చెక్ డ్యాం నిర్మాణాల కోసం నిధులు కేటాయించా రు. కాని ఆ పనులు జాతర వరకు పూర్తయ్యే పరిస్థితి లేదనే ఉద్దేశంతోనే ఆ శాఖ అధికారులు తాత్కాలిక ఇసుక బస్తాల అడ్డుకట్టల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపారు.అందుకు స్పందించిన ప్రభుత్వం రూ కోటిపైగా నిధులు మంజూరు చేసింది. వాగులో మునిగి స్నానమాచరించే భక్తులకు నీటి లభ్యం కోసం జంపన్నవాగులో 12 చోట్ల ఇసుక బస్తాల అడ్డు కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నీటి నిల్వతోపాటు ఇసుక బస్తాలపై నుంచి నీళ్లు సమాంతరంగా వెళ్లనున్నాయి.


జంపన్నవాగులో ఇసుక బస్తాలు వేస్తున్న కూలీలు

జాతరలో జేబుదొంగలు..!


బాధితుడు వీరభద్రం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో జేబు దొంగల బెడద మొదలైంది. జాతరకు ముందుగానే మేడారంలో జేబు దొంగలు ప్రవేశించారు. ఇప్పటికే నాలుగైదుసార్లు భక్తుల జేబులను కొట్టేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. తాజాగా గురువారం ఓ భక్తుడి జేబులోని డబ్బులను కొట్టేసిన బాలికను భక్తులు పట్టుకున్నారు. అంతేగాకుండా ఖమ్మం జిల్లాకు చెందిన వీరభద్రం కుటుంబ సమేతంగా మేడారం వచ్చారు. సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న క్రమంలో ఆయన ప్యాంట్ జేబులోని డబ్బులను కొట్టేశారు. తన జేబులో రెండు వేల నోట్లు రూ. 40 వేలకు పైగా ఉన్నాయని సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో దొంగలు తన డబ్బులు దొంగిలించారని ఆవేదన వ్యక్తం చేశాడు. సీసీ కెమెరాల ద్వా రా దొంగలను కనుక్కొనేందుకు ఎండోమెంట్ కార్యాలయంలోని సీసీ పుటేజీలను బాధిత భక్తులు పరిశీలించారు. ఈ విషయంపై భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది.



తరలివచ్చి.. మొక్కులు తీర్చి..


యాటతో మొక్కుతున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సమయం దగ్గర పడుతున్న కొద్దీ భక్తుల రాక ఊపందుకుంది. వనదేవతలను దర్శించుకునేందుకు గురువారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం, కొబ్బరికాయలు, ఒడిబియ్యం, కానుకలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చెట్ల కింద వంటావార్పుతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి.


తల్లులకు ఎత్తు బంగారం సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు


కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు


నృత్యం చేస్తున్న భక్తులు



బొమ్మలు, లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేస్తున్న భక్తులు

మహాజాతర.. పనులు పాతర

సమీపిస్తున్న మేడారం జాతర

- నేటికీ పూర్తికాని అభివృద్ధి పనులు
- పదిరోజులే డెడ్‌లైన్
- జాడలేని తాగునీటి పైపులైన్
- నత్తనడకన మరుగుదొడ్ల నిర్మాణం
- జాతర భక్తులకు 'మిషన్ భగీరథ' నీళ్లు అనుమానమే
- వైద్య సేవలు అంతంతమాత్రమే..

మేడారం జాతర సమీపిస్తున్నా అధికారుల అలసత్వం, పాలకుల పట్టించుకోని తనంతో భక్తులకు ఇక్కట్లు తప్పేటట్లు లేవు. ఎప్పటిపనులు అప్పుడే చేయడం అలవాటు చేసుకున్న అధికారులు ఈ సారి జాతరకు కూడా పది రోజుల ముందు హడావుడి చేసి చేతులు దులుపుకునేలా ఉన్నారు. కొత్త రాష్ట్రం, కొత్త జిల్లా ఏర్పడినా జాతర లో శాశ్వత పనుల ఊసే లేదు. తాత్కాలిక పనులు చేయడం తోనే అధిక లాభాలున్నాయని పాలకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు

-ఎస్ఎస్ తాడ్వాయి

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర మహాజాతర సమయం ఇంకా 25 రోజులే ఉంది. జాతర సమీపిస్తున్న తరుణంలో భక్తుల భక్తుల తాకిడి మేడారానికి రోజురోజుకు పెరుగుతూనే ఉంది. కానీ.. జాతర అభివృద్ధి పనులు నత్తేనయం అన్నట్లుగా సాగుతున్నాయి. ఈనెల 15కల్లా పనులన్నింటినీ పూర్తి చేయాలని విధించిన డెడ్‌లైన్ పట్టుమని పది రోజుల కూడా లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణం పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. కొత్త తాగునీటి పైపులైన్ నిర్మా ణం పనులు సైతం ప్రారంభించలేదు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి హైదరాబాద్‌లో జాతర అభివృద్ధి పనులపై కొద్ది రోజుల క్రింత నిర్వహించిన సమీక్ష సమావేశంలో కూడా జనవరి 15కల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించినా పూర్తయ్యేది అనుమానంగా ఉంది. అధికారుల తీరును పరిశీలిస్తే జాతర నాటికి కూడా పనులు సాగేలా కనిపిస్తున్నాయి.

మరుగున పడ్డ మరుగుదొడ్ల పనులు

మేడారంలో మరుగుదొడ్ల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. జాతరకు వచ్చే భక్తు ల సౌకర్యార్థం 4వేల సెమీ పర్మనెంట్ , 1350 తాత్కాలిక, 60 పర్మనెంట్, 60 వీఐపీ టాయిలెట్లు జాతర జరిగే పరిసర ప్రాంతాల్లో నిర్మించాల్సి ఉంది. ఇప్పటివరకు వందల సంఖ్యలో కూడా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. జాతర కోసం ఆధునిక మొబైల్ టాయిలెట్లను తెప్పించినా వాటిని వీఐపీ భక్తులకే అని పక్కన పెట్టారు. బేస్‌మెంట్ లెవల్ లోనే మరుగుదొడ్ల నిర్మాణాలు ఉన్నాయి.



మరుగుదొడ్ల కోసం కడుతున్న బేస్‌మెంట్లు



నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు

గోదావరి జలాలు అందేనా?

మిషన్ భగీరథ పథకం కింద జాతర భక్తులకు గోదావరి జలాలను అందించేందుకు మేడారంలో వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నారు. ట్యాంకు ద్వారా జాతరలోని నల్లాలకు పైపులైన్ కనెక్షన్ పనులు చేయాల్సి ఉంది. నిర్మాణ పనులను బట్టి చూస్తే జాతర వరకు కూడా పూర్తయ్యేది అనుమానంగా ఉంది. జాతరలో 50శాతం మేరకేనా గోదావరి జలాలను భక్తులు అందిస్తామని చెబుతున్న అధికారులు ఆ దిశగా పనులు వేగవంతం చేయడంలో అశ్రద్ధ చూపుతున్నారు.

ఆలయానికి రంగులు ఎప్పుడు..?



దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ. 2.60 కోట్ల రంగుల పనులు జరుగుతున్నాయి. వీటితో కల్యాణ కట్టల నిర్మాణం, క్యూలైన్లకు మరమ్మతు, సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో పెయింటింగ్, లైటింగ్ తదితర ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు నామినేషన్ పద్ధతిలో ఇవ్వాలంటూ ఆదివాసీలు, టెండర్లు నిర్వహిస్తామంటూ దేవాదాయశాఖ అధికారులు తెలుపడంతో పనులు ఆగిపోయాయి. ఇటీవల కొలిక్కి వచ్చినప్పటికీ రంగుల పనులు మాత్రం ప్రారంభం కాలేదు. తడుకలు వేయడంతో క్యూలైన్ల బారికేడ్లకు వేసిన రంగులు ఆరక భక్తుల చేతులకు అంటే అవకాశాలున్నాయి.



తాగునీటి పైపులైన్ పనులు

జాడలేని తాగునీటి పైపులైన్ పనులు

జాతరలో భక్తులకు తాగునీటి సౌకర్యం చాలా ప్రధానమైనది. తాగునీటి కోసం కాంట్రాక్టర్లు బోరుబావుల్లో మోటార్లు బిగించడం, జాతర పరిసరాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ నల్లాలను ఏర్పాటు చేస్తున్నారు. బోరుమోటార్ల ద్వారా నల్లాలకు తాగునీటి సరఫరా చేయాలి. కొత్త పైపులైన్ నిర్మాణం పనుల కోసం అధికారులు హైదరాబాద్‌లో వారు చెప్పిన పైప్‌ల కంపెనీలోనే పైపులకు కాంట్రాక్టర్లు ఆర్డర్ చేశారు. సంబంధిత అధి కారులు అక్కడికి వెళ్లి పైపులను పరిశీలించి వారి ఒకే అంటే కాంట్రాక్టర్లు తీసుకురావాలనే నిబంధనలు ఉన్నాయి. పైపులకు కాంట్రాక్టర్లకు ఆర్డర్ చేసి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పైపులైన్ నిర్మాణం పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

వైద్య సేవలు అంతంతమాత్రమే..



జాతరకు నెలరోజుల ముందు నుంచే దేవతలను దర్శించుకునేందుకు మేడారానికి భక్తులు వేల సంఖ్యలో వచ్చిపోతున్నారు. కల్యాణ మండపం ఫస్ట్ ఫ్లోర్ భవన నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో వైద్యశాలను నేటికి ఏర్పాటు చేయలేదు. దీంతో భక్తులు వైద్య సేవల కోసం ఆస్పత్రి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.మూడు రోజుల క్రితం మేడారంలోని సబ్‌సెంటర్‌లో వైద్యశాల సేవలు ప్రారంభించినప్పటికీ గద్దెలకు కిలోమీటర్ల దూరం ఉండడంతో భక్తులకు సేవలకు ఏమాత్రం వినియోగంలోకి రావడం లేదు. భక్తుల సౌకర్యార్థం వైద్య సేవలు అందుబాటులో ఉంచాల్సి ఉంది.

క్యూలైన్లలోనే సాగుతున్న ఆర్టీసీ పనులు



దేశం నలుమూలల నుంచి జాతరకు రికార్డు స్థాయిలో 4,000 బస్సులు నడిపించాలని ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఏర్పాట్లు మాత్రం కాస్త నెమ్మదిగా సాగుతున్నాయి. ఆర్టీసీ సిబ్బంది కోసం తడుకలతో తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. క్యూలైన్ల పనులు మాత్రం ఇంకా సాగదీస్తున్నారు. టికెట్ బుకింగ్ కౌంటర్ల గదుల ఏర్పాట్లు పనులు చేపట్టలేదు. పనులు ఊపందుకోలేదు.

'ఐనవోలు' ఏర్పాట్లు పూర్తి చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీ సునీత

ఐనవోలు(వర్ధన్నపేట): ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలు దగ్గర పడుతున్నందున ఏర్పాట్లను పూర్తి స్థాయిలో త్వరితగతిన పూర్తి చేయాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత అన్నారు. మండల కేంద్రంలోని ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. స్నానాల కోసం కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన అధునాతన షవర్లు, దుస్తులు మార్చుకునే గది, క్యూ ఏర్పాటు, టికెట్ కౌంటర్లు, నూతనంగా ఉత్తర, దక్షిణ దిశల్లో ఏర్పాటు చేసిన పుట్ ఓవర్ బ్రిడ్జిలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీపీ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాలక వర్గం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతమయ్యే విధంగా చూడాలని కోరారు. వీరి వెంట ఆలయ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ఈఓ సదానందం, సర్పంచ్ పల్లకొండ సురేష్, ఎంపీటీసీ బోళ్లపెల్లి మధు, దర్మకర్తలు తక్కళ్లపెల్లి చందర్‌రావు, యాకూబ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్తకొండ జాతరకు స్పెషల్ బస్సులు

హుజూరాబాద్ డీఎం ధరంసింగ్



డీఎం ధరంసింగ్

భీమదేవరపల్లి(హుస్నాబాద్): భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర నేపథ్యంలో మూడు రోజుల పాటు 250 ప్రత్యేక ఆర్టీసీ బస్సు ట్రిప్పులను నడపనున్నట్లు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డీఎం ధరంసింగ్ వెల్లడించారు. మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామిని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు పలు వివరాలు తెలిపారు. జాతరలో ప్రధాన ఘ ట్టాలైన 14, 15, 16 తేదీల్లో హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, గోపాల్‌పూర్, జీల్గుల మీదుగా 250 బస్ ట్రిప్పులను నడపనున్నట్లు తెలిపారు. హుజూరాబాద్ నుంచి కొత్తకొండకు పెద్దలకు రూ. 42, చిన్నలకు రూ. 21 టిక్కెట్ ధర నిర్ణయించామన్నారు. మూడు రోజుల పాటు కొత్తకొండ, హుజూ రాబాద్ నుంచి ప్రతి అరగంటకోమారు ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు వివరించారు. ఇందులో ఈఓ హరిప్రకాశ్‌రావు, టీఎంయూ అధ్యక్షులు పీఎ ల్.రావు, జనరల్ సెక్రటరీ ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పుల భద్రయ్య ఉన్నారు.

మిర్చి కార్మికుల ధర్నా

- బస్తాకు రూ.8 చెల్లించాలని డిమాండ్
- లేకుంటే మునీం, దానం, భిక్ష ఇవ్వాలని ఆందోళన
- ఆగ్రహం వ్యక్తం చేసిన మార్కెట్ చైర్మన్, కార్యదర్శి

వరంగల్ సిటీ:

వరంగల్ వ్యవసాయ మార్కెట్లో గురువారం మిర్చి యార్డులో పనిచేసే కటింగ్, మార్కింగ్ కార్మికులు విచిత్ర ఆందోళనను నిర్వహించారు. కొద్ది రోజుల్లోనే మిర్చి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో తాము రైతుల వద్ద నుంచి మునీం, దానం, భిక్ష పేరుతో మిర్చి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విధానాన్ని నిలిపివేయద్దని నినాదాలు చేస్తూ మిర్చి యార్డు ఎదుట ఆందోళన చేశారు. దోచుకోనిస్తే పనిచేస్తాం..లేదంటే మాకు కూలి గిట్టదంటూ మాట్లాడుతుండడంతో మార్కెట్ చైర్మన్ కొంపెల్లి ధర్మరాజు, కార్యదర్శి నిర్మల ఆందోళన వద్దకు చేరుకొని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛాంబర్‌కు వచ్చి మాట్లాడాలని అనవసరంగా ఆందోళన చేయవద్దని వారికి సూచించారు. దీంతో కార్మిక నాయకుడు మహేష్ ఆధ్వర్యంలో కొందరు కార్యాలయానికి చేరుకొని చైర్మన్, కార్యదర్శులతో మాట్లాడారు. ప్రస్తుతం బస్తాకు రూ.8 చెల్లించడం జరుగుతుందన్నారు. అగ్రిమెంట్ సమయం కాగానే గిట్టుబాటు కాకుంటే ఛాంబర్, రైతు సంఘం నాయకులు, అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ సమక్షంలో కూలి రేట్లు పెంచడం జరుగుతుందని చైర్మన్, కార్యదర్శులు చెప్పారు. అప్పటి వరకు ఓపిక పట్టాలే తప్పా, ఇటువంటి అక్కరకు రాని దందాకు అనుమతి ఇవ్వాలని ఆందోళన చేయడం సరికాదని మందలించారు. ఇందుకు కార్మిక నాయకులు తమకు బస్తాకు రూ.4.80నే ఇస్తున్నారని, రూ.8 ఇవ్వడం లేదని, పైగా మిర్చి సీజన్లో అర్ధరాత్రి వరకు పని చేయడం జరుగుతుందని, ఇతర మార్కెట్లలో ఉన్న కూలి రేట్ల మాదిరిగా ధరలు పెంచాలని పేర్కొన్నారు. ఇందుకు చైర్మన్,కార్యదర్శిలు మాట్లాడుతూ బైలా నిబంధనల ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించడం జరుగుతుందని వివరించారు. డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయో మీ అడ్తిదారులను, కార్మిక మేస్త్రీలను నిలదీయాలని, ఒప్పందానికి సంబంధించిన ధరల పట్టికను వారికి అందచేశారు.



మిర్చి యార్డు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

చైర్మన్‌తో మాట్లాడడానికి వచ్చిన కార్మిక పెద్దలు



కొందరి ఉన్నతాధికారుల పాత్ర

కటింగ్, మార్కింగ్ కార్మికులు ఏ మాత్రం నిజాయితీలేని, పద్ధతి కానీ అడ్డగోలు దోపిడీకి అనుమతి ఇవ్వాలని ఆందోళన చేపట్టడంలో మార్కెట్‌కు సంబంధించిన ఓ ముగ్గురి ముఖ్య అధికారుల పాత్ర ఉన్నట్లు ఉద్యోగులు, కార్మిక నాయకుల మాటలను బట్టి తెలుస్తోంది. అంతే కాకుండా చైర్మన్, కార్యదర్శులను వారు హెచ్చరిస్తూ మార్కెట్లో ఎప్పటి నుంచో జరుగుతున్న ఈ దందాను అరికడితే మార్కెట్ నడవదని చైర్మన్, కార్యదర్శులు చెప్పారు. ఏది ఏమైనా అడుక్కోవడం పేరుతో అన్యాయంగా రైతుల పంట సరుకులను దోచుకోవడానికి అడ్డుకట్ట వేస్తే, ఇన్ని అడ్డంకులు ఎదురు కావడం విశేషం.

దూరవిద్య డిగ్రీ అర్హత పరీక్ష నోటిఫికేషన్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న డిగ్రీ బీఏ, బీకాం, బీబీఎం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 4 నుంచి ప్రవేశ అర్హత పరీక్షకు నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తు ఫారాలను దూరవిద్య స్టడీ సెంటర్లలో లభిస్తాయని కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్.దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. 28 వరకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమావేశాలు

- 6, 7వ తేదీల్లో కేయూలో నిర్వహణ
- విద్యారంగ సమస్యలపై చర్చ

కేయూ ముచ్చట్లు

కేయూ క్యాంపస్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జాతీయ సమితి సమావేశాలు ఈనెల 6,7 తేదీల్లో కేయూలో నిర్వహించనున్నారు. సమావేశాలు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి జాతీయ సమితి సభ్యులు హాజరుకానున్నారు. దేశంలోని ప్రధాన విశ్వవిద్యాలయలైన ఢిల్లీ, జవహర్‌లాల్, జామియా మిల్లియా ఇస్తామియా, పాండిచ్చేరి, కేరళ, కొచ్చిన్, ముంబాయి, ఐఐటీ ఖరగ్‌పూర్, ఢిల్లీ నిట్ లాంటి ప్రముఖ యూనివర్సిటీల నుంచి ఎన్నికైన విద్యార్థి నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. 6న ఉదయం 11 గంటలకు కేయూలోని ఫిజిక్స్ విభాగం సెమినార్ హాల్‌లో ప్రారంభమయ్యే సమావేశాలకు వరంగల్‌కు చెందిన ఏఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వలీఉల్లాఖాద్రి అధ్యక్షతవహిస్తారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి విశ్వజిత్‌కుమార్, కేరళ మాజీ హోంశాఖ మంత్రి, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి బినయ్ విశ్వవ్ ,ఏఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు వరంగల్ జిల్లాకు చెందిన తక్కళ్లపెల్లి శ్రీనివాస్ రావు ప్రసంగిస్తారు.

తొలిసారిగా జాతీయ సమితి సమావేశాలు

ఏఐఎస్‌ఎఫ్ 1936 అగస్టు 12 ఉత్తరప్రదేశ్‌లోలోని లక్నోలోని గంగా ప్రసాద్ మెమోరియల్ హాల్‌లో దేశమొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ అధ్యక్షతన జరిగింది. అలాగే జిన్నా, మౌలానా ఆజాద్, సరోజినీ నాయుడు, సీవి రామన్ సమక్షంలో ప్రేమ్‌నారాయణ, భార్గవ్ ప్రధాన కార్యదర్శిగా ఏఐఎస్‌ఎఫ్ స్థాపించబడింది. ఏఐఎస్‌ఎఫ్ స్థాపించబడిన నాటి నుంచి వివిధ ప్రాంతాల్లో జరిగిన జాతీయ స్థాయి సమావేశాలు వరంగల్‌లో తొలిసారి కావడం గమనార్హం.

విద్యారంగ సమస్యలపై చర్చించబోతున్నాం: వలీఉల్లాఖాద్రి

కేయూలో రెండు రోజుల పాటు నిర్వహించబోయే ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై



సయ్యద్ వలీఉల్లాఖాద్రి

సామాజిక సమస్యలపై చర్చించనున్నట్లు వల్లీఉల్లాఖాద్రి చెప్పారు. దేశంలో మోడీ సర్కార్ అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలు తదితర అంశాలపై సమావేశాల్లో చర్చించడం జరుగుతుందని తెలిపారు.

కొనసాగుతున్న రైల్వే టోర్నమెంట్స్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో ఆల్ ఇండియా రైల్వే ఇంటర్ ఇనిస్టిట్యూట్ ఇన్విటేషన్ టోర్నమెంట్స్ డీఆర్‌ఎం ట్రోఫీలో గురువారం రాత్రి రైల్వే కార్మికులైన మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ముంబాయి, చెన్నై రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు స్నూకర్స్, క్యారమ్స్ సింగిల్స్ ఆడారు. క్యారమ్స్ సింగిల్స్‌లో 20 జట్లు, స్నూకర్స్‌లో 11 మంది గెలుపొందారు. స్నూకర్స్ విజేతలు వీరే...

ఉబ్లి డివిజన్‌కు చెందిన సువర్తయ్యపై వరంగల్‌కు చెందిన దీరజ్, వరంగల్‌కు చెందిన కిషోర్‌పై ఉబ్లి డివిజన్‌కు చెందిన యాసిర్ గెలుపొందారు. డోర్నకల్‌కు చెందిన మాధవరావుపై వరంగల్‌కు చెందిన కులదీప్, వరంగల్‌కు చెందిన అమ్జద్ అలీపై ముంబాయికి చెందిన ప్రవీన్ సొస విజయం సాధించారు. వరంగల్‌కు చెందిన రంజిత్‌పై బెల్లంపెల్లికి చెందిన గోపి కుమార్, కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ పి.రాజుపై వరంగల్‌కు చెందిన డి.రోహిత్ గెలుపొందాడు. ముంబాయికి చెందిన సునిల్ గాడ్గే పై వరంగల్‌కు చెందిన పవన్, ముంబాయికి చెందిన సందీప్ అంకోలపై వరంగల్‌కు చెందిన జిజె.రాకేష్, ముంబాయికి చెందిన అనంద్ కమలేపై విజయం సాధించాడు. వరంగల్‌కు చెందిన భవాని కుమార్, వరంగల్‌కు చెందిన అన్వర్ అలీపై, కాజీపేట జనరల్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విష్ణుప్రసాద్, వరంగల్‌కు చెందిన అన్వర్‌పై కాజీపేటకు చెందిన ముజాహిద్ గెలుపొందారు.



క్యారమ్స్ సింగిల్స్ ఆడుతున్న క్రీడాకారులు

స్నూకర్స్‌ను ప్రారంభించిన సీసీసీ ఇస్మాయిల్

కాజీపేట రైల్వే ఇనిస్టిట్యూట్ టోర్నమెంట్స్‌లో భాగంగా రెండో రోజు గురువారం స్నూకర్స్ క్రీడను కాజీపేట చీఫ్ క్రూ కంట్రోలర్(సీసీసీ) ఇస్మాయిల్ ప్రారంభించారు. ఎం.సుదర్శన్, పి.రాజు, ఎం.రాజయ్య, సీహెచ్.సుదర్శన్, పి.వేదప్రకాష్, డీవీ.ప్రసాద్, అనిల్, ఎస్‌కె.జానీ తదితరులు పాల్గొన్నారు.

ఖేల్


హోరాహోరీగా క్రికెట్ పోటీలు




మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న కేఎల్ యూనివర్సిటీ ప్లేయర్ టోని

హసన్‌పర్తి(వర్ధన్నపేట): ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సౌత్ ఇండియా చాంపియన్ టీ–20 పోటీలు హోరాహరీగా సాగుతున్నాయి. ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల(వరంగల్)లో మూడు మైదానాలు, ఎస్‌ఆర్ ఐటీ(హైదరాబాద్)లోని మరో గ్రౌండ్‌లో ఈ పోటీలు జరుగుతున్నాయి. వరంగల్ కళాశాల మైదానంలో గురువారం రెండో రోజు కిట్స్(వరంగల్), అరోరా(హైదరాబాద్) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కిట్స్ జట్టు 94 తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కిట్స్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 177 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆరోరా జట్టు 16 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 83 పరుగులు చేశారు. కిట్స్ ఆటగాడు పవన్ 42 బంతుల్లో 63 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. మరో మ్యాచ్‌లో తిరుమల ఇంజనీరింగ్ కళాశాల(హైదరాబాద్)జట్టు, బిట్స్ (నర్సంపేట) జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన తిరుమల జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన బిట్స్ జట్టు 17.4 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. అలాగే కేఎల్ యూనివర్సిటీ(గుంటూరు) జట్టు, సీఐటీఎస్(కరీంనగర్)జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేఎల్ జట్టు గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన కేఎల్ యూనివర్సిటీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేయగా తర్వాత బ్యాటింగ్ చేసిన సీఐటీఎస్ జట్టు 17.3 ఓవర్లలో 100 పరుగులకే అలౌటైంది. సీఎంఆర్‌ఈసీ(హైదరాబాద్)జట్టును నిట్ (వరంగల్) జట్టు ఓడించింది.

అలాగే ఎంఆర్‌ఈసీ(హైదరాబాద్) జట్టు, ఎంఎల్‌ఆర్‌ఐటీ(హైదరాబాద్)జట్టును ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంఆర్‌ఈసీ జట్టు 19.2 ఓవర్లలో 97 పరుగులకు అలౌట్ కాగా తర్వాత బ్యాటింగ్ దిగిన ఎంఎల్‌ఆర్‌ఐటీ జట్టు 20 ఓవర్లలో 86 పరుగులకు ఇన్నింగ్‌ను ముగించుకుంది.





అంగన్‌వాడీ సెంటర్లు అనుకున్న లక్ష్యాన్ని అందించడం లేదు. కేవలం చిన్న పిల్లలను రెండు మూడు గంటలు కూర్చోబెట్టి పంపించే కేంద్రాలుగా మారిపోయాయి. అసలు తొలి సంరక్షణ విద్య చాలా సెంటర్లలో కొనసాగడం లేదు. కేవలం ఆహారం పెట్టేసి ఇళ్లకు పంపుతున్నారు.

అంగన్‌వాడీలా!

కనీస సౌకర్యాలు లేని అంగన్‌వాడీ సెంటర్లు.. సిబ్బంది కొరతతో ఇబ్బందులు

సిరిసిల్ల నుంచి ఆసరి మహేశ్:

గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణతోపాటు చిన్న పిల్లల్లో పౌష్టికాహారలోపాన్ని నిర్మూలించడం, ప్రీప్రైమరీ విద్యను అందించడం కోసం ఏర్పాటైన అంగన్‌వాడీ సెంటర్లు.. కేవలం అరకొర ఆహార పంపిణీ చేపట్టి చేతులు దులుపుకొనే కేంద్రాలుగా మారిపోతున్నాయి. రాష్ట్రంలోని అంగన్‌వాడీ సెంటర్లు ప్రీస్కూల్ విధానంలో నడవాలని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలకు, లబ్ధిదారులకు అందించే సేవలకు సంబంధించిన టైంటేబుల్‌ను మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారులు విడుదల చేశారు. కానీ అది ఎక్కడా అమలు కావడం లేదు. కేవలం నివేదికలు పైఅధికారులకు పంపడం, అంతా సవ్యంగా జరుగుతోందని వాళ్లు మిన్నకుండడం జరిగిపోతోంది.

కనీస సౌకర్యాలేవీ?

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు సుముఖంగానే ఉన్నారు. కానీ ఆ కేంద్రాల్లో కనీస వసతులైన తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, గదుల సౌకర్యాల లేమి ఉంది. టైం టేబుల్‌లో పిల్లలు నిద్రించేందుకు సమయాన్ని కేటాయించిన అధికారులు అందుకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడం మరో కారణం. రాష్ట్రంలోని అనేక కేంద్రాల్లో ఆయాలు, టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేంద్రాల పనితీరును పర్యవేక్షణ చేసే అధికారుల పోస్టులూ ఖాళీగా ఉండడంతో అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు. ప్రభుత్వ పథకాల ప్రచారం, సభలు, సమావేశాలకు అంగన్‌వాడీ కార్యకర్తలను, టీచర్లను వినియోగించడం కూడా సెంటర్ల నిర్వహణకు ఇబ్బందిగా మారింది.



చిన్న పిల్లలకూ దొడ్డు బియ్యమేనా?

వసతి గృహాల్లో, పాఠశాలల్లో సన్నబియ్యం భోజనం అందిస్తూ, చిన్న పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు దొడ్డు బియ్యంతో కూడిన ఆహారం అందించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇక గుడ్డు విషయంలోనూ అనేక ఆరోపణలు ఉన్నాయి. గుత్తేదారులు పౌల్ట్రీలో మిగిలిపోయిన చిన్నసైజు గుడ్లను సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారం ఏళ్లుగా నడుస్తున్నా అధికారుల నుంచి స్పందన లేదు.



సాగుచేద్దామా.. సేంద్రియ పత్తి!

ఆదిలాబాద్ జిల్లా నుంచి మహమ్మద్ అక్బర్ ఖాన్:

ఆర్గానిక్ పత్తికి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో దిగుబడి పెరిగేందుకు కొత్త కొత్త వంగడాలు వస్తున్నాయి. రోగాలను తట్టుకొనే విత్తనాలు తయారు చేస్తున్నారు. వాటికి కావాల్సిన పురుగుల మందులు సైతం కంపెనీలు తయారు చేస్తున్నాయి. దానికి తోడు రసాయన ఎరువులు విరివిగా వాడుతున్నారు. అయినా సరైన దిగుబడి రావడం లేదు. భూమిలో సారంలేక, కొత్త వంగడాలతో పురుగులు ఆశించి పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. ఇక వాతావరణం అనుకూలించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కానీ చేతన ఆర్గానిక్ ఎన్‌జీఓ ద్వారా ఆర్గానిక్ (సేంద్రియ పద్ధతి)లో సాగు చేయడంలో అధిక దిగుబడి సాధించడమే కాకుండా సాధారణ పంటల కంటే ఎక్కువ ధర పలుకుతోంది. విదేశాల నుంచి వచ్చి పంటలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారంటే దీనికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటికే 200 గ్రామాల రైతులు సాగు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ పరిధి సిర్పూర్(యు), ఉట్నూర్, నార్నూర్, ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్ మండలాల్లో సుమారు 200 గ్రామాల రైతులు 230 సంఘాలుగా ఏర్పడి ఐదు వేల ఎకరాల్లో ఆర్గానిక్ పద్ధతిలో పత్తి పంటను సాగు చేశారు. ఈ సీజన్‌లో సుమారు 20 వేల క్వింటాళ్ల దిగుబడి సాధించారు. సాధారణ పద్ధతిలో సాగుచేసే పత్తితో పోల్చితే ఆర్గానిక్ పద్ధతిలో వచ్చిన దిగుబడికి మంచి ధర లభిస్తోంది. క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.400 వరకు అధికంగా వస్తోంది. ఈ పద్ధతిని 2009 సంవత్సరం నుంచి అమలు చేస్తున్నారు.

ఇదీ ఆర్గానిక్ విధానం..

ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేసే రైతులు భూమిలో రసాయనిక ఎరువులకు బదులు పశువుల పేడను వాడతారు. పురుగుల మందులు కాకుండా వేప కషాయం, ఆవు మూత్రం, ఆవుపేడ, వేపనూనె, మిరపకాయ- వెల్లుల్లితో చేసిన మిశ్రమం పంటలకు ఉపయోగిస్తున్నారు. చేతన ఆర్గానిక్ సంస్థ నిర్వాహకులు దగ్గరుండి పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేస్తున్నారు.

విదేశాలకు ఎగుమతి

గిరిజనులు పండించిన ఆర్గానిక్ పత్తిని విక్రయించడానికి మార్కెట్‌కు తీసుకుపోనక్కర్లేదు. ఈ పత్తి విదేశాలకు ఎగుమతి అవుతోంది. జర్మనీకి చెందిన డెబెల్లా అనే సంస్థ ఈ పత్తిని కొనుగోలు చేస్తోంది. అక్కడి నుంచి బ్రెజిల్, ఇంగ్లాండ్, స్వీడన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆయా దేశాల ప్రతినిధులు బెంగళూరులోని చేతన ఆర్గానిక్ సంస్థ కార్యాలయంలో సంప్రదించి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా విదేశీ కంపెనీ అయిన డెబెల్లా.. అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఈ కంపెనీ 2009లో ఏజెన్సీలోని సుమారు 50 గ్రామాలను దత్తత తీసుకుంది. మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు జీవనోపాధికి సంబంధించి అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగానే నార్నూర్ మండలం మహాగామ్ గ్రామంలో 50 మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు విద్యార్థులు కూర్చోవడానికి 350 బెంచీలు, సైకిళ్లను పంపిణీ చేసింది.

పర్యటించిన స్వీడన్ దేశస్తులు



స్వీడన్ దేశానికి చెందిన క్లాత్ బ్రాండ్ కంపెనీ నిర్వాహకులు అలెగ్జాండర్, లార్స్‌గున్నార్ గత డిసెంబర్ 13, 14 తేదీల్లో ఏజెన్సీ గ్రామాల్లో పర్యటించారు. గిరిజనులు సాగుచేస్తున్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతు సంఘాలతో సమావేశమై వారి జీవన విధానం, పంటలు పండించే తీరు, సంస్థ ద్వారా అందుతున్న సహాయ సహకారాలపై ఆరా తీశారు. జైనూర్ మండలంలోని ఉషేగాం, రాగాపూర్, నార్నూర్ మండలంలోని పిప్రి, మహాగాం గ్రామాలను సందర్శించి తమ సంస్థ ద్వారా చేపట్టిన సామాజిక కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఇంటర్వ్యూ



పేరు: ఎ.విద్యాసాగర్

హోదా: ఇన్‌స్పెక్టర్, సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్

అంశం: ఫ్యామిలీ కౌన్సెలింగ్

కాజీపేట అర్బన్:

ప్రశ్న: సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్ పరిధి ఎక్కడ వరకు ఉంది?

జవాబు: సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలో నర్సంపేట డివిజన్, పరకాల, కాజీపేట, ఘన్‌పూర్, జనగామ, వర్ధన్నపేట పీఎస్‌లు ఉనాయి.

ప్రశ్న: సిబ్బంది ఎంత మంది ఉన్నారు?

జవాబు: 22 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

ప్రశ్న: దంపతులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఎలా ఇస్తున్నారు?

జవాబు: వివిధ కారణాలతో గొడవ పడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్న దంపతులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తారు. వీరిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు పంపిస్తాం. ఇద్దరు సీనియర్ న్యాయవాదులు, ఒక సైకియాట్రిస్ట్ కౌన్సెలింగ్ ఇస్తారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం కేసు నమోదు చేస్తాం.

ప్రశ్న: విదేశాల్లో ఉండే వారిపై ఫిర్యాదు వస్తే ఎలా చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: విదేశాల్లో స్థిరపడిన భర్తపై స్థానికంగా ఉండే భార్య ఫిర్యాదు చేసినప్పుడు ప్రతి ఎయిర్‌పోర్టు ఆవరణలో లుక్‌ఔట్ నోటీసులను ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తాం. వివాహం చేసుకున్న మహిళలకు అత్తా మామ, భర్త నుంచి సమస్యలు ఏర్పడిన ప్పుడు ఆపత్కాలంలో డైల్ 100, నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు సత్వర సేవలందిస్తున్నాం.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న బీజేపీ నాయకులు

హన్మకొండ: హన్మకొండ పోచమ్మకుంటలో గురువారం వెలిషాజు రమేష్ ఆధ్వర్యంలో పలువురు విశ్వబ్రాహ్మణ యువకులు బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి.. యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ 40 మంది యువకులు బీజేపీలో చేరినట్లు తెలిపారు. వేణుగోపాలచారి, శ్రీకాంత్, జగన్, అశోక్, రాజేష్, విగ్నేష్, సురేష్, సాంబాచారి, రామకృష్ణ, నగేష్, సుదర్శన్ పార్టీలో చేరారని వివరించారు.

విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ రమేష్

మడికొండ: విద్యాభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని 34వ డివిజన్ కార్పొరేటర్ జోరిక రమేష్ అన్నారు. గురువారం మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో కేసీఆర్ కిట్లను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థిపై సంవత్సరానికి రూ.1.50 లక్షలను ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కిట్టులో పేస్ట్, టూత్ బ్రష్, బాత్ సోప్–3, క్లీనింగ్ సోప్–2, టంగ్ క్లీనర్, 12 శాంపోలు, తదితర వస్తువులు ఉంటాయని తెలిపారు. ఈ కిట్లను 3 నెలలకు ఒకసారి విద్యార్థులకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి, స్థానికులు వినోద్, బ్రదర్ అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్: హన్మకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి గంగు ఉపేంద్రశర్మ భక్తులతో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వడుప్సా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి బుచ్చిబాబు పూజలు చేశారు. హృదయ్ పథకం ద్వారా వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి రూ.ఐదున్నర కోట్లు కేటాయించామని పేర్కొన్నారు.



క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మర్రి యాదవరెడ్డి



విద్యారణ్యపురి: ఎస్‌టీయూ ఆధ్వర్యంలో..

హన్మకొండ కల్చరల్: నగరంలోని పలు సంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం ఆవిష్కరించారు. వేయిస్తంభాల దేవాలయంలో శ్రీకేతేశ్వర పొదుపు పరపతి పరస్పర సహాయక సహకార సంఘం క్యాలెండర్‌ను 'కుడా' చైర్మన్ మర్రి యాదవరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వడుప్సా అధ్యక్షుడు డాక్టర్ తక్కెళ్లపల్లి బుచ్చిబాబు, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, పరపతి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిలువేరు రవికుమార్, బొమ్మిడి రమేష్, కోశాధికారి వలిపిరెడ్డి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి కూచనపల్లి దేవేందర్, గౌరవ అధ్యక్షుడు దండు శ్రీనివాస్, కోరుట్ల రాంబాబు, సలహాదారు తుమ్మల సాంబయ్య, కోరుట్ల రమేష్, దిలిప్‌కుమార్ రవీందర్ పాల్గొన్నారు.

ఎస్‌టీయూ ఆధ్వర్యంలో..

విద్యారణ్యపురి: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ) వరంగల్ రూరల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నూతన డైరీ, క్యాలెండర్‌ను గురువారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రూరల్ జిల్లా అధ్యక్షుడు రావుల లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి బోయిన రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రూపిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఎస్‌టీయూ అర్బన్ అధ్యక్షుడు ఎ.సదయ్య, రాష్ట్ర నాయకులు ఎల్ల కుమారస్వామి, సూర రమేష్, శ్రీనివాసులు, శ్రావణ్, రాంబాబు, శ్రీనివాస్, శర్మ, నర్సింహాచార్యులు, జిల్లా మాజీ అధ్యక్షులు మొగిలి పాల్గొన్నారు.



కాజీపేట: యాదవ యువసేన సంఘం ఆధ్వర్యంలో..

యాదవ యువసేన సేవా సంఘం..

కాజీపేట: సోమిడిలోని రాధాకృష్ణుల దేవాలయ ఆవరణలో గురువారం యాదవ యువసేన సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను సభ్యులు ఆవిష్కరించారు. అంతకుముందు సంఘం గౌరవ అధ్యక్షుడు సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పెద్దకాసు నాగరాజు, కాయిత చేరాలు, బోయిని భిక్షపతి, మంతుర్తి కుమార్, రంజిత్, రాజు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది నియంతృత్వ పాలన

మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

హసన్‌పర్తి: ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ చేపట్టిన దీక్ష గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా దీక్ష శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరెపల్లి పవన్, దుర్గాప్రసాద్, రాజారావు భిక్షపతి, రమేష్, బొక్క సాంబరాజు, వీసం సురేందర్‌రెడ్డి, జన్ను రవీందర్, గుమ్మడి రాములు, వెంకన్న పాల్గొన్నారు.

'టీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి'

హన్మకొండ: 44వ డివిజన్ ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి అనిశెట్టి సరితను గెలిపించాలని తెలంగాణ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటె చిరంజీవి అన్నారు. గురువారం నయీంనగర్‌లో జరిగిన టీజీఏ సమావేశంలో చిరంజీవి పాల్గొని మాట్లాడుతూ ప్రతీఒక్కరూ మానవతాదృక్పథంతో సరితను గెలిపించాలని కోరారు. టీజీఏ జిల్లా అధ్యక్షుడు కందడి సంజీవరెడ్డి, రమేష్, జోషి, ప్రకాష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సోమేశ్వర్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల ఇరుముడి ధారణ

కాజీపేట: కాజీపేట పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం 108 మంది అయ్యప్ప భక్తులు ఇరుముడి ధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి ఉడితేల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శబరిమలకు వెళ్తున్న స్వాములకు ఇరుముడి కట్టారు. గురుస్వాముల పర్యవేక్షణలో మహా పడిపూజ నిర్వహించిన పిదప భక్తుల కోలాహలం మధ్య ఇరుముడి కార్యక్రమం ముగిసింది.

న్యూస్ బాక్స్

బ్యాడ్జీల అందజేత

విద్యారణ్యపురి: హన్మకొండలోని ప్రభుత్వ మార్కజీ హైస్కూల్‌లో చదువులో రాణించిన విద్యార్థులకు సీతాకోమల పబ్లికేషన్స్ సంస్థ ప్రతినిధులు బెస్ట్ స్టూడెంట్ బ్యాడ్జీలు సమకూర్చగా గురువారం డీఈఓ కె నారాయణరెడ్డి, ఎంఈఓ వీరభద్రనాయక్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఆ సంస్థ బాధ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ కమిషన్ సభ్యుడి ఎంపికపై హర్షం



కట్టయ్యను సన్మానిస్తున్న కేయూ వీసీ సాయన్న

కేయూ క్యాంపస్: రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన దళితరత్న బొమ్మల కట్టయ్యను గురువారం కేయూ వీసీ సాయన్న తన చాంబర్‌లో సన్మానించారు. ఆయన నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్లు భద్రునాయక్, ఎర్రగట్టుస్వామి, డాక్టర్ వెంకయ్య, కొంగర జగన్, ప్రశాంత్, రాజేందర్, సారయ్య, సజ్జన్‌నాయక్, వెంకటేశ్వర్లు తదితరుల పాల్గొన్నారు.

దళితులపై దాడికి నిరసనగా రాస్తారోకో

కాజీపేట: పూణే సమీపంలో దళితులపై అకారణంగా దాడికి పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం సభ్యులు కాజీపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో సభ్యులు బాపూజీనగర్ క్రాస్ రోడ్డు నుంచి నిరసన ప్రదర్శన చేపట్టారు. కాగా ఈ రాస్తారోకోతో రోడ్డుపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కాజీపేట పోలీసులు ఆందోళనకారులకు నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ ధర్నాలో నాయకులు కోండ్ర నర్సింగారావు, సిరిల్ లారెన్స్, బండి విజయ్‌కుమార్, పట్నం మనోహర్, పప్పుల గోవర్ధన్, బండి రాంచందర్, ముప్పిడి వెంకటేష్, రెడ్డి మల్లా వీరస్వామి, రాందాసు, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో ఉచిత వైద్యశిబిరం

మడికొండ: హన్మకొండలోని ప్రశాంతి ఆస్పత్రి ఆధ్వర్యంలో మడికొండలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ బాబు మదార్కర్ నేతృత్వంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. విద్యార్థులు తమ ఆరోగ్య పరిరక్షణ కోం జాగ్రత్తలుత ఈసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీహరి, డాక్టర్ యాకుబ్, డాక్టర్ సాయి సృజన, మేనేజర్ నల్లపు శ్రీనివాస్, కోఆర్డినేటర్ నాగపురి వెంకటేష్, అక్బర్ పాల్గొన్నారు.

What can you say about their slope?



యార్లగడ్డ వనరాజు
స్కూల్ అసిస్టెంట్,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల


CO-ORDINATE GEOMETRY

Section Formula


The coordinates of the point P(x, y) which divides the line segment joining the points A (x_1, y_1) and B (x_2, y_2) internally in the ratio $m_1 : m_2$ are:

$$\left(\frac{m_1x_2+m_2x_1}{m_1+m_2}, \frac{m_1y_2+m_2y_1}{m_1+m_2}\right)$$

- This is known as the section formula.
- If the ratio in which P divides AB is k : 1 then the coordinates of the point P are $\left(\frac{kx_2+x_1}{k+1}, \frac{ky_2+y_1}{k+1}\right)$
- The coordinates of mid point P of the line segment joining the points $A(x_1, y_1)$ and $B(x_2, y_2)$ are: $\left(\frac{x_1+x_2}{2}, \frac{y_1+y_2}{2}\right)$
- The coordinates of centroid of triangle ABC with vertices $A(x_1, y_1)$, $B(x_2, y_2)$ and $C(x_3, y_3)$ are $\left(\frac{x_1+x_2+x_3}{3}, \frac{y_1+y_2+y_3}{3}\right)$
- The point of concurrence of medians of a triangle is called its centroid.
- Centroid divides each median in the ratio 2 : 1.
- The points which divide a line segment into 3 equal parts are said to be the trisectional points.
- If P and Q be the points of trisecion of AB line segment then AP = PQ = QB.



- If P, Q are the points of trisection of AB line segment, then P divides AB in the ratio 1:2 and Q divides AB in the ratio 2:1.
- Area of a triangle = ½ (Base × Height)
- Area of ΔABC with vertices A (x_1, y_1), B (x_2, y_2) and C (x_3, y_3) is the numerical value of expression $=\frac{1}{2}\left|x_1(y_2-y_3)+x_2(y_3-y_1)+x_3(y_1-y_2)\right|$
- Area of ΔAOB with vertices $A(x_1, y_1)$, $B(x_2, y_2)$ and O (0, 0) is the numerical value of the expression $=\frac{1}{2}\left|x_1y_2-x_2y_1\right|$
- If the vertices of triangle O(0, 0), A (a, 0) and B (0, b) then the area of ΔOAB $=\frac{1}{2}|ab|$
- Area of quadrilateral ABCD = Area of ΔABC + Area of ΔACD



Heron's Formula

- If a, b, c are three sides of ΔABC then the area of ΔABC = $\sqrt{s(s-a)(s-b)(s-c)}$ where $s=\frac{a+b+c}{2}$

Slope:

- If a straight line makes the angle θ with X-axis then the slope of that straight line is m = tanθ.
- Slope of the line passing through the points (x_1, y_1) and (x_2, y_2) is $m=\frac{y_2-y_1}{x_2-x_1}$
- Slope of X-axis is '0'
- Slope of Y-axis is not defined.

Model Problems

1. Find the coordinates of the point which divides the join of (–1,7), (4,–3) in the ratio 2 : 3.

Sol: Given points (–1, 7), (4, –3)
given ratio 2 : 3 = $m_1 : m_2$
Let P(x, y) be the required point
Using the section formula

$$P(x, y)=\left(\frac{m_1x_2+m_2x_1}{m_1+m_2}, \frac{m_1y_2+m_2y_1}{m_1+m_2}\right)$$

$$\Rightarrow\left(\frac{2(4)+3(-1)}{2+3}, \frac{2(-3)+3(7)}{2+3}\right)$$

$$\Rightarrow\left(\frac{8-3}{5}, \frac{-6+21}{5}\right)\Rightarrow\left(\frac{5}{5}, \frac{15}{5}\right)\Rightarrow(1,3)$$

2. If A and B are (–2, –2) and (2, –4) respectively. Find the coordinates of P such that $AP=\frac{3}{7}AB$, P lies on the segment AB.

A. We have $AP=\frac{3}{7}AB\Rightarrow\frac{AP}{AB}=\frac{3}{7}$

$\frac{AP}{AP+PB}=\frac{3}{7}$ (∵ AB= AP+AB)

7AP = 3(AP+PB) ⇒ 7AP–3AP = 3PB

$\Rightarrow 4AP = 3PB \Rightarrow \frac{AP}{PB}=\frac{3}{4}$

So P divides AB in the ratio = 3 : 4
A= (–2, –2); B = (2, –4)
∴ Coordinates of P are

$$\left(\frac{3(2)+4(-2)}{3+4}, \frac{3(-4)+4(-2)}{3+4}\right)$$

$$P(x,y)=\left(\frac{6-8}{7}, \frac{-12-8}{7}\right)\Rightarrow\left(\frac{-2}{7}, \frac{-20}{7}\right)$$

3. If the mid point of the line segment joining $A\left(\frac{x}{2}, \frac{y+1}{2}\right)$ and B (x+1, y–3) is C (5, –2), then find x, y.

A. Midpoint of the line segment joining A (x_1, y_1), B (x_2, y_2) is $\left(\frac{x_1+x_2}{2}, \frac{y_1+y_2}{2}\right)$

Given that midpoint of $A\left(\frac{x}{2}, \frac{y+1}{2}\right)$ and B (x+1, y–3) is C (5, –2)

$$\therefore (5,-2)=\left(\frac{\frac{x}{2}+x+1}{2}, \frac{\frac{y+1}{2}+y-3}{2}\right)$$

$$\Rightarrow\frac{\frac{x}{2}+x+1}{2}=5\Rightarrow\frac{x+2x+2}{4}=5$$

$\Rightarrow 3x+2 = 20 \Rightarrow x = 6$

$$\frac{\frac{y+1}{2}+y-3}{2}=-2\Rightarrow\frac{y+1+2y-6}{4}=-2$$

$\Rightarrow 3y–5 = –8 \Rightarrow 3y = –8+5 \Rightarrow y = –1.$

4. The points (2, 3), (x, y), (3, –2) are vertices of a triangle. If the centroid of the triangle is origin, then find (x, y).

A. Centroid of (x_1, y_1), (x_2, y_2) and (x_3, y_3) = $\left(\frac{x_1+x_2+x_3}{3}, \frac{y_1+y_2+y_3}{3}\right)$

Given that centroid of (2, 3), (x, y), (3, –2) is (0, 0)

i.e. $(0,0)=\left(\frac{2+x+3}{3}, \frac{3+y-2}{3}\right)$

$$(0,0)=\left(\frac{5+x}{3}, \frac{y+1}{3}\right)\Rightarrow\frac{5+x}{3}=0\Rightarrow x=-5$$

$\frac{y+1}{3}=0\Rightarrow y=-1$ ∴ (x, y) = (–5, –1)

5. If the points A (6, 1), B (8, 2), C (9, 4) and D(p, 3) are the vertices of a parallelogram, taken in order find the value of p.

A. We know that diagonals of parallelogram bisect each other.
Given A (6, 1), B (8, 2), C (9, 4), D (p, 3)
So, the coordinates of the midpoint of AC = Coordinates of the midpoint of BD.

i.e. $\left(\frac{6+9}{2}, \frac{1+4}{2}\right)=\left(\frac{8+p}{2}, \frac{2+3}{2}\right)$

$$\Rightarrow\left(\frac{15}{2}, \frac{5}{2}\right)=\left(\frac{8+p}{2}, \frac{5}{2}\right)\Rightarrow\frac{8+p}{2}=\frac{15}{2}$$

$\Rightarrow p=15-8=7 \therefore p = 7$

7. Find the slope of the line joining the two points A (–1.4, –3.7) and B (–2.4, 1.3)

A. Given points A (–1.4, –3.7), B (–2.4, 1.3)
slope of AB =

$$\frac{y_2-y_1}{x_2-x_1}=\frac{(1.3)-(-3.7)}{-2.4-(-1.4)}$$

$$=\frac{1.3+3.7}{-2.4+1.4}=-5$$

8. Justify that the line $\overline{AB}$ line segment formed by(–2,8), (–2,–2) is parallel to Y–axis. What can you say about their slope? Why?

A. Slope of AB =

$$\frac{y_2-y_1}{x_2-x_1}=\frac{-2-8}{(-2)-(-2)}=\frac{-10}{0}=$$

underfined.

∴The slope of AB cannot defined, because the line segment $\overline{AB}$ is parallel to Y–axis.

6. Find the area of the triangle whose vertices are (0, 0), (3, 0) and (0, 2).

A. Area of triangle

$$=\frac{1}{2}\left|x_1(y_2-y_3)+x_2(y_3-y_1)+x_3(y_1-y_2)\right|$$

$$=\frac{1}{2}\left|0(0-2)+3(2-0)+0(0-0)\right|$$

$=\frac{1}{2}|6|$ = 3 sq.units

Note: Area of the triangle whose vertices are(0,0), (x_1,y_1), (x_2,y_2) is: $=\frac{1}{2}\left|x_1y_2-x_2y_1\right|$

9. If x–2y +k = 0 is a median of the triangle whose vertices are at points A (–1, 3), B (0, 4) and C (–5, 2), find the value of K.

A. The coordinates of the centroid G of ΔABC

$$\left(\frac{(-1)+0+(-5)}{3}, \frac{3+4+2}{3}\right)=(-2,3)$$

Since G lies on the median x–2y + k = 0,
⇒ Coordinates of G satisfy its equation
∴ – 2– 2(3) + k = 0 ⇒ k = 8.

10. Determine x so that 2 is the slope of the line through P (2, 5) and Q (x, 3)

A. Given points P (2, 5) and Q (x, 3)
Slope of $\overline{PQ}$ is 2

i.e. $2=\frac{y_2-y_1}{x_2-x_1}\Rightarrow 2=\frac{3-5}{x-2}\Rightarrow 2=\frac{-2}{x-2}$

⇒ – 2 = 2(x–2) ⇒2x = 2 ⇒ x = 1.

11. The coordinates of one end point of a diameter of a circle are (4, –1) and the coordinates of the centre of the circle are (1, –3). Find the other end point.

A. Let AB be a diameter of the circle having its centre at C (1,–3) such that the coordinates of one end A are (4, –1)
Let the coordinates of other end be B (x, y) since C is the mid point of AB.

∴The coordinates of C are $\left(\frac{x+4}{2}, \frac{y-1}{2}\right)$

But, the coordinates of C are given to be (1, –3)

$$\therefore\left(\frac{x+4}{2}, \frac{y-1}{2}\right)=(1,-3)\Rightarrow\frac{x+4}{2}=1$$

$$\Rightarrow\frac{x+4}{2}=1\Rightarrow x+4=2\Rightarrow x=-2$$

$$\Rightarrow\frac{y-1}{2}=-3\Rightarrow y=-5$$

∴Other end point of daimeter is (–2, –5)

'అనాటమీ ఆఫ్ ప్లాంట్స్' గ్రంథ రచయిత?



జి. శ్రీనివాస్
స్కూల్ అసిస్టెంట్, బయోసైన్స్, జెడ్‌పీహెచ్‌ఎస్, పెర్కకొండారం, నల్గొండ జిల్లా.

టీఎస్‌పీఎస్సీ టీఆర్‌టీ
ఎస్‌జీటీ/ఎస్‌ఏ-బయాలజీ ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. జంతు రాజ్యంలో మొదటి త్రిస్తరిత(Triploblastic) జీవులు ఏ వర్గానికి చెందినవి?
1) అనెలిడ 2) మొలస్కా 3) ప్లాటీహెల్మింథిస్ 4) ఆర్థ్రోపోడ

2. జంతు రాజ్యంలో మొదటి నిజ శరీర కుహర జీవులు ఏవి?
1) ప్లాటీహెల్మింథిస్ 2) నెమటోడ 3) అనెలిడ 4) పొరిఫెర

3. ద్విపార్శ్వ సౌష్ఠవం మొదటిసారిగా ఏ వర్గపు జీవుల్లో కనిపించింది?
1) గుండ్రటి పురుగులు 2) బద్దె పురుగులు 3) వానపాములు 4) కీటకాలు

4. నాలుగు రాజ్యాల వర్గీకరణను ప్రతిపాదించిన శాస్త్రవేత్త ఎవరు?
1) హెకెల్ 2) విట్టేకర్ 3) కోప్‌లాండ్ 4) లిన్నియస్

5. కింది వాటిలో విట్టేకర్ వర్గీకరణలో ఉండి, కోప్‌లాండ్ వర్గీకరణలో లేని రాజ్యం ఏది?
1) ప్రొటిస్టా 2) ఎనిమేలియా 3) ఫంజై 4) మొనీరా

6. కింది వాటిలో హెకెల్ తన వర్గీకరణలో లిన్నియస్ ప్రతిపాదించిన రెండు రాజ్యాలకు దేన్ని కలిపాడు?
1) ఫంజై 2) మొనీరా 3) ప్రొటిస్టా 4) ప్లాంటే

7. 'ద్వినామీకరణం'లో మొదటి పదం దేన్ని సూచిస్తుంది?
1) ప్రజాతి 2) జాతి 3) ఉపజాతి 4) కుటుంబం

8. 'జాతి' అనే పదాన్ని తొలిసారిగా వర్ణించిన శాస్త్రవేత్త ఎవరు?
1) లిన్నియస్ 2) హెకెల్ 3) జాన్‌రే 4) హుకర్

9. పరాశరుడు భూచర మొక్కలను ఏ లక్షణం ఆధారంగా వర్గీకరించాడు?
1) ఆయుర్వేద గుణం 2) పుష్ప లక్షణం 3) ఆవాసం 4) ఏదీకాదు

10. వర్గీకరణ అంతస్తుల్లో పెద్దది ఏది?
1) రాజ్యం 2) వర్గం 3) కుటుంబం 4) రంగం

11. కింది వాటిలో ఏ రాజ్యానికి చెందిన జీవులు అతి పురాతనమైనవి?
1) ప్రొటిస్టా 2) ఫంజై 3) మొనీరా 4) ప్లాంటే

12. ఏక కణ నిజకేంద్రక జీవుల రాజ్యం ఏది?
1) ప్రొటిస్టా 2) మొనీరా 3) మెటాఫైటా 4) మెటాజోవా

13. ఏక కణ కేంద్రక పూర్వ జీవుల రాజ్యం ఏది?
1) మొనీరా 2) ప్రొటిస్టా 3) ఫంజై 4) ఎనిమేలియా

14. ఫంజై రాజ్యానికి సంబంధించి కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
1) అన్నీ బహుకణ జీవులు
2) ఎక్కువ బహుకణ జీవులు, కొన్ని ఏకకణ జీవులు
3) ఎక్కువ శాతం సిద్ధబీజాలను ఉత్పత్తి చేస్తాయి
4) పైవన్నీ సరైనవే

15. జంతు రాజ్యంలో మొదటిసారిగా సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ ఏ జీవుల్లో కనిపించింది?
1) మొలస్కా 2) ఆర్థ్రోపోడ 3) అనెలిడ 4) పొరిఫెరా

16. వివృత రక్త ప్రసరణ మొదటిసారిగా ఏ జీవుల్లో కనిపించింది?
1) ఇఖైనోడర్మట 2) మొలస్కా 3) అనెలిడ 4) ఆర్థ్రోపోడ

17. కింది వాటిలో ఏ జీవుల్లో మొదటిసారిగా తల, వక్షం, ఉదరం అనే భాగాలు కనిపించాయి?
1) అనెలిడ 2) మొలస్కా 3) ఆర్థ్రోపోడ 4) ఇఖైనోడర్మట

18. కింది వాటిలో ఏ వర్గం జీవులు మంచి నీటిలో, భూమి మీద నివసించలేవు?
1) అనెలిడ 2) ఇఖైనోడర్మట 3) మొలస్కా 4) ఆర్థ్రోపోడ

19. నవీన జీవుల కంటే పురాతనమైన జీవులు..?
1) సరళమైనవి 2) సంక్లిష్టమైనవి 3) చెప్పలేం 4) అభివృద్ధి చెందినవి

20. 'ద్వినామీకరణం'ను ఏ సంవత్సరంలో ప్రతిపాదించారు?
1) 1856 2) 1758 3) 1859 4) 1885

21. పట్టుపురుగు గుడ్లను సూక్ష్మజీవులు పాడు చేస్తాయని కనుగొని, వాటిని నిర్మూలించే పద్ధతిని కూడా కనిపెట్టిన శాస్త్రవేత్త? *(DSC - 2004)*
1) లూయిస్ పాశ్చర్
2) ఆంటోనీ వాన్ లివెన్ హుక్
3) ఆచార్య మహేశ్వరి
4) టి.ఎస్. వెంకట్రామన్

22. 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ షుగర్‌కేన్ రీసెర్చ్' అనే సంస్థ ఏ నగరంలో ఉంది? *(DSC-2004)*
1) నాగ్‌పూర్ 2) పుణె 3) లక్నో 4) కటక్

23. పిండోత్పత్తి శాస్త్రానికి నాంది పలికిన శాస్త్రవేత్త?
1) అరిస్టాటిల్ 2) లూయిస్ పాశ్చర్ 3) విలియమ్ హార్వే 4) ఆంటోనీ వాన్ లివెన్ హుక్

24. భూమి మీద ఉన్న మొక్కలు, జంతువుల విస్తరణను తెలిపే జీవశాస్త్ర శాఖ ఏది?
1) జంతు భౌగోళిక శాస్త్రం 2) జంతు భూ విజ్ఞాన శాస్త్రం 3) ఆర్నిథాలజీ 4) ఫైకాలజీ

25. 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫైకాలజీ' అని ఎవరిని పేర్కొంటారు?
1) వెంకట్రామన్ 2) స్వామినాథన్ 3) అయ్యంగార్ 4) బీర్బల్ సహానీ

26. కింది వాటిలో పెంటా వాలెంట్ వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు తోడ్పడదు?
1) ధనుర్వాతం 2) హెపటైటిస్ 3) కోరింత దగ్గు 4) టైఫాయిడ్

27. MMR (Measles, Mumps, and Rubella) వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు ఉపయోగిస్తారు?
1) బాక్టీరియల్ 2) వైరల్ 3) 1, 2 4) ఫంగల్

28. విద్యార్థి.. జీవశాస్త్రం చదవడం ద్వారా దోమల వల్ల ఏయే వ్యాధులు వ్యాపిస్తాయని తెలుసుకున్నాడు?
ఎ) మలేరియా బి) బోదకాలు సి) డెంగ్యూ డి) మెదడువాపు
1) ఎ, బి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

29. పాశ్చరైజేషన్ ప్రక్రియ వల్ల సూక్ష్మజీవులు ఏ పరిస్థితుల్లో మనుగడ సాగించలేవని విద్యార్థి అర్థం చేసుకుంటాడు?
1) అతి శీతల 2) అతి ఉష్ణ 3) సాధారణ 4) 1, 2

30. మార్షల్, వారెన్ కింది వాటిలో దేనిపై పరిశోధనలు జరిపారు?
1) కలరా బాక్టీరియా 2) క్షయ బాక్టీరియా 3) అల్సర్ బాక్టీరియా 4) ప్లేగు బాక్టీరియా

31. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ నోబెల్ బహుమతిని కింది వారిలో ఎవరితో కలిసి పంచుకున్నారు?
1) విల్కిన్‌సన్, మేయర్ 2) ఫ్లోరి, చైన్ 3) హార్వే, ఫలాడే 4) మాల్పిజీ, హార్వే

32. నెఫ్రాన్ నిర్మాణాన్ని అంతర్నిర్మాణ శాస్త్రంలో చదివితే, మూత్రం ఏర్పడే విధానాన్ని గురించి ఏ శాస్త్రంలో చదవాలి?
1) సూక్ష్మ అంతర్నిర్మాణ శాస్త్రం 2) శరీర ధర్మ శాస్త్రం 3) అణుజీవ శాస్త్రం 4) జీవరసాయన శాస్త్రం

33. కింది వాటిలో లక్నోలో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి?
1) NBRI(National Botanical Research Institute), IARI(Indian Agricultural Research Institute)
2) CICR(Central Institute for Cotton Research), CRRI(Central Rice Research Institute)
3) NBRI, IISR(Indian Institute of Sugarcane Research)
4) IARI, IISR

34. కింది వాటిలో హైదరాబాద్‌లో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి?
ఎ) NIN(National Institute of Nutrition)
బి) NIO(National Institute of Oceanography)
సి) ICRISAT(International Crops Research Institute for the Semi-Arid Tropics)
డి) NIV(National Institute of Virology)
1) ఎ, డి 2) బి, సి 3) బి, డి 4) ఎ, సి

35. కింది వాటిలో ద్వినామీకరణంలో దేన్ని తిరిగి ఉపయోగించవచ్చు?
1) కుటుంబం 2) ప్రజాతి 3) జాతి 4) తరగతి

36. కింది వాటిలో 'జాతి'కి సంబంధించి సరికాని వాక్యం ఏది?
1) అంతర ప్రజననం జరుపుకొనే జీవుల సమూహం
2) గతిశీలమైంది 3) స్థిరమైంది
4) ఒకే కేంద్రక నిర్మాణాన్ని కలిగి ఉండే జీవుల సమూహం

37. జతపరచండి.
శాస్త్రవేత్త
a) ఎడ్వర్డ్ జెన్నర్ b) లూయిస్ పాశ్చర్ c) ఎల్లాప్రగడ సుబ్బారావు d) జోనస్ సాల్క్
ఆవిష్కరణ
i) టెట్రాసైక్లిన్ ii) రేబిస్ వ్యాక్సిన్ iii) పోలియో వ్యాక్సిన్ iv) మశూచి వ్యాక్సిన్
1) a-ii, b-iii, c-iv, d-i
2) a-iv, b-ii, c-i, d-iii
3) a-iv, b-iii, c-i, d-ii
4) a-iii, b-ii, c-i, d-iv

38. కేంద్రకాన్ని 'సైటో బ్లాస్ట్' అంటారని ఊహించిన వారెవరు?
1) రాబర్ట్ బ్రౌన్ 2) ష్లీడన్ 3) గాల్జీ 4) అరిస్టాటిల్

39. 'అనాటమీ ఆఫ్ ప్లాంట్స్' గ్రంథ రచయిత?
1) నెహెమియా గ్రూ 2) రాబర్ట్ బ్రౌన్ 3) ష్వాన్ 4) స్టీఫెన్ హేల్స్

40. జతపరచండి.
శాస్త్రవేత్త
a) సర్ రోనాల్డ్ రాస్ b) వాట్సన్, క్రిక్ c) అలెగ్జాండర్ ఫ్లెమింగ్ d) హరగోవింద్ ఖొరానా
నోబెల్ బహుమతి పొందిన సంవత్సరం
i) 1902 ii) 1968 iii) 1945 iv) 1962
1) a-i, b-iv c-iii, d-ii
2) a-iv, b-ii, c-i, d-iii
3) a-iv, b-iii, c-i, d-ii
4) a-iii, b-ii, c-i, d-iv

41. జతపరచండి.
శాస్త్రవేత్త
a) డార్విన్ b) చార్లెస్ లయెల్ c) మాల్థస్ d) రుడాల్ఫ్ విర్షోవ్
గ్రంథం
i) అమ్నిస్ సెల్యూలా డే సెల్యులే
ii) ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్
iii) ప్రిన్సిపుల్స్ ఆఫ్ జియాలజీ
iv) ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పాపులేషన్
1) a-i, b-iv c-iii, d-ii
2) a-iv, b-ii, c-i, d-iii
3) a-ii, b-iii, c-iv, d-i
4) a-iii, b-ii, c-i, d-iv

42. జోనాస్ సాల్క్, అల్బర్ట్ సాబిన్ అనే శాస్త్రవేత్తలు ఏ వ్యాధి నివారణకు కృషి చేశారు?
1) కేన్సర్ 2) టైఫాయిడ్ 3) పోలియో 4) డెంగ్యూ

43. జీవ పరిణామానికి ఉపయోగపడే, భూమి మీద వదిలిన గతించిన జీవుల అవశేష నిదర్శనాలు? *(TET - 2011)*
1) ఇంధనాలు 2) ఎముకలు 3) పాదముద్రలు 4) శిలాజాలు

44. వృక్షాల ఫలదీకరణను పరీక్ష నాళికల్లో జరిపే పద్ధతిని కనుగొన్న భారతీయ శాస్త్రవేత్త? *(DSC- 2008)*
1) పంచానన్ మహేశ్వరి
2) టి.ఎస్. వెంకట్రామన్
3) బీర్బల్ సహానీ
4) ఎం.ఎస్. స్వామినాథన్

45. జంతు కణాలకు కణకవచం ఉండదని కనుగొన్న వారెవరు? *(DSC- 2008)*
1) రుడాల్ఫ్ విర్షోవ్
2) థియోడర్ ష్వాన్
3) లివెన్ హుక్ 4) లూయిస్ పాశ్చర్

46. ఒక శాస్త్రవేత్త తన పరిశోధనల కోసం HCl లాంటి ఆమ్ల మాధ్యమంలో కూడా నివసించగలిగే ఏకకణ జీవులను కనుగొన్నాడు. అవి ఏ రాజ్యానికి చెందినవి? *(TET- 2011)*
1) ప్రొటిస్టా 2) మొనీరా 3) ప్లాంటె 4) ఫంజై

47. పృష్ఠవంశం లేకుండా ఉండి అనేక వ్యాధులను వ్యాప్తి చేసే జంతువులు ఎక్కువగా ఏ వర్గానికి చెందుతాయి? *(TET- 2011)*
1) మమ్మేలియా 2) ఆర్థ్రోపోడ 3) ప్రోటోజోవా 4) నెమటోడ

48. జీవశాస్త్ర పరిశీలనలో శాస్త్రీయ విధానాన్ని అవలంబించిన వారెవరు? *(DSC- 2006)*
1) సర్ రోనాల్డ్ రాస్
2) లూయిస్ పాశ్చర్ 3) అరిస్టాటిల్
4) ఆంటోనీ వాన్ లివెన్ హుక్

49. 'మున్‌జెల్లి' ఏ వర్గానికి చెందిది? *(DSC- 2004)*
1) పొరిఫెర 2) టినోఫొర 3) ఇఖైనోడర్మట 4) నెమటోడ

50. 'స్లైమ్‌మోల్డ్స్' ఏ రాజ్యానికి చెందినవి? *(DSC- 2004)*
1) ఎనిమేలియా 2) ప్రొటిస్టా 3) ఫంజై 4) మొనీరా

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 3	5) 3
6) 3	7) 1	8) 3	9) 2	10) 4
11) 3	12) 1	13) 1	14) 1	15) 3
16) 4	17) 3	18) 2	19) 1	20) 2
21) 1	22) 3	23) 1	24) 1	25) 3
26) 4	27) 3	28) 4	29) 4	30) 3
31) 2	32) 2	33) 3	34) 4	35) 3
36) 3	37) 2	38) 2	39) 1	40) 1
41) 3	42) 3	43) 4	44) 1	45) 2
46) 2	47) 2	48) 3	49) 2	50) 3

నాన్నా చెప్పవా

నీటిలో వేస్తే పేలే పదార్థాలు కూడా ఉంటాయా?



నీరు అన్ని రకాల మంటల్ని ఆర్పగల్గుతుందని చాలామంది అనుకుంటుంటారు. అలాగే నీటిలో ఏ పదార్థమూ మండదని కూడా భావిస్తుంటారు. కాని, ఇవి రెండూ నిజాలు కాదు.

నీటికి సంబంధించిన ఒక చిత్రమైన విషయమేమిటంటే ప్రతినీటి అణువు (H_2o)...ఒక ఆక్సిజన్, రెండు హైడ్రోజన్ పరమాణువులతో కలిసి రూపొందుతుంది. ఈ రెండు పదా ర్థాలూ వాయురూపంలో ఉన్నప్పుడు (విడివిడిగా) ఒకటి భగ్గున మండే స్వభావాన్ని (హైడ్రోజన్), మరొకటి భగ్గున మండించే స్వభావాన్ని చూపిస్తాయి. కాని, ఇవి రెండూ కలిసి నీటి అణువులుగా రూపొందినప్పుడు మాత్రం అలాంటి ధర్మాన్ని చూపించవు సరికదా, వివిధ రకాల మంటలను ఆర్పేందుకు కూడా ఉపయోగపడతాయి. మంటలను ఆర్పడం కోసం మనం వుపయోగించే నీరు ఆ మంటల నుంచి వేడిని లేక ఉష్ణశక్తిని గ్రహించి నీటి ఆవిరిగా మారిపోతుంది. దీని వల్ల మంటలు చల్లారి తగ్గుముఖం పడతాయి.


పెట్రోలు, కిరోసిన్ లాంటి కొన్ని పదార్థాలు నీటిలో ఉన్నప్పటికీ మండుతాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాంటి పదార్థాలు నీటిలో కలవకుండా, దానిపై తేలుతూ ఉండ టం వల్లనే ఇలాంటిది సాధ్యమవుతుంది. ఇకపోతే సోడియం, పొటాషియం, రుబీడియం, క్యాసియం వంటి కొన్ని క్షారలోహాలు నీటితో చాలా వేగంగా రసాయనిక చర్య జరుపుతాయి. దాని ఫలితంగా అలాంటి పదార్థాలను నీటిలో వేయగానే పేలుడు సంభవిస్తుంది. అందుకే, ఇలాంటిది జరగకుండా చూసేందుకై సోడియం, పొటాషియం లాంటి పదార్థాలని ఏదైనా తైలంలో భద్రపరుస్తారు.

అంకెలు కలపండి రంగులు వేయండి





ఈ రెండు బొమ్మల మధ్య 5 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.



→ నుండి లోపలికి వెళ్లి → నుండి బయటకు రావాలి. దారి కనుక్కోండి.

మీకు తెలుసా?

సూర్యునికన్న మిగతా గ్రహాలు బాగా చిన్నవా?




ప్రస్తుతం మనం నివసిస్తున్న మన సౌరమండలానికి సంబంధించిన చాలా చాలా ఆశ్చర్యం కలిగించే అంశాలలో ఒకటేమిటంటే..... ఇందులో ఉన్న గ్రహాలు, ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్లు (గ్రహశకలాలు), తోకచుక్కలు, నక్షత్ర ధూళి, ఇంకా ఇతర ఖగోళ పదార్థాలు–వీటన్నిటి ద్రవ్యరాశి కలిపి మొత్తం సౌర మండలం ద్రవ్యరాశిలో 1 శాతం కూడా లేదు. చాలా ఆశ్చర్యంగా అన్పిస్తుంది కదూ? అయినా ఇది నిజం.


సౌర మండలంలోని మొత్తం ఖగోళ నిర్మాణాల ద్రవ్యరాశిలో 99.86 శాతం కేవలం ఒక్క సూర్యుడిలోనే వుంది. అందుకే సూర్యుడి గురుత్వాకర్షణ శక్తి కొన్ని వేల కిలోమీటర్ల దాకా తన ప్రభావాన్ని చూపించగల్గుతోంది. మొత్తానికి మిగిలిన 0.14 శాతం ద్రవ్యరాశి మాత్రమే మిగిలిన అన్ని ఖగోళ పదార్థాలకు పంచబడింది.

సౌరమండలంలో సూర్యుడి ద్రవ్యరాశి పోగా మిగిలిన దాంట్లో మళ్లీ 71 శాతం ఒక్క గురుగ్రహంలోను, 21 శాతం ఒక్క శని గ్రహంలోనూ వుంది. అంటే సూర్యుణ్ణి పక్కన పెట్టగా మిగిలిన దాంట్లో 92 శాతాన్ని ఈ రెండు గ్రహాలే కైవసం చేసుకున్నాయన్న మాట. ఇదిపోగా మిగిలిన 8 శాతం ద్రవ్యరాశి...ఇతర గ్రహాలు, ఉపగ్రహాలు, తోకచుక్కలు, క్యూపర్‌బెల్ట్ వస్తువులు తదితర అన్ని ఖగోళ నిర్మాణాలకు పంచబడిందన్నమాట! బుధుడు, కుజుడు – ఈ రెండు గ్రహాల్లో ఉన్న పదార్థం కేవలం 0.1 శాతం మాత్రమే. భూమి ద్రవ్యరాశి దీనికి మరో 6 రెట్లు ఎక్కువ (0.6 శాతం). ఈ లెక్కన మన గ్రహాలు, ఉపగ్రహాలు వంటి వాటిని సూర్యుడితో పోలిస్తే అవి ఎంత చిన్నగా వుంటాయో, వాటిలో ఎంత తక్కువ పదార్థం వుంటుందో మీరే ఊహించుకోవచ్చు.

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి



పూరించండి






పైన కొన్ని బాక్సులు, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లీషు పేరును మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎడమవైపున కనిపించే బొమ్మ ఇంగ్లీష్ పదం అవుతుంది. ట్రై చేయండి చూద్దాం!

కూల్.. కూల్ కాజీపేట

కాజీపేట: కాజీపేటలో సోమవారం తెల్లవారుజామున పొగమంచు కమ్ముకుంది. కడిపికొండ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి కాజీపేట రైల్వేజంక్షన్, ఎలక్ట్రికల్ షెడ్, మడికొండ మెట్టుగుట్ట, కాజీపేట పరిసర ప్రాంతాల్లో ఎటుచూసినా మంచు దుప్పటి కప్పినట్లుగా మారింది. రైల్వేట్రాక్, సమీపంలోని గుట్టలు కనిపించకుండాపోయాయి. దాదాపు ఉదయం 8గంటల వరకు ఇదే పరిస్థితి ఉండటంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించారు. కాజీపేట పట్టణం కూల్‌గా కనిపించింది.







1. మంచుతో కనిపించని మెట్టుగుట్ట బండరాళ్లు
2. మంచుతో నిండిన రైల్వేలేన్
3. మంచు కమ్ముకున్న కాజీపేట పట్టణ పరిసర ప్రాంతాలు

జిల్లాకు..జలకళ



హసన్‌పర్తి: ఎస్సారెస్పీ నీటితో ఉమ్మడి జిల్లాకు జళకళ రానుంది. గురువారం సాయంత్రం మానేరు నుంచి జిల్లాకు నీరు విడుదలయింది. ఏప్రిల్ మొదటివారం వరకు నీటిలో ఎస్సారెస్పీ కాల్వలు కళకళలాడనున్నాయి. అయితే వారం తప్పించి..వారం నీరు మానేరు నుంచి విడుదలవుతాయని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 2500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. నాలుగు నెలల పాటు ఎనిమిది టీఎంసీల నుంచి పది టీఎంసీల నీరు విడదలవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. 1.60లక్షల ఎకరాలకు సాగునీరుకు నీరు అందుతోందని అధికారులు చెప్పారు. తాగుకు మాత్రం నీరు ఇవ్వడం లేదని వారు తెలిపారు.

బైక్‌పై షికారు.. చలి మంటతో హుషారు



బైక్ నడుపుతూ వెళ్తున్న స్పీకర్ మధుసూదనాచారి



చల్లగరిగెలో ప్రజలతో చలిమంటలు కాస్తున్న స్పీకర్ మధుసూదనాచారి

చిట్యాల(భూపాలపల్లి): ప్రగతి నిద్ర పేరుతో శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న భూపాలపల్లి నియోజకవర్గంలోని గ్రామాల్లో రాత్రి బసచేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి మండలంలోని చల్లగరిగెలోని యాదవ కమ్యూనిటీ హాల్ నిద్రించిన ఆయన గురువారం తెల్లవారుజామున గ్రామస్తులతో ముచ్చటిస్తూ చలి మంటలు కాగారు. అనంతరం వేప పుల్ల నోట్లో వేసుకొని బైక్‌పై తిరుగుతూ గ్రామాన్ని, పంట పొలాలను పరిశీలిస్తూ స్థానికులను ఆశ్చర్యపరిచారు.

ఆరుబయటకు వెళ్లొద్దు

- మరుగుదొడ్లను తప్పనిసరిగా వినియోగించాలి
- వరంగల్ అర్బన్ డీఆర్‌డీఓ రాము



మల విసర్జన చేసిన వ్యక్తి ఇంట్లో మొక్కను నాటిస్తున్న డీఆర్‌డీఓ



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఓ రాము

కమలాపూర్(హుజూరాబాద్): బహిరంగ మల విసర్జన చేయడం సాంఘిక దురాచారమని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలని డీఆర్‌డీఓ తౌటం రాము సూచించారు. కమలాపూర్ మండలంలోని వంగపల్లిలో గురువారం వేకువజామున ఆయన పర్యటించారు. బహిరంగ మల విసర్జన చేస్తున్న ఐదుగురిని గుర్తించి వారికి, గ్రామస్తులు, యువతకు బహిరంగ మల విసర్జన ద్వారా కలిగే అనర్థాలు, మరుగుదొడ్ల వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించి అవగాహన కల్పించారు. వేకువజామునే వంగపల్లి గ్రామానికి చేరుకున్న డీఆర్‌డీఓ గ్రామంలోని నాలుగు దిక్కుల్లో బహిరంగ మల విసర్జన చేస్తున్న వారి కోసం గాలించి బహిరంగ మలవిసర్జన చేస్తున్న ఐదుగురిని గుర్తించి వారిని తమ ప్రచార రథంలో ఎక్కించుకుని వారి వారి ఇళ్లకు వెళ్లి కుటుంబసభ్యుల సమక్షంలో వారికి అవగాహన కల్పించారు. అక్కడ వారికి ఒక్కో మొక్కను బహుమతిగా అందజేసి ఆ మొక్కను వారి ఇళ్ల ముందు నాటించారు. ఆ మొక్కను చూసిన ప్రతిసారి నేను బహిరంగ మల విసర్జన చేసినందుకు తనతో ఈ మొక్కను నాటించారని, మరోసారి బహిరంగ మల విసర్జన చేయొద్దనే ఆలోచన తెప్పించేందుకు వారి ఇళ్లలో మొక్కలు నాటించినట్లు డీఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంతోష్, ఏపీఓ రమేష్, ఏపీఎం నారాయణ, ఎఫ్ఏ రాజ్‌కుమార్, సర్పంచ్ పంజాల సారయ్య, మహిళా సంఘాల సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'గ్రేటర్'లో ఉప ఎన్నిక మాక్ పోల్

- ఇండోర్ స్టేడియంలోనే ఈవీఎంల భద్రత, ఓట్ల లెక్కింపు
- నిఘా నీడలో ఎన్నికల నిర్వహణ



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న మాస్టర్ ట్రైనర్ రవీందర్

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని ఈ నెల 9న జరిగే 44వ డివిజన్ ఉప ఎన్నికకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఈ మేరకు గురువారం గ్రేటర్ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో మాస్టర్ ట్రైనర్ ఆడెపు రవీందర్ పోలింగ్ నిర్వహణ, సరళి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ నిర్వహణపై మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ సీఆర్‌సీ సూత్రాలను పాటించాలన్నారు. ఈవీఎం ఓటింగ్ వినియోగం, ప్రతి గంటకొక మారు పోలింగ్ శాతాన్ని, పోలింగ్ పూర్తయ్యాక, సీలింగ్ పక్రియ, స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చే అంశాలపై వివరించారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో అందుబాటులో అదనంగా ఒక్కొక్క ఈవీఎం ప్రత్యామ్నయంగా ఏర్పాటు చేసుకోవాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు.

ఇండోర్‌లో ఓట్ల లెక్కింపు

ఉప ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత ఈవీఎంలను గ్రేటర్ ఇండోర్ స్టేడియంలో భద్రపరుస్తారు. ఈ నెల 11న ఎన్నికల కౌటింగ్ ఉంటుంది. ఇన్‌చార్జి కమిషనర్ నాగేశ్వర్, ఆర్ఓ కరుణాకర్, ఏఆర్వో సిబ్బంది ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి ఏర్పాట్లపై సలహాలు ఇచ్చారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు ఎటువైపు పెట్టాలనే అంశంపై చర్చించి, ఖరారు చేశారు. ఏఆర్ఓ పారిజాతం, ఆర్ఎఫ్ఓ నారాయణరావు, సూపరింటెం డెంట్ ప్రసునారాణి, వేణుగోపాల్, శ్రీనివాస్, సంధ్య పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ జట్టు


జోనల్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్‌టోర్నమెంట్‌కు ఎంపికైన పురుషుల జట్టు

కేయూ క్యాంపస్: వైజాగ్‌లోని ఆంధ్ర యూనివర్సిటీలో జరుగుతున్న జోనల్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే కేయూ క్రికెట్ పురుషుల జట్టు వివరాలను కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ గాదె పాణి గురువారం ప్రకటించారు. పి.దీపక్, ఎం.నవరాసన్, బి.సురేష్, (వాగ్దేవి కాలేజీ, వరంగల్), పి.ఆదిత్యసాయికుమార్ (మాస్టర్జీ డిగ్రీ కళాశాల, హన్మకొండ), కె.ప్రశాంత్, ఎం చైతన్య (యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల, హన్మకొండ), ఎస్.వివేక్, ఎండీ.సమద్ (ప్రభుత్వ ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం), కె.విజయ్, ఎస్‌కే.అక్బర్, బి.సతీష్‌చంద్ర (యూసీపీఈ, కేయూ ,ఖమ్మం), ఎంఏ.మిరాజ్ (సీఐటీఎస్, హన్మకొండ), ఎంఏ.ఫర్దీన్ (కిట్స్ వరంగల్), కె.యుగేందర్ (మాస్టర్జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, వరంగల్), బి.శ్రావణ్ (కేఎండీసీ ఖమ్మం), ఎస్.ప్రణయ్ (పూలాజీబాబా డిగ్రీ కళాశాల, ఉట్నూరు) జట్టుకు ఎంపికయ్యారు. వాగ్దేవి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మహ్మద్‌అఫ్జల్ కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

వరంగల్ అర్బన్: ఆధార్ అనుసంధానం బయోమెట్రిక్ యంత్రాల్లో వేలిముద్రలు నమోదు కాని ఔట్ సోర్సింగ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని గ్రేటర్ మునిసిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం గ్రేటర్ ప్రధాన కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ నాగేశ్వర్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిల్టర్‌బెడ్‌లో ఆత్మహత్య చేసుకున్న సురేష్ సతీమణికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇన్‌చార్జి కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు ధర్మరాజు, బొట్ల రమేష్, ఏకు సుధాకర్ ఉన్నారు.


ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిట్ డైరెక్టర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ.రమణరావు గురువారం కేయూ వీసీని కలిశారు. నిట్ డైరెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన అనంతరం మొదటిసారిగా ఆయన కేయూకు వచ్చారు. ఈ సందర్భంగా నిట్, కేయూలో విద్యా కార్యక్రమాలు, అభివృద్ధి గురించి పరస్పరం చర్చించారు. అనంతరం నిట్ డైరెక్టర్ రమణారావును కేయూ వీసీ సన్మానించారు.


నిట్ డైరెక్టర్ రమణారావును సన్మానిస్తున్న కేయూ వీసీ సాయన్న

మేడారానికి 500 మంది పారిశుద్ధ్య కార్మికులు

వరంగల్ అర్బన్: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మేడారంలో గురువారం రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి, అధికారులు పర్యటించారు. మేడారంలో దేవస్థానం గద్దెలు, భక్తుల ఆవాసం తదితర అంశాలపై అధికారులు సమీక్షించారు. మేడారం పారిశుద్ధ్య సేవలందించేందుకు గ్రేటర్ వరంగల్‌లోని 500 మంది కార్మికులు, ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని గ్రేటర్ ఎంహెచ్‌ఓ రాజారెడ్డిని శ్రీదేవి ఆదేశించారు. దీంతో ఎంహెచ్‌ఓ అంగీకరించినట్లు తెలిసింది. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ అనురాధ, మెప్మా డైరెక్టర్ వందన కుమార్, ఆర్‌డీ జాన్‌శ్యాంసన్, భూపాలపల్లి కమిషనర్ రవీందర్, గ్రేటర్ ఎంహెచ్‌ఓ రాజారెడ్డి పాల్గొన్నారు.

గ్రేటర్ బయాలజిస్టు సంధ్యకు రీపోస్టింగ్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ బయాలజిస్టు సాధనాల సంధ్యకు రీపోస్టింగ్ ఇస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు చేశారు. గ్రేటర్ పరిధిలో బయాలజిస్టు సంధ్య.. డీజిల్, పెట్రోల్ బిల్లుల వివాదంలో విచారణ ఎదుర్కొంటున్నారు. విచారణ తేలకపోవడంతో సంధ్యకు రీపోస్టింగ్ ఇస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే జిల్లా మలేరియా అధికారి పైడి రాజు గ్రేటర్ వ రంగల్ బయాలజిస్టుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బయాలజిస్టుగా పోస్టింగ్ రావడంతో ఆయన తప్పుకోనున్నారు.

GREATER WARANGAL
సాక్షి గ్రేటర్ వరంగల్ I
శుక్రవారం 5-1-2018 www.sakshi.com

మంచి మాట చెబుదాం..



ఓరుగల్లుకు ఓటేద్దాం

- స్వచ్ఛ సర్వేక్షణ్–2018 పోటీలో వరంగల్ మహా నగరం
- చారిత్రక నగరానికి పరిశుభ్రతగా గుర్తింపు తీసుకువద్దాం
- 1969 టోల్‌ఫ్రీకి కాల్ చేయండి..

వరంగల్ అర్బన్:

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛత, పరిశుభ్రతపై కేంద్ర ప్రభుత్వం మూడేళ్లుగా దృష్టి సారించింది. దేశంలోని 4043 నగరాలు, పట్టణాల మధ్య పోటీతత్వాన్ని పెంచేందుకు స్వచ్ఛ సర్వేక్షణ్‌ను చేపట్టింది. క్షేత్రస్థాయిలో స్వచ్ఛత, పరిశుభ్రత, కనీస వసతులు, వాస్తవ పరిస్థితులను పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. అందులో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేయడం, ఫీడ్ బ్యాక్ ద్వారా మార్కులుంటాయి. మార్కులే ర్యాంకులకు ఆధారంగా నిలుస్తాయి. చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ వరంగల్ మహా నగరాన్ని మెరుగైన స్థానంలో నిలిపేందుకు ప్రతిపౌరుడు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైంది. దేశంలో వరంగల్ మహా నగరం ఉత్తమ ర్యాంకు సాధించేందుకు 1969 మిస్డ్ కాల్ ఇవ్వడం, మంచి మాట చెప్పాలి. మెయిల్ ద్వారా మంచి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి. ప్రజాభిప్రాయ సేకరణలో ఒక మంచి మాట చెప్పి మహా నగరానికి గుర్తింపు తీసుకువద్దాం.

2016 నుంచే స్వచ్ఛ సర్వేక్షణ్..

- దేశ వ్యాప్తంగా 2016 సంవత్సరంలో 100 నగరాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వరంగల్‌కు 32వ స్థానం దక్కింది. 2017 సంవత్సరంలో 500 నగరాల్లో వరంగల్‌కు 28వ స్థానం లభించింది. స్వచ్ఛ సర్వేక్షణ్–2018లో దేశ వ్యాప్తంగా 4,043 నగరాలు, పట్టణాలు పోటీ పడుతున్నాయి. ఈ ఏడాది పోటీ అధికంగా ఉంటుంది.
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మన నగరం మొదట స్థానం నిలిపేందుకు మొబైల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ప్రయత్నించవచ్చు. 1969కు కాల్ చేస్తే రింగ్ అయి డిస్ కనెక్ట్ అవుతుంది.
- అప్పుడు మీ మొబైల్‌కు కాల్ వస్తుంది. 3 నొక్కితే తెలుగు భాష ఎంపిక అవుతుంది. 6 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి.
- మీ మీ నగరం స్వచ్ఛ సర్వేక్షణ్–2018 సర్వేలో పాల్గొంటుందని మీకు తెలుసా అంటే 1 నొక్కండి.
- గతంలో కంటే మీ ఏరియాలో పరిశుభ్రంగా ఉన్నట్లు అనిపించిందా అంటే 1 నొక్కాలి.
- బహిరంగ ప్రదేశల్లో చెత్త బుట్టలను ఉపయోగించడం ప్రారంభించారా అంటే 1 నొక్కండి.
- ఇంటి నుంచి సేకరించిన చెత్త వేరు చేసే పక్రియ విషయంలో మెరుగుపడిందా సంతృప్తి చెందారా అంటే 1 నొక్కండి.
- గత సంవత్సరంతో పోల్చితే మూత్ర విసర్జన, లేదా మరుగుదొడ్ల సంఖ్య పెరిగిందా అంటే 1 నొక్కండి. కమ్యూనిటీ, ప్రజా మరుగుదొడ్లుఅంటే1 నొక్కండి.

మెయిల్ ఐడీ ద్వారా ఇలా..

మొయిల్ ఐడీ ఉన్న వారంతా ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనవచ్చును. గూగుల్‌లో swachhsurvekshan 2018. org ఓపెన్ చేయాలి. ఎడమ వైపు సిటిజన్ ఫీడ్ బ్యాక్‌ను ఓపెన్ చేయాలి. రాష్ట్రం, జిల్లా, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, పేరు, ఈ–మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌ను నమోదు చేయాలి. ఎన్ని సంవత్సరాలుగా ఇక్కడ జీవిస్తున్నారు. 12 నెలలకుపైన ఉంటే ఎస్ అని నమోదు చేయాలి. పిన్ కోడ్ నంబర్ ఇవ్వాలి. అప్పుడు మీ మొబైల్‌కు ఓటీపీ నంబర్ వస్తుంది. నంబర్‌ను నమోదు చేయాలి. నెక్ట్స్ అనగానే 10 ప్రశ్నలుంటాయి. మహా నగరానికి మంచి పేరు తెచ్చే ఆప్షన్‌పై ఎంపిక చేస్తే మహా నగరానికి ఉత్తమమైన ర్యాంకు వస్తుంది. తద్వారా వరంగల్ నగరానికి నిధుల కేటాయింపు పెరుగుతుంది. దేశ వ్యాప్తంగా చారిత్రక నగరికి మరింత ఖ్యాతి దక్కుతుంది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో బాబురావు ప్రతిభ


బంగారు పతకం అందుకుంటున్న బాబురావు

వరంగల్ స్పోర్ట్స్: మంచిర్యాలలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్ వెటరన్ రాష్ట్రస్థాయి పోటీల్లో హన్మకొండ గుడిబండల్‌కు చెందిన సలువాది బాబురావు బంగారు పతకాన్ని సాధించారు. 50 ప్లస్ కేటగిరీలో 5 కేఎం వేగం నడకలో బాబురావు అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్‌ను సాధించి, వచ్చే నెల 10 నుంచి 13వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాబురావు ప్రస్తుతం ఆర్టీసీ వరంగల్ 2–డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా బాబురావుకు ఆర్టీసీ ఆర్‌ఎం సూర్యకిరణ్, డీవీఎం రూరల్ అపర్ణకల్యాణి, డీవీఎం (యుఆర్‌బీఓఎం) రాములు, వరంగల్ 2 డీఎం భానుకిరణ్ ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

నృత్య పోటీల్లో సెయింట్ పీటర్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న జయపాల్‌రెడ్డి

హన్మకొండ: జాతీయస్థాయి నృత్య పోటీల్లో హన్మకొండ చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో ఇటీవల అభినయ నృత్య భారతి ఆధ్వర్యంలో జాతీయస్థాయి కూచిపూడి నృత్య పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సెయింట్ పీటర్స్ సెంట్రల్ స్కూల్ విద్యార్థిని ఆళ్ల యజ్ఞశ్రీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. నృత్య గురువు బొంపెల్లి సుధీర్ వద్ద యజ్ఞశ్రీ శిక్షణ పొందింది. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ జయపాల్‌రెడ్డి గురువారం అభినందించారు.

శంబీపూర్ రాజును కలిసిన నేతలు


శంబీపూర్ రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

హన్మకొండ: టీఆర్‌ఎస్ యువత రాష్ట్ర అధ్యక్షుడు శంబీపూర్ రాజును ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్ల ధర్మారెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

‘స్వేరోస్’ జిల్లా ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్



మడికొండ: స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మడికొండకు చెందిన అనిల్‌కుమార్‌ను నియమించినట్లు ఆ సంఘం ఈస్ట్ జోన్ అధ్యక్షుడు పుల్లా కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నం మధు, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. గురుకుల పాఠశాల, కళాశాలల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.

అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ


అంధుల పాఠశాలలో విద్యార్థులతో కేక్ కట్ చేయిస్తున్న క్రిస్టియానా


అంధ విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు అందించిన పవనిజం ఫ్యాన్స్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అనిరోజ్ క్రిస్టియానా

వరంగల్: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతమైన వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.అనిరోజ్ క్రిస్టియానా అన్నారు. పోచమ్మమైదాన్‌లోని లూయిస్ బ్రెయిలీ ఆదర్శ అంధుల పాఠశాలలో గురువారం బ్రెయిలీ 209వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అనిరోజ్ క్రిస్టియానా మాట్లాడుతూ అంధులు చదువుకునేందుకు బ్రెయిలీ లిపి ఎంతో ఉపయోగపడిందన్నారు. అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ అని పేర్కొన్నారు. అంధుల పాఠశాల విద్యార్థులకు ఎల్లవేళలా మావంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కీర్తించారు. అంధ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ కె.అనితారెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ సుధీర్, కార్పొరేటర్ ఝెలుగం లీలావతి, గిర్మాజీపేట పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, డాక్టర్ లక్ష్మీనారాయణ, అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ నలివెల కుమారస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు

పండ్లు, బిస్కట్లు పంపిణీ

అజ్ఞాతవాసి చిత్రం విడుదల సందర్భంగా పవనిజం ఫ్యాన్స్ గురువారం పోచమ్మమైదాన్‌లోని లూయిస్ అదర్శ అంధుల పాఠశాలలో విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చకిలం అభిలేష్, ఎ.ధర్మజ్, పి.శివకృష్ణ, కె.రాహుల్, టి.రాజు, ఆర్.సూరజ్, వి.కరణ్ పాల్గొన్నారు.

బ్రెయిలీ పార్కు ఏర్పాటు చేయాలి

ఐనవోలు: జిల్లాలో లూయిస్ బ్రెయిలీ పార్కును ఏర్పాటు చేయాలని తెలంగాణ వికలాంగుల ఫోరం (టీవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాజు కోరారు. మండల కేంద్రంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు మండలాధ్యక్షుడు పట్టాపురం సారయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జన్ను రాజు మాట్లాడుతూ అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. అంధత్వం శాపం కాదని, శారీరక లోపమేనని, వారు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కోరారు. అంధుల లిపితో ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మడిగ నాగరాజు, బి.యాకయ్య, గోనె కొమురయ్య, ముసుకు నాగరాజు, వి.రాజయ్య, రమేష్, ఉపేందర్, సురేష్, సుధాకర్, ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రి జగదీష్‌రెడ్డికి సన్మానం


మంత్రి జగదీష్‌రెడ్డిని సన్మానిస్తున్న టీఆర్‌వీకేఎస్ నాయకులు

హన్మకొండ: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.జాన్సన్, ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాష్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని సన్మానించారు. టీఆర్‌వీకేఎస్ నాయకులు డోలి శ్రీనివాస్‌రావు రమేష్, భాస్కరన్న రాజ్‌పాల్, మోసిన్, గరి. చందు, రజనీకాంత్, యూసుఫ్, రామకృష్ణ, రాములు ఉన్నారు.

హెల్త్ డైరెక్టర్లకు శుభాకాంక్షలు


డైరెక్టర్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీఓస్ నాయకులు

కాజీపేట అర్బన్: వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ లలితా కుమారి, వైద్య విద్యా డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో టీఎన్జీవోస్ వైద్య విభాగం నాయకులు కలిశారు. అధ్యక్షుడు కిరణ్‌రెడ్డి, మాధవిరెడ్డి, సదానందం, భగవాన్‌రెడ్డి, రమేష్, శంకర్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బాస్కెట్‌బాల్ తృతీయ స్థానం వరంగల్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో మూడు రోజులుగా కొనసాగిన తెలంగాణ నాలుగో సీనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో పురుషుల, మహిళల విభాగాల్లో హైదరాబాద్ జట్లే విజేతలుగా నిలిచాయి. పురుషుల ద్వితీయస్థానం రంగా రెడ్డి, తృతీయ స్థానం వరంగల్ జట్లు దక్కించుకున్నాయి. పురుషుల మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్–వరంగల్‌పై 80–38 స్కోరు తేడాతో, రెండో సెమీఫైనల్‌లో రంగారెడ్డి–కరీంనగర్‌పై 96–71 స్కోరు తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేన్ కార్యదర్శి నర్మాన్ ఐజాక్, టోర్నీ పరిశీలకులు, ఖమ్మం అథ్లెటిక్స్ కోచ్ ఎండీ.గౌస్ పాషా, బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.విజయసారథి, కార్యదర్శి ఎంవీ.రమణయాదవ్, రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులు ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, ఖమ్మం డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, కార్పొరేటర్లు నాగండ్ల దీపక్ చౌదరి, కమర్తపు మురళి, పగడాల నాగరాజు, హార్వెస్ట్ స్కూల్ కరస్పాడెంట్ పి.రవిమారుత్, మానసిక వైద్యుడు సతీష్‌బాబు పాల్గొన్నారు.

నలుగురికి ఉపాధ్యాయ రత్న అవార్డులు

7న హైదరాబాద్‌లో ప్రదానం చేయనున్న ‘పూలే’ బాధ్యులు


మంజులరావు


సుభాషిణి


కృష్ణవేణి


విజయ

విద్యారణ్యపురి: హన్మకొండకు చెందిన నలుగురు టీచర్లు తెలంగాణ ఉపాధ్యాయ రత్న రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. సావిత్రిబాయిపూలే మెమోరియల్ ఆర్గనైజేషన్ బాధ్యులు ప్రతి ఏడాది జనవరి 3న సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకుని విద్య, సామాజికపరమైన సేవలను అందించే వారికి ఈ అవార్డులు అందజేస్తున్నారు. గీసుకొండ మండలం పీఎస్‌బీఎస్ తండాలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఎం.మంజులరావు, మచ్చాపూర్ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ బి.సుభాషిణి, ఎల్కతుర్తి ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ డి.కృష్ణవేణి, వసంతాపూర్ ఎస్‌జీటీ ఎస్.విజయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 7న హైదరాబాద్‌లో అవార్డులు అందజేయనున్నట్లు ఆర్గనైజేషన్ బాధ్యులు తెలిపారు.

అమ్మవారిపేట జాతర ప్రాంగణంలో సమ్మక్క, సారలమ్మ గద్దెలు



అమ్మవార్లకు పూజలు చేస్తున్న చైర్మన్, నాయకులు



‘అమ్మవారిపేట’పై శీతకన్ను

- జాతర ఏర్పాట్లపై అధికారుల నిర్లక్ష్యం
- రూ.18 లక్షలు మంజూరైనా కదలని అడుగు

మడికొండ: వేలాది మంది భక్తులు తరలివచ్చే అమ్మవారిపేట సమ్మక్క–సారలమ్మ జాతరపై అధికారులు శీతకన్ను వేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడో మేడారంగా ప్రసిద్ధి చెందింది ఈ అమ్మవారిపేట జాతర. 1976లో కోడూరి రాజలింగమూర్తి ఈ జాతరను తొలిసారి ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు సమ్మక్క, సారలమ్మ దేవతలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ జాతరకు నగర చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. రెండు సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే ఈ జాతర సందర్భంగా ఆ ప్రాంతంలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని భక్తులు వాపోతున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో మేడారం, అగ్రంపహాడ్ జాతర తర్వాత అమ్మవారిపేటకే భక్తులు ఎక్కువగా వస్తారు. గ్రేటర్ పరిధిలో ఉన్నందున జాతరకు పెద్ద మొత్తంలో నిధులను విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. గత జాతరలో రూ.89.25 లక్షల నిధులతో రోడ్లు నిర్మించగా ప్రస్తుతం గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెడీమిక్స్ ప్లాంట్, మొరం లారీలతో ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ జాతరకు భక్తులు రావడానికి కడిపికొండ, ఉర్సుగుట్ట మీదుగా రెండు రోడ్లు ఉండగా అవి శిథిలమైపోయాయి. రెండేళ్లకోసారి జాతర సమయంలోనే రోడుపై మట్టి పోసి వదిలేస్తున్నారు. జాతర అభివృద్ధి పనులకు రూ.18లక్షల నిధులను మంజూరు చేసి పది రోజులు అవుతున్నా ఇప్పటికీ ఎలాంటి పనులు చేపట్టడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి బుధ, గురు, ఆదివారం పలు గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. వీరికి కనీసం నీటి వసతి లేక దాహార్తితో అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా గ్రేటర్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అమ్మవారిపేటలో కనీస వసతులు కల్పించాలని 33వ డివిజన్ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అమ్మవార్లకు అలంకరణ

మడికొండ: కాజీపేట మండలం అమ్మవారిపేట జాతరలోని శ్రీసామ్మక్క–సారలమ్మ, లక్ష్మి దేవతలను గురువారం నిర్వాహకులు అలకంరించారు. ఈ సందర్భంగా జాతర వ్యవస్థపకుడు కొడూరు రాజలింగమూర్తి రెండవ వర్ధంతి నిర్వహించారు. అనంతరం జాతర చైర్మన్ కొడూరు భిక్షపతి జాతర కమిటీ త్వరలోనే ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఆర్గనైజర్ దాసి రాందేవ్, పూజారులు బైరిశెట్టి శ్యాంసుందర్, వడ్డె కొటేశ్వర్‌రావు, 33వ డివిజన్ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, టీఆర్‌ఎస్ నాయకులు ఊకంటి వనంరెడ్డి, బేతి సమ్మిరెడ్డి, కొమ్ము కుమార్‌యాదవ్, మైదం మొగిళి, మైదం కుమార్ అమ్మవార్లను దర్శించుకున్నారు.

కేయూలో బుద్ధుడికి నివాళి



కార్యక్రమంలో పాల్గొన్న కట్టయ్య తదితరులు

కేయూ క్యాంపస్: రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన బొమ్మల్ల కట్టయ్య గురువారం కేయూను సందర్శించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ గ్రంథాలయంలోని బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.భద్రునాయక్ ఉన్నారు.

ఎన్‌టీపీఏ పోస్టును డీడీఓగా మార్చాలి

మంత్రి హరీష్‌రావును కోరిన ఇరిగేషన్ ఉద్యోగులు

వరంగల్: నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ కార్యాలయాల్లోని నాన్ టెక్నికల్ పర్సనల్ అసిస్టెంట్(ఎన్‌టీపీఏ) పోస్టును డీడీఓ(ఐబీ)గా మార్చాలని నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావును ఎన్‌టీపీఏ ప్రతినిధి ఎస్.విశ్వంభరచారి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రిని కలసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా విశ్వంభరచారి మాట్లాడుతూ జిల్లాల్లోని ఎస్‌ఈ కార్యాలయాల్లో పరిపాలన వ్యవహారాలు చూస్తున్న తమను ఎన్‌టీపీఏలుగా గుర్తించడం సరికాదని పేర్కొన్నారు. వినతిని పరిశీలించిన మంత్రి పేరు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చారి తెలిపారు. అనంతరం మంత్రి హరీష్‌రావు, ఈఎన్‌సీ నాగేందర్‌రావు, డిప్యూటీ ఈఎన్‌సీ అనిత, డీడీఏ గోవర్ధనచారికి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి హరీష్‌రావుకు వినతి పత్రం ఇస్తున్నచారి

సమాచారం

నేటి నుంచి హస్తకళా ప్రదర్శన

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ, భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో అఖిల భారత హస్తకళలు, చేనేత వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ ఏడీ మురళీకృష్ణ తెలిపారు. హన్మకొండలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈనెల 14 వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని మురళీకృష్ణ తెలిపారు.

సంకట హర చతుర్థి పూజలు

కాజీపేట: శ్వేతార్క మూలగణపతి దేవాలయలో శుక్రవారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణశర్మ తెలిపారు. గణపతికి దుర్వాహోమం, సప్తవర్ణాభిషేకం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా స్వామి వారికి సిద్ధిబుద్ధితో నిత్య కల్యాణం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో భాగస్వాములు కావాలని కోరారు.

రేపు మేదరి మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ మేదరి మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు సంఘం వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు డి.సరిత తెలిపారు. హన్మకొండలోని రాజరాజనరేంద్ర భాషా నిలయంలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ రాష్ట్ర కమిటీల నియామకం అనంతరం మొదటిసారిగా హన్మకొండలోని ఎన్జీవోస్‌కాలనీలో మహిళా విభాగం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మేదరి కుల బంధువులు హాజరై జయప్రదం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మండలి విప్ రాక

కాజీపేట అర్బన్: శాసన మండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు శుక్రవారం నగరానికి రానున్నారు. హైదరాబాద్ నుంచి ఘట్‌కేసర్, ఆలేరు, జనగామ మీదుగా నగరానికి చేరుకుంటారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం ఇటికాలపల్లిలో నిర్వహించే పల్లె ప్రగతి కార్యక్రమంలో పాల్గొననున్నారు. అదేవిధంగా శనివారం హన్మకొండలోని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి పూలే అవార్డు



కుమారస్వామిని అభినందిస్తున్న అయిలయ్య

విద్యారణ్యపురి: హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి చల్ల కుమారస్వామి రాష్ట్రస్థాయి పూలే అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో విద్యార్థి కుమారస్వామిని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, అధ్యాపకులు, ఉద్యోగులు అభినందించారు.

కేయూలో పుస్తకం ఆవిష్కరణ



కేయూలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ సాయన్న

కేయూ క్యాంపస్: హన్మకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని ఎకనామిక్స్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ గుగులోతు కవిత రచించిన గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధి పుస్తకాన్ని కేయూ వీసీ ప్రొఫెసర్ ఆర్. సాయన్న గురువారం క్యాంపస్‌లోని అకడమిక్ కమిటీ హాల్‌లో ఆవిష్కరించారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ పర్యవేక్షణలో కవిత పీహెచ్‌డీ చేశారు. ఆ గ్రంథాన్ని పుస్తక రూపంలోకి కవిత తీసుకొచ్చారు. న్యూఢిల్లీ అభిజిత్ పబ్లిషర్స్ దీనిని ముద్రించారు. కార్యక్రమంలో కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, విభాగం అధిపతి బి.సురేష్‌లాల్, అధ్యాపకులు రమేష్‌రెడ్డి, శ్రీధర్‌కుమార్‌లోథ్, సాంబశివరావు, బి.రాంచంద్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

విద్యారణ్యపురి: టీపీటీఎఫ్ వరంగల్ అర్బన్ జిల్లా శాఖ బాధ్యులు రూపొందించిన క్యాలెండర్‌ను గురువారం హన్మకొండలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.సోమేశ్వర్, జనరల్ సెక్రటరీ యు.అశోక్, బాధ్యులు, ఎ.కుమారస్వామి, జె.స్వామి, పి.మనోజ్, భిక్షపతి, జి.వెంకటేశ్వర్‌రావు, ఎం.బ్రహ్మచారి పాల్గొన్నారు.

పొన్నాలను కలిసిన రెడ్‌క్రాస్ చైర్మన్



పొన్నాలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

కాజీపేట అర్బన్: రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి గురువారం హన్మకొండలో టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ్‌చందర్‌రెడ్డిని లక్ష్మయ్య అభినందించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ములుగు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, బత్తిని శ్రీనివాస్, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

శుక్రవారం | జనవరి | 5 | 2018
సాక్షి

జాతీయ రహదారికి మరమ్మతు

- ఆత్మకూరు నుంచి చల్వాయి వరకు పనులు
- రోలింగ్ చేయకుండా తూతూ మంత్రంగా బీటీ


జాతీయ రహదారిపై మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

ములుగు: మేడారం మహాజాతర ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభంకానున్నందున జాతీయ రహదారి 163పై సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. వరంగల్ రూరల్ జిల్లాలోని ఆత్మకూరు నుంచి గోవిందరావుపేట మండలం చల్వాయి వరకు సుమారు 40 కిలో మీటర్ల పరిధి మేర ఏర్పడిన గుంతల్లో బీటీ వేసి పూడ్చుతున్నారు. దీంతో పాటు నాణ్యత దెబ్బతిన్న ప్రాంతాల్లోనూ పై పూతగా బీటీ వేస్తున్నారు. ఇంతకు ముందే చల్వాయి నుంచి పస్రా వరకు మరమ్మతు చేశారు. గత ఐదు రోజులు పనులు జరుగుతున్నాయి.

తూతూ మంత్రంగా..

వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చే భక్తులకు అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెప్పుకుంటున్నారు. అయితే వేలాది వచ్చే వాహనాల రాకపోకలను తట్టుకోవడానికి వీలుగా గుంతలను తవ్వి బీటీ నింపాల్సిన కాంట్రాక్టర్ అవేమీ పాటించకుండా రోడ్డుపై పూతగా బీటీని పరుస్తూ తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నాడని ఆరోపణలు వినవస్తున్నాయి. పైగా వేస్తున్న బీటీపై రోలింగ్ చేయకుండా కేవలం దిమ్మెలతో అంటీముట్టనట్లు సరిచేస్తున్నారు.

10 లోగా పూర్తిచేయాలి

- ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు
- గిరిజన మ్యూజియంపై అధికారులతో సమావేశం


మేడారం మ్యూజియంపై డీడీ, అసిస్టెంట్ డైరెక్టర్లతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు

ఏటూరునాగారం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ఒకేచోట నిలిపే గిరిజన మ్యూజియం పనులు ఈనెల 10లోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం లోని ఐటీడీఏ పీఓ చాంబర్‌లో గురువారం గిరిజన మ్యూ జియం డిప్యూటీ డైరెక్టర్ డి. సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్లు రామకృష్ణ, శంకర్, మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ కాక లింగయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావుతో పీఓ సమావేశమయ్యారు. మేడారం జాతర లోపు మ్యూజియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. గిరిజన మ్యూజియం పైన కోయకులస్తులు నృత్యాల సమయంలో తలపై ఉపయోగించే కొమ్ములను సుమారు 12 ఫీట్ల ఎత్తులో అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మ్యూజియంకు రంగును గిరిజనులు ఎక్కువగా ఇళ్లకు ఉపయోగించే పుట్టమన్ను కలర్, పేడ కలర్‌ను వేయాలన్నారు. చినుకుల ముగ్గులను మహిళలతోనే వేయించాలని సూచించారు. శ్రీ సమ్మక్క–సారలమ్మ గిరిజన మ్యూజియం అనే పేరును స్టీల్‌తో తయారు చేయించి బోర్డును అమర్చాలన్నారు. గోడకు అమర్చే షోకేజ్‌లు 20, ఫ్లోరింగ్‌పై అమర్చే బీరువాలు 17 తయారు చేసేందుకు ప్రత్యేక కార్పెంటర్‌ను పిలిపించి కొలతను తీయించినట్లు డీడీ సత్యనారాయణ పీఓకు వెల్లడించారు. మ్యూజియంలో అమర్చే వస్తువులను సేకరించేందుకు పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉండాలని పీఓ అన్నారు. లఘు చిత్రాల నమూనాలను హైదరాబాద్ నుంచి తెప్పించి వాటిని పరిశీలించిన తర్వాత ఎంపిక చేయడం జరుగుతుందని పీఓ అన్నారు. సేకరించిన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. పెసా జిల్లా కన్వీనర్ కొమురం ప్రభాకర్, ఆర్ఓఎఫ్ఆర్ ప్రభాకర్, ఫొటోగ్రాఫర్ రాజేష్ పాల్గొన్నారు.

ఇసుక బస్తాల కట్టల పనులు షురూ

ఎస్ఎస్‌తాడ్వాయి: జంపన్నవాగులో ఇసుక కట్టల ఏర్పాట్ల పనులను ప్రారంభించారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగులో నీటి లభ్యత కోసం నాలుగు చోట్ల శాశ్వత చెక్ డ్యాం నిర్మాణాల కోసం నిధులు కేటాయించా రు. కాని ఆ పనులు జాతర వరకు పూర్తయ్యే పరిస్థితి లేదనే ఉద్దేశంతోనే ఆ శాఖ అధికారులు తాత్కాలిక ఇసుక బస్తాల అడ్డుకట్టల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపారు.అందుకు స్పందించిన ప్రభుత్వం రూ కోటిపైగా నిధులు మంజూరు చేసింది. వాగులో మునిగి స్నానమాచరించే భక్తులకు నీటి లభ్యం కోసం జంపన్నవాగులో 12 చోట్ల ఇసుక బస్తాల అడ్డు కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నీటి నిల్వ తోపాటు ఇసుక బస్తాలపై నుంచి నీళ్లు సమాంతరంగా వెళ్లనున్నాయి.


జంపన్నవాగులో ఇసుక బస్తాలు వేస్తున్న కూలీలు

జాతరలో జేబుదొంగలు..!


బాధితుడు వీరభద్రం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో జేబు దొంగల బెడద మొదలైంది. జాతరకు ముందుగానే మేడారంలో జేబు దొంగలు ప్రవేశించారు. ఇప్పటికే నాలుగైదుసార్లు భక్తుల జేబులను కొట్టేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. తాజాగా గురువారం ఓ భక్తుడి జేబులోని డబ్బులను కొట్టేసిన బాలికను భక్తులు పట్టుకున్నారు. అంతేగాకుండా ఖమ్మం జిల్లాకు చెందిన వీరభద్రం కుటుంబ సమేతంగా మేడారం వచ్చారు. సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న క్రమంలో ఆయన ప్యాంట్ జేబులోని డబ్బులను కొట్టేశారు. తన జేబులో రెండు వేల నోట్లు రూ. 40 వేలకు పైగా ఉన్నాయని సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో దొంగలు తన డబ్బులు దొంగిలించారని ఆవేదన వ్యక్తం చేశాడు. సీసీ కెమెరాల ద్వా రా దొంగలను కనుక్కొనేందుకు ఎండోమెంట్ కార్యాలయంలోని సీసీ పుటేజీలను బాధిత భక్తులు పరిశీలించారు. ఈ విషయంపై భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది.

మేడారం ముచ్చట్లు

తరలివచ్చి.. మొక్కులు తీర్చి..

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సమయం దగ్గర పడుతున్న కొద్దీ భక్తుల రాక ఊపందుకుంది. వనదేవతలను దర్శించుకునేందుకు గురువారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం, కొబ్బరికాయలు, ఒడిబియ్యం, కానుకలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చెట్ల కింద వంటావార్పుతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి.


యాటతో మొక్కుతున్న భక్తులు


కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు


నృత్యం చేస్తున్న భక్తులు


తల్లులకు ఎత్తు బంగారం సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు




బొమ్మలు, లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేస్తున్న భక్తులు

మరుగున పడ్డ మరుగుదొడ్ల పనులు

మేడారంలో మరుగుదొడ్ల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. జాతరకు వచ్చే భక్తు ల సౌకర్యార్థం 4వేల సెమీ పర్మనెంట్ , 1350 తాత్కాలిక, 60 పర్మనెంట్, 60 వీఐపీ టాయిలెట్లు జాతర జరిగే పరిసర ప్రాంతాల్లో నిర్మించాల్సి ఉంది. ఇప్పటివరకు వందల సంఖ్యలో కూడా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. జాతర కోసం ఆధునిక మొబైల్ టాయిలెట్లను తెప్పించినా వాటిని వీఐపీ భక్తులకే అని పక్కన పెట్టారు. బేస్‌మెంట్ లెవల్ లోనే మరుగుదొడ్ల నిర్మాణాలు ఉన్నాయి.

మరుగుదొడ్ల కోసం కడుతున్న బేస్‌మెంట్లు


నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు


గోదావరి జలాలు అందేనా?

మిషన్ భగీరథ పథకం కింద జాతర భక్తులకు గోదావరి జలాలను అందించేందుకు మేడారంలో వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నారు. ట్యాంకు ద్వారా జాతరలోని నల్లాలకు పైపులైన్ కనెక్షన్ పనులు చేయాల్సి ఉంది. నిర్మాణ పనులను బట్టి చూస్తే జాతర వరకు కూడా పూర్తయ్యేది అనుమానంగా ఉంది. జాతరలో 50శాతం మేరకేనా గోదావరి జలాలను భక్తులు అందిస్తామని చెబుతున్న అధికారులు ఆ దిశగా పనులు వేగవంతం చేయడంలో అశ్రద్ధ చూపుతున్నారు.

మహాజాతర.. పనులు పాతర

సమీపిస్తున్న మేడారం జాతర

- నేటికీ పూర్తికాని అభివృద్ధి పనులు
- పదిరోజులే డెడ్‌లైన్
- జాడలేని తాగునీటి పైపులైన్
- నత్తనడకన మరుగుదొడ్ల నిర్మాణం
- జాతర భక్తులకు ‘మిషన్ భగీరథ’ నీళ్లు అనుమానమే
- వైద్య సేవలు అంతంతమాత్రమే..

మేడారం

జాతర సమీపిస్తున్నా అధికారుల అలసత్వం, పాలకుల పట్టించుకోని తనంతో భక్తులకు ఇక్కట్లు తప్పేటట్లు లేవు. ఎప్పటిపనులు అప్పడే చేయడం అలవాటు చేసుకున్న అధికారులు ఈ సారి జాతరకు కూడా పది రోజుల ముందు హడావుడి చేసి చేతులు దులుపుకునేలా ఉన్నారు. కొత్త రాష్ట్రం, కొత్త జిల్లా ఏర్పడినా జాతర లో శాశ్వత పనుల ఊసే లేదు. తాత్కాలిక పనులు చేయడం తోనే అధిక లాభాలున్నాయని పాలకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు

-ఎస్ఎస్ తాడ్వాయి

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర మహాజాతర సమయం ఇంకా 25 రోజులే ఉంది. జాతర సమీపిస్తున్న తరుణంలో భక్తుల భక్తుల తాకిడి మేడారానికి రోజురోజుకు పెరుగుతూనే ఉంది. కానీ.. జాతర అభివృద్ధి పనులు నత్తేనయం అన్నట్లుగా సాగుతున్నాయి. ఈనెల 15కల్లా పనులన్నింటినీ పూర్తి చేయాలని విధించిన డెడ్‌లైన్ పట్టుమని పది రోజుల కూడా లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణం పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. కొత్త తాగునీటి పైపులైన్ నిర్మా ణం పనులు సైతం ప్రారంభించలేదు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి హైదరాబాద్‌లో జాతర అభివృద్ధి పనులపై కొద్ది రోజుల క్రింత నిర్వహించిన సమీక్ష సమావేశంలో కూడా జనవరి 15కల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించినా పూర్తయ్యేది అనుమానంగా ఉంది. అధికారుల తీరును పరిశీలిస్తే జాతర నాటికి కూడా పనులు సాగేలా కనిపిస్తున్నాయి.

ఆలయానికి రంగులు ఎప్పుడు..?



దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ. 2.60 కోట్ల రంగుల పనులు జరుగుతున్నాయి. వీటితో కల్యాణ కట్టల నిర్మాణం, క్యూలైన్లకు మరమ్మతు, సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో పెయింటింగ్, లైటింగ్ తదితర ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు నామినేషన్ పద్ధతిలో ఇవ్వాలంటూ ఆదివాసీలు, టెండర్లు నిర్వహిస్తామంటూ దేవాదాయశాఖ అధికారులు తెలుపడంతో పనులు ఆగిపోయాయి. ఇటీవల కొలిక్కి వచ్చినప్పటికీ రంగుల పనులు మాత్రం ప్రారంభం కాలేదు. తడుకలు వేయడంతో క్యూలైన్ల బారీకేడ్లకు వేసిన రంగులు ఆరక భక్తుల చేతులకు అంటే అవకాశాలున్నాయి.

తాగునీటి పైపులైన్ పనులు


జాడలేని తాగునీటి పైపులైన్ పనులు

జాతరలో భక్తులకు తాగునీటి సౌకర్యం చాలా ప్రధానమైనది. తాగునీటి కోసం కాంట్రాక్టర్లు బోరుబావుల్లో మోటార్లు బిగించడం, జాతర పరిసరాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ నల్లాలను ఏర్పాటు చేస్తున్నారు. బోరుమోటార్ల ద్వారా నల్లాలకు తాగునీటి సరఫరా చేయాలి. కొత్త పైపులైన్ నిర్మాణం పనుల కోసం అధికారులు హైదరాబాద్‌లో వారు చెప్పిన పైప్రుల కంపెనీలోనే పైపులకు కాంట్రాక్టర్లు ఆర్డర్ చేశారు. సంబంధిత అధి కారులు అక్కడికి వెళ్లి పైపులను పరిశీలించి వారి ఒకే అంటే కాంట్రాక్టర్లు తీసుకురావాలనే నిబంధనలు ఉన్నాయి. పైపులకు కాంట్రాక్టర్లకు ఆర్డర్ చేసి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పైపులైన్ నిర్మాణం పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

వైద్య సేవలు అంతంతమాత్రమే..



జాతరకు నెలరోజుల ముందు నుంచే దేవతలను దర్శించుకునేందుకు మేడారానికి భక్తులు వేల సంఖ్యలో వచ్చిపోతున్నారు. కల్యాణ మండపం ఫస్ట్ ఫ్లోర్ భవన నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో వైద్యశాలను నేటికి ఏర్పాటు చేయలేదు. దీంతో భక్తులు వైద్య సేవల కోసం ఆస్పత్రి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.మూడు రోజుల క్రితం మేడారంలోని సబ్‌సెంటర్‌లో వైద్యశాల సేవలు ప్రారంభించినప్పటికీ గద్దెలకు కిలోమీటర్ల దూరం ఉండడంతో భక్తులకు సేవలకు ఏమాత్రం వినియోగంలోకి రావడం లేదు. భక్తుల సౌకర్యార్థం వైద్య సేవలు అందుబాటులో ఉంచాల్సి ఉంది.

క్యూలైన్లలోనే సాగుతున్న ఆర్టీసీ పనులు



దేశం నలుమూలల నుంచి జాతరకు రికార్డు స్థాయిలో 4,000 బస్సులు నడిపించాలని ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఏర్పాట్లు మాత్రం కాస్త నెమ్మదిగా సాగుతున్నాయి. ఆర్టీసీ సిబ్బంది కోసం తడుకలతో తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. క్యూలైన్ల పనులు మాత్రం ఇంకా సాగదీస్తున్నారు. టికెట్ బుకింగ్ కౌంటర్ల గదుల ఏర్పాట్లు పనులు చేపట్టలేదు. పనులు ఊపందుకోలేదు.

‘ఐనవోలు’ ఏర్పాట్లు పూర్తి చేయాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీ సునీత

ఐనవోలు(వర్ధన్నపేట): ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలు దగ్గర పడుతున్నందున ఏర్పాట్లను పూర్తి స్థాయిలో త్వరితగతిన పూర్తి చేయాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత అన్నారు. మండల కేంద్రంలోని ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. స్నానాల కోసం కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన అధునాతన షవర్లు, దుస్తులు మార్చుకునే గది, క్యూ ఏర్పాటు, టికెట్ కౌంటర్లు, నూతనంగా ఉత్తర, దక్షిణ దిశల్లో ఏర్పాటు చేసిన పుట్ ఓవర్ బ్రిడ్జిలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీపీ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాలక వర్గం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతమయ్యే విధంగా చూడాలని కోరారు. వీరి వెంట ఆలయ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ఈఓ సదానందం, సర్పంచ్ పల్లకొండ సురేష్, ఎంపీటీసీ బోళ్లపెల్లి మధు, దర్మకర్తలు తక్కళ్లపెల్లి చందర్‌రావు, యాకూబ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్తకొండ జాతరకు స్పెషల్ బస్సులు

హుజూరాబాద్ డీఎం ధరంసింగ్


డీఎం ధరంసింగ్

భీమదేవరపల్లి(హుస్నాబాద్): భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర నేపథ్యంలో మూడు రోజుల పాటు 250 ప్రత్యేక ఆర్టీసీ బస్సు ట్రిప్పులను నడపనున్నట్లు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డీఎం ధరంసింగ్ వెల్లడించారు. మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామిని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు పలు వివరాలు తెలిపారు. జాతరలో ప్రధాన ఘ ట్టాలైన 14, 15, 16 తేదీల్లో హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, గోపాల్‌పూర్, జీల్గుల మీదుగా 250 బస్ ట్రిప్పులను నడపనున్నట్లు తెలిపారు. హుజూరాబాద్ నుంచి కొత్తకొండకు పెద్దలకు రూ. 42, చిన్నలకు రూ. 21 టిక్కెట్ ధర నిర్ణయించామన్నారు. మూడు రోజుల పాటు కొత్తకొండ, హుజూ రాబాద్ నుంచి ప్రతి అరగంటకోమారు ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు వివరించారు. ఇందులో ఈఓ హరిప్రకాశ్‌రావు, టీఎంయూ అధ్యక్షులు పీఎ ల్.రావు, జనరల్ సెక్రటరీ ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పుల భద్రయ్య ఉన్నారు.

నియామకం

రాహుల్ గాంధీ యువసేన అర్బన్ కార్యదర్శిగా సుమన్




దేశాయిపేట: రాహుల్ గాంధీ యువసేన అర్బన్ జిల్లా కార్యదర్శిగా జన్ను సుమన్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు అడుప మహేష్ ఉత్తర్వులు జారీ చేశారు. పైడిపల్లి గ్రామానికి చెందిన సుమన్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నందున యువసేన కార్యదర్శిగా నియమించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, గ్రేటర్ నేతలు కట్ల శ్రీనివాసరావు, రాజనాల శ్రీహరి, అడుప మహేష్, ఎర్రల ప్రసాద్‌కు సుమన్ కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ కార్యదర్శిగా యాకూబ్‌ఖాన్



హన్మకొండ చౌరస్తా: బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ కార్యదర్శిగా మహ్మద్ యాకూబ్‌ఖాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంఘం గ్రేటర్ విభాగం అధ్యక్షుడు మేకల కేదారియాదవ్ గురువార ం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన కార్పొరేటర్ మిర్యాల్‌కార్ దేవేందర్, చెన్నం మధు, వెన్ను కొండయ్య, భూర అశోక్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా చకిలం రాజేశ్వర్‌రావు



హసన్‌పర్తి: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా హసన్‌పర్తికి చెందిన చకిలం రాజేశ్వర్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు వాసుదేవరావు ప్రకటించారు. ప్రస్తుతం రాజేశ్వర్ వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్‌గా కొనసాగుతున్నారు. గతంలో వాసవీ క్లబ్ హసన్‌పర్తి అధ్యక్షుడిగా వ్యవహరించారు. తన నియామకానికి సహకరించిన కార్పొరేటర్ నాగమళ్ల ఝాన్సీ–సురేష్, భీష్మనాథంకు రాజేశ్వర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

టీ ఇంటి పార్టీ జిల్లా సమన్వయకర్తగా రాజేష్‌ఖన్నా

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ ఇంటి పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్తగా బల్లా రాజేష్‌ఖన్నాను నియమించినట్లు రాష్ట్ర యవజన విభాగం అధ్యక్షుడు గుర్రాల సంతోష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు సుధాకర్, ఉపాధ్యక్షుడు ఝున్నం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి దొమ్మెటి వెంకటేష్‌కు రాజేష్‌ఖన్నా కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ విశ్వనాథరావుకు నివాళి

హన్మకొండ:

డాక్టర్ విశ్వనాథరావుకు ఎన్‌సీసీ డిస్ట్రిక్ట్ చీఫ్ కమిషనర్, జెడ్పీ సీఈఓ విజయ్‌గోపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌గౌడ్, ఎన్‌సీసీ అధికారులు వెంకటేశ్వర్లు, శ్రీపాల్‌రెడ్డి నివాళులర్పించారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఓసీ జేఏసీ నాయకుల పరామర్శ

కాజీపేట అర్బన్: హన్మకొండ హంటర్ రోడ్డులోని కెప్టెన్ లక్ష్మీకాంతారావు నివాసంలో గురువారం ఓసీ జేఏసీ నాయకులు కెప్టెన్‌ను కలిసి పరామర్శించారు. ఇటీవల ఆయన సోదరుడు విశ్వనాథరావు అమెరికాలో మృతి చెందారు. ఓసీ జేఏసీ నాయకులు కోదాడి రామారావు, గోపు జయపాల్‌రెడ్డి, సీఏ నారాయణ పరామర్శించారు. అనంతరం విశ్వనాథరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఓసీ జేఏసీ నేతలు



విశ్వనాథరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉప ఎన్నిక అభివృద్ధికి రెఫరెండం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి

హన్మకొండ: వరంగల్ మహానగరపాలక సంస్థలోని 44వ డివిజన్‌కు జరుగుతున్న ఉప ఎన్నిక అధికార పార్టీ నేతలు ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ చేసిన అభివృద్ధికి రెఫరండమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి అన్నారు. గురువారం 44 వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి కొలను సంతోష్‌రెడ్డి తరపున బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, అభ్యర్థి సతోష్ రెడ్డితో కలిసి ఆయన ప్రచారం చేశారు. టీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికను రావు పద్మకు రెఫరెండమని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఎన్నిక ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్‌కు రెఫరండమవుతాయన్నారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

కేంద్రం అందించే నిధులతోనే వరంగల్ నగర అభివృద్ధి జరుగుతోందని బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. గురువారం జిల్లా నాయకులతో కలిసి ఆయన 44 డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. రాంచందర్‌రావు మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం వరంగల్ అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. కొలను సంతోష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీజేపీ వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, నాయకులు చాడా శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

దర్గా కాజీపేట రోడ్డులో ఆక్రమణలపై వేటు

ఓచర్లు, బిల్లుల చెల్లింపులపై తొమ్మిది మంది అధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

వరంగల్ అర్బన్: దర్గా కాజీపేట–వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులో జరిగిన ఆక్రమణలపై గ్రేటర్ సూపరింటెండెంట్ జీవన్‌కుమార్‌కు రెండు ఇంక్రిమెంట్లలో కోత విధించారు. ఈమేరకు గ్రేటర్ అధికారులు వెల్లడించారు. దర్గా కాజీపేట రోడ్డులో ఎండీ రికార్డులు, లోకాయుక్తకు నుంచి ఫిర్యాదు అందింది. కాగా లోకాయుక్త ఆదేశాల మేరకు అప్పట్లో అకౌంటెంట్‌గా పనిచేసిన జీవన్‌కుమార్ రెండు ఇంక్రిమెంట్ల మేర కోత విధించినట్లు గ్రేటర్ అధికారులు వెల్లడించారు.

క్రైం కార్నర్

రైల్వే కోర్టులో 15 మందికి జరిమానా

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే కోర్టులో గురువారం 15 మందికి మెజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు. రైల్వే పరిసర ప్రాంతాల్లో రైల్వే అధికారుల అనుమతి లేకుండా తిరిగిన 15 మందిని కాజీపేట ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసులు నమోదు చేసి రైల్వే కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ 15 మందికి రూ.300 చొప్పున జరిమాన విధిస్తూ తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై నిర్భయ కేసు నమోదు

కాజీపేట అర్బన్: బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన ఘటనలో ఓ వ్యక్తిపై సుబేదారి పోలీసులు గురువారం నిర్భయ కేసు నమోదు చేశారు. సుబేదారి ఎస్సై దుర్గం మహేందర్ కథనం ప్రకారం.. హన్మకొండ పోస్టల్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి 15 సంవత్సరాల కూతురు ఉంది. అదే ప్రాంతానికి కూనూరు సుమన్ అనే వ్యక్తి బాలికను తరచుగా ప్రేమించాలని వేధిస్తున్నాడు. గురువారం తన గదిలోకి తీసుకుని వెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాలిక అరుపులతో స్థానికులు రావడంతో సుమన్ పారిపోయాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిర్భయ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాజీపేట రూరల్: హసన్‌పర్తి రైల్వేస్టేషన్ సమీపంలోని ఎల్లాపూర్ స్టేషన్ వద్ద 30 క్వింటాళ్ల రేషన్ బియ్యంను కాజీపేట ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. కాజీపేట ఆర్పీఎఫ్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డి గురువారం రాత్రి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లాపూర్ స్టేషన్ వద్ద బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కొందరు వ్యక్తులు రైలులో రేషన్ బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. 59 బస్తాల్లో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గురువారం సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

నలుగురు రౌడీషీటర్ల అరెస్ట్

కాజీపేట అర్బన్: వడ్డేపల్లి చర్చి వద్ద అనుమానాస్పదంగా తారసపడిన నలుగురు రౌడీషీటర్లను గురువారం ఏఎస్సై రమాదేవి అదుపులోకి తీసుకున్నారు. 44వ డివిజన్ ఉప ఎన్నిక సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రౌడీషీటర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గండ్రాతిసతీష్ తెలిపారు.

మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో

మడికొండ: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని 44వ డివిజన్ ఉపఎన్నిక దృష్ట్యా ముందుస్తు చర్యగా గురువారం మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నలుగురు రౌడీషీటర్లు మారం ప్రసాద్, పల్లపు అర్జున్, వస్కుల శ్రీకాంత్, పల్లపు కృష్ణను కాజీపేట తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

వెండితెర తెలుగు /హిందీ/ఇంగ్లిష్



తెలుగు :

ఎంసీఏ: వెంకట్రామ(వరంగల్–8702444344) 12.00, 3.00, 7.00, 10.00; రాధిక (వరంగల్–0870 6664566) 11.45, 3.00, 7.00, 10.00; అశోక (హన్మకొండ) 11.00, 2.00, 6.00, 9.00; శాంభవి (కాజీపేట 087025761 34),11.00, 2.00, 6.00, 9.00

(హిందీ) టైగర్ జిందాహై: జెమిని (వరంగల్–346218806), 12.00, 3.00, 7.00, 10.00,

ఒక్క క్షణం: అమృత (హన్మకొండ); 11.00, 2.00, 6.00, 9.00; దేవి (వరంగల్ – 0870 2420822), 12.00, 3.00, 7.00, 10.00

హలో: ఏషియన్ విజయ (హన్మకొండ); 11.00, 2.00, 6.00, 9.00; భవాని (కాజీపేట –08702576134) ,11.00, 2.00, 6.00, 9.00; జెమినీ మయూరి (వరంగల్– 93462 18806), 12.00, 3.00, 7.00, 10.00;

జవాన్: రామ్(వరంగల్ 9989415388), 11.45, 2.45, 6.45, 10.00;

2 కంట్రీస్: లక్ష్మణ్ (వరంగల్ – 989415388) 12.00, 3.00, 6.45, 9.45

మెడాక్స్ ఎస్–2: ప్రాజెక్ట్, 2 కంట్రీస్, ఒక్క క్షణం, హలో, టైగర్ జిందాహై, ఎంసీఏ

ఏషియన్ సినిమాస్: జ్యూమాంజి, ప్రాజెక్ట్, 2 కంట్రీస్, ఒక్క క్షణం, హలో, టైగర్ జిందాహై, ఎంసీఏ

నిజాయితీగా పనిచేస్తే బదిలీ బహుమానం

వరంగల్: నిజాయితీగా పనిచేసిన అధికారులకు ప్రభుత్వం బదిలీలను బహుమతిగా ఇచ్చిందని, ప్రాధాన్యం లేని కొలువుల్లో నియమించిందని బీసీ–జాక్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. తిరునహరి శేషు అన్నారు. దేశాయిపేటలో గురువారం ఎంబీసీ జాక్ రాష్ట్ర కన్వీనర్ పాలడుగు సురేందర్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కలెక్టర్ల బదిలీ అంశంపై చర్చించారు. శేషు మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల మాటలను ఖాతరు చేయకుండా నిజాయితీగా పనిచేస్తున్న భూపాలపల్లి, వరంగల్ రూరల్, జనగామ, మహబూబాబాద్ కలెక్టర్లను బదిలీ చేసి ప్రాధాన్యం లేని పోస్టింగులు ఇవ్వడం టీఆర్‌ఎస్‌కే చెల్లిందన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

విద్యారణ్యపురి: సీపీఎస్ విధానా న్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీపీఆర్‌టీయూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చెన్నయ్య డిమాండ్ చేశారు. గురువారం హన్మకొండలోని ఆసంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 7న గజ్వేల్‌లో జరిగే ఆయుధ ధర్మదీక్షకు ఉపాధ్యాయులు భారీగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. టీపీఆర్‌టీయూ ఐదు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు అడప రామారావు, దామెర కొండ సదానందం, కె సురేందర్,ఆర్ రాధాకృష్ణ, వి ఎల్లయ్య, పులిదేవేందర్, జ్యోతి, ఎం విజయభాస్కర్, వెంకటరెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

క్లీనింగ్ మిషన్ ఏర్పాటు చేయాలి

వరంగల్ సిటీ: మిర్చి యార్డులో ప్రత్యేక క్లీనింగ్ మిషన్‌ను ఏర్పాటు చేయాలని గుమస్తాల సంఘం ప్రతినిధులు మార్కెట్ చైర్మన్ కొంపెల్లి ధర్మరాజుకు వినతిపత్రం అందజేశారు. వేసవిలో ప్రతిరోజు యార్డులో నీళ్లు చల్లేలా ఏర్పాట్లు చేయాలని, ప్రతి గద్దెకు తాగునీరు సౌకర్యం కల్పించాలని, మార్కెట్లో ప్రైవేట్ క్యాంటిన్లను రద్దుచేసి, అన్నపూర్ణ క్యాంటిన్ల ద్వారా గుమస్తా, కార్మికులకు టిఫిన్, భోజన సౌకర్యాన్ని కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇనుముల మల్లేషం, రాజలింగం, రాజేందర్, శ్రీనివాస్, నర్సింగం, భిక్షపతి, వేణుగోపాల్ పాల్గొన్నారు.